





19 వ వసంతంలోకి ...

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఉత్తరాంధ్ర

విశాఖపట్నం, శ్రీకాకుళం

విజయనగరం

మంగళవారం 10-03-2026 పేజీలు : 20


# అడ్మిన్ నుంచి ఆర్ఐ వరకు అంతా 'మామూళ్లే'....



■ జీవీఎంసీ రెవెన్యూ విభాగంలో అవినీతి విలయతాండం ■ అడుగడుగునా లంచాల పర్వం ■ కాసులిస్తేనే ఇంటి పన్ను


2వ పేజీలో


## మహిళల శక్తివంతమైన పాత్రకు రైల్వే ప్రోత్సాహం..

● మహిళల అభివృద్ధికి రైల్వే కట్టుబాటు ● మహిళ సాధికారతను ప్రోత్సహించడంలో రైల్వే ముందుంది ● డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా





3 లో


# ఇది ముమ్మాటికీ హత్యాప్రయత్నమే..?




6వ పేజీలో


## హైకోర్టు ఆదేశాలు భేఖాతర్



● భీమిలి లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలను తొలగించాలన్న హైకోర్టు

● హైకోర్టు ఆదేశాలను పట్టించుకోని అధికారులు


(వార్త 3వ పేజీలో)


## చీకట్లో కుట్ర కు అధికారులు ప్రోత్సాహం..!!






3వ పేజీలో

# అడ్మిన్ నుంచి ఆర్.ఐ వరకు.. అంతా మామూళ్లే

**- జీవీఎంసీ రెవెన్యూ విభాగంలో అవినీతి విలయతాండం**
**- అడుగడుగునా లంచాల పర్వం - కాసులిస్తేనే ఇంటి పన్ను - పన్ను రేటు ఫిక్స్ చేయాలంటే 'చేయి తడపాల్సిందే'**

**విశాఖపట్నం, మార్చి 9, మేజర్‌న్యూస్:** ప్రజా సేవ చేయాల్సిన జీవీఎంసీ యంత్రాంగం కాస్తా.. అక్రమ సంపాదనకు అడ్డాగా మారుతోంది. ముఖ్యంగా రెవెన్యూ విభాగంలో అవినీతి అట్టడుగు స్థాయి నుండి పైస్థాయి వరకు వేళ్లూనుకుపోయింది. కొత్తగా కట్టుకున్న ఇంటికి పన్ను వేయించుకోవాలన్నా, ఖాళీ ప్లాటుకు పన్ను కట్టాలన్నా.. నిబంధనల కంటే ముడుపులకే ప్రాధాన్యత పెరిగిపోయింది. ఇటీవల జోన్ 4లో వెలుగు చూసిన ఒక ఉదంతం ఈ విభాగంలోని అక్రమాలకు అద్దం పడుతోంది. ఒక బిల్డర్ నిబంధనలకు విరుద్ధంగా అదనపు అంతస్తు నిర్మించి, పది ప్లాట్లకు పన్ను వేయాలని దరఖాస్తు చేసుకున్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న రెవెన్యూ బృందం, డీవియేషన్ పెనాల్టీల పేరుతో భయపెట్టింది. చివరకు ఒక్కో ఫ్లాటుకు 10 వేల రూపాయల చొప్పున మొత్తం లక్ష రూపాయల ముడుపులు తీసుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. డాక్యుమెంట్ల ప్రకారం కొలతలు ఉన్నప్పటికీ, తాము 'మేలు' చేశామంటూ ఆర్.ఐ స్థాయి అధికారులు నమ్మబలుకుతుండటం గమనార్హం.

**- ఫిక్స్‌డ్ రేట్లు.. అడుగుకో లంచం!**

వార్డు అడ్మిన్ దగ్గర మొదలయ్యే ఈ వసూళ్ల పర్వం ఆర్.ఐ, ఆర్.ఓల మీదుగా సాగుతోంది. దరఖాస్తుదారుల నుంచి వసూళ్లకు ఒక పక్కా ప్లాన్ ప్రకారం రేట్లు నిర్ణయించినట్లు తెలుస్తోంది. అపార్ట్‌మెంట్ ఫ్లాట్లకు రూ.5 వేల నుంచి రూ.8 వేల వరకు, వసూలు చేస్తున్నట్లు సమాచారం. అలాగే ఇండిపెండెంట్ ఇళ్లకు అంతస్తు లేదా విస్తీర్ణాన్ని బట్టి రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకు డిమాండ్‌చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ ధరలు చెల్లిస్తేనే ఫైలు ముందుకు కదులుతుందని, లేదంటే కొర్రీలు పెడుతూ నెలల తరబడి తిప్పుకుంటున్నారని బాధితులు వాపోతున్నారు.

**- పోస్టింగుల కోసం 'లక్షల' పెట్టుబడి**

రెవెన్యూ విభాగంలో కీలక పోస్టుల కోసం కింది స్థాయి ఉద్యోగులు విపరీతమైన పోటీ పడుతున్నారు. ఇటీవల 47 మంది ఆర్‌ఐలకు కొత్తగా పోస్టింగులు ఇచ్చారు. వీరంతా రాజకీయ నాయకుల సిఫార్సులతో, ఉన్నతాధికారుల అండదండలతో కీలక ప్రాంతాల్లో పాగా వేశారు. లక్షల రూపాయలు వెచ్చించి ఈ పోస్టింగులు దక్కించుకున్న వారు, ఇప్పుడు ఆ పెట్టుబడిని వడ్డీతో సహా రాబట్టేందుకు వార్డులపై పడి దండిగా డబ్బులు దండుకుంటున్నారు. నగరంలో 13 మంది ఆర్‌ఓలు, 578 మంది వార్డు అడ్మిన్లు ఈ వ్యవస్థలో పనిచేస్తున్నారు. వీరిపై పర్యవేక్షణ ఉంచాల్సిన డిప్యూటీ కమిషనర్ స్థాయి అధికారులు కింది స్థాయి సిబ్బందిని నియంత్రించలేకపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. 'తలో చేయి.. అందరికీ వాటాలు' అన్న చందంగా వ్యవస్థ తయారవ్వడంతో, ఉన్నతాధికారులు సైతం మిన్నకుండిపోతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

**- ఏసీబీ దాడులు జరిగినా మారని తీరు**

గతంలో భీమిలి జోన్‌లో ఆర్.ఐ గా పనిచేసిన ఎం. రాజు అనే అధికారి లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కడం అప్పట్లో సంచలనం సృష్టించింది. ఇలా ఎంతో మంది అధికారులు పట్టుబడుతున్నప్పటికీ, రెవెన్యూ విభాగంలో మార్పు రావడం లేదు. పాత బకాయిలు, డిమాండ్ వసూళ్లపై శ్రద్ధ చూపని సిబ్బంది, కొత్త పన్నులు వేయడంలో మాత్రం అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. ఎందుకంటే, అక్కడే వారికి 'అదనపు ఆదాయం' లభిస్తోంది.

**- పెనాల్టీల పేరుతో బెదిరింపులు**

భవనాలకు ఆక్యుపెన్సీ పత్రాలు ఉన్నప్పటికీ, ఏదో ఒక చిన్న డీవియేషన్ చూపించి భారీ పెనాల్టీలు వేస్తామని అధికారులు బెదిరిస్తున్నారు. బీపీఎస్ పత్రాలు ఉన్నా కూడా ప్లాన్ విస్తీర్ణాన్ని బట్టి పన్ను వేయాలంటూ కొత్త పల్లవి అందుకుంటున్నారు. సామాన్యుల అసహాయతను పెట్టుబడిగా మార్చుకుంటున్న ఈ అవినీతి తిమింగలాలకు అడ్డుకట్ట వేసే వారే కరువయ్యారు. ప్రభుత్వం, జీవీఎంసీ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, ఈ విభాగాన్ని ప్రక్షాళన చేయాలని, పారదర్శకమైన ఆన్‌లైన్ విధానాన్ని మరింత పటిష్టం చేయాలని నగరవాసులు కోరుతున్నారు.

# హైకోర్టు ఆదేశాలు భేఖాతర్

**- భీమిలి లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలను తొలగించాలన్న హైకోర్టు - హైకోర్టు ఆదేశాలను పట్టించుకోని అధికారులు**

**భీమిలి, మార్చి 09, మేజర్‌న్యూస్:** భీమిలి బీచ్ తీర ప్రాంతంలో ఉన్నటువంటి కొన్ని హోటల్స్ ను నిబంధనలకు విరుద్ధంగా నిర్మించాలని స్థానికులు హైకోర్టులో కొద్దిరోజులు క్రితం కేసు నమోదు చేయడం జరిగింది. ఈ కేసును విచారించిన హైకోర్టు జివిఎంసి అధికారులకు, రెవెన్యూ అధికారులకు నిబంధనలకు విరుద్ధంగా నిర్మించినటువంటి ఈ హోటల్స్ ను తొలగించాలని హైకోర్టు ఆదేశించడం జరిగింది. నీ అక్రమ నిర్మాణాలను రెండు వారాలలో వాళ్లంతటి వాళ్లే తొలగించాలని నోటీసులు ఇస్తామని, వాళ్లు తొలగించని పక్షంలో మేమే తొలగిస్తామని జీవీఎంసీ 2025 సెప్టెంబర్ 20వ తేదీన హైకోర్టుకు వివరణ ఇచ్చింది. సుమారు ఆరు నెలలు గడుస్తున్న జీవీఎంసీ ఈ అక్రమ కట్టడాలని కూల్చకుండా, కాలయాపన చేస్తూ వచ్చింది. మార్చి 12వ తేదీన ఈ కేసుకు సంబంధించి వాయిదా ఉండటం కారణం చేత, జీవీఎంసీ రెవెన్యూ అధికారులు ఐదు కట్టడాలకు సోమవారం సీల్ వేయడం జరిగింది. విరాగో రెస్ట్రో, బి –జాగ్ బీచ్ క్లబ్, సాంక్టమ్ బీచ్ రిసార్ట్స్, తీరం రిసార్ట్స్, మెర్లిన్ కే వంటి ప్రముఖ హోటల్స్ కు సోమవారం అధికారులు సీలు వేశారు. హైకోర్టు అక్రమ నిర్మాణాలను అధికారులకు ఆదేశాలు జారీ చేసినప్పటికీ, కేవలం ఇలా సీల్ వేసి చేతులు దులుపుకున్నారు. ఈ అక్రమ నిర్మాణాల వెనుక నేతల హస్తం ఉందని, అందువల్లనే ఇలా సీల్ వేసి మమ అనిపించుకున్నారని స్థానికులు వాపోతున్నారు. అదే పేదలకు సంబంధించిన నిర్మాణాలు అయితే వెంటనే కూల్చివేసేవారని, బడా బాబులుకు సంబంధించిన నిర్మాణాలు కావడం వలన మాత్రమే అధికారులు ఈ అక్రమ నిర్మాణాలను కూల్చలేకపోతున్నారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. మరీ ముఖ్యంగా అధికారులు కాసులకు కక్కుర్తి పడి ఇటువంటి అక్రమ నిర్మాణాలకు కొమ్ము కాస్తున్నారని స్థానికులు చర్చించుకుంటున్నారు.

# నగరంలో వాహనాల విస్తృత తనిఖీలు

**- కట్టుదిట్టమైన విజిబుల్ పోలీసింగ్ - మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై కఠిన చర్యలు -ప్రజల భద్రతకు నగర పోలీసులు అప్రమత్తం**

**విశాఖ క్రైం, మార్చి 09, మేజర్‌న్యూస్:** నగర భద్రతను మరింత బలోపేతం చేయడంతో పాటు నగరం గుండా మాదకద్రవ్యాల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టే లక్ష్యంతో విశాఖ నగర పోలీసులు విస్తృత స్థాయిలో విజిబుల్ పోలీసింగ్ మరియు వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి, అదనపు జిల్లా మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు నగరంలోని పలు కీలక ప్రాంతాల్లో అధికారులు, సిబ్బంది సమన్వయంతో ఈ తనిఖీలు చేపట్టారు. ప్రధాన రహదారులు, కూడళ్లు మరియు ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే ప్రాంతాల్లో వాహనాలను ఆపి క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఈ చర్యల ద్వారా నేర కార్యకలాపాలపై కట్టుదిట్టమైన నియంత్రణ సాధించడంతో పాటు మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు పోలీసులు తెలిపారు.



ప్రజలకు సురక్షితమైన, ప్రశాంతమైన వాతావరణం కల్పించేందుకు నగర పోలీసులు నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అలాగే ప్రజలు కూడా చట్టాలు, నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని అధికారులు సూచించారు.

# 93 వ వార్డులో 7.26 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం



**విశాఖపట్నం, మార్చి 9, మేజర్‌న్యూస్:** మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన పెందుర్తి జోన్ 93 వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాలలో సుమారు రూ. 7.26 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు, వార్డ్ కార్పొరేటర్ రాపర్తి కన్నా లతో కలిసి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ నగరాభివృద్ధి కి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేస్తుందని మేయర్ తెలిపారు. పెందుర్తి జోన్ 93 వ వార్డు పరిధిలోని పాత గోశాల, సమతా కాలనీ, ఈస్ట్ పాయింట్ కాలనీ, గణేష్ కాలనీ, శ్రీనివాస్ నగర్, భరత్ నగర్, ప్రహ్లాదపురం, సాయి మాధవ్ నగర్ తదితర ప్రాంతాలలో సుమారు రూ.726.12 లక్షల జీవీఎంసీ నిధులతో సిసి రోడ్లు, గ్రీన్ బెల్ట్ ఏరియాలో ఎమ్మెస్ గ్రిల్స్, రిటనింగ్ వాల్స్, లైబ్రరీ, పించిని దారుల కొరకు బిల్డింగ్ నిర్మాణాలు, కమ్యూనిటీ హాల్ నిర్మాణం, ఆర్ సి సి (ఎస్ డబ్ల్యూ ) డ్రైన్, తారు రోడ్ నిర్మాణం, జిమ్ సామగ్రి, పిల్లల ఆట వస్తువులు, ప్రహ్లాదపురంలోని చెరువుకు చైన్ లింక్ మెస్ ఏర్పాటు చేసేందుకు, పరేలు గ్రౌండ్ లోని బర్నింగ్ షెడ్ నిర్మాణం, కళ్యాణ్ మండపం మొదటి అంతస్తు నిర్మాణం, మరో కళ్యాణ మండపానికి విద్యుత్ అలంకరణ ,పెయింటింగ్, మరమ్మత్తులు మొదలైన అభివృద్ధి పనులకు పెందుర్తి శాసనసభ్యులతో కలిసి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన చేసామన్నారు. అనంతరం పెందుర్తి శాసనసభ్యులు మాట్లాడుతూ నగర అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని పెందుర్తి నియోజకవర్గం లోని అన్ని వార్డులను సమదృష్టితో నిధులు కేటాయించి అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు అందించడంలో కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. పెందుర్తి నియోజవర్గం పరిధిలోని 93 వ వార్డులో సుమారు 7. 26 కోట్ల రూపాయల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవా లు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ హెచ్. శంకర్రావు జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు, సచివాలయం సిబ్బంది, పలువురు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల శక్తివంతమైన పాత్రకు రైల్వే ప్రోత్సాహం

**- మహిళల అభివృద్ధికి రైల్వే కట్టుబాటు - మహిళ సాధికారతను ప్రోత్సహించడంలో రైల్వే ముందుంది - డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా**

**విశాఖ సిటీ, మేజర్‌న్యూస్:** మహిళ సాధికారతను ప్రోత్సహించడంలో రైల్వే ఎప్పుడు ముందుందని డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా, వాల్తేర్ డివిజన్ శ్రీ శ్రీనివాస కళ్యాణ మండపంలో వరుస కార్యక్రమాలను నిర్వహించింది. కార్యక్రమానికి డిఆర్ఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమాలలో కేంద్రీయ విద్యాలయంలోని ప్రాథమిక ఉపాధ్యాయురాలు శ ప్రగతి ప్రజాపతి "చైల్డ్ సైకాలజీని అర్థం చేసుకోవడం - శ్రామిక మహిళలకు ఒక మార్గదర్శి" అనే అంశంపై సెమినార్ ఆర్ట్ ఆఫ్ లివింగ్ నుండి భాగ్యశ్రీ అనంత్ బార్భాడికర్ నిర్వహించిన మనస్తత్వశాస్త్రం , ఒత్తిడి నిర్వహణపై వర్క్‌షాప్ కొనసాగాయి. అదనంగా, డివిజనల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భాషిణి ప్రియాంక మహిళల ఆరోగ్యం, పోషకాహారంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డి ఆర్ ఎం లలిత్ బోహ్రా మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం కేవలం వేడుకలకు ఒక సందర్భం కాదని, మహిళా సాధికారత కోసం కృషి చేయడం , లింగ అసమానతను అధిగమించడానికి ప్రయత్నాలను వేగవంతం చేయడం గురించి గుర్తుచేస్తుందని నొక్కి చెప్పారు. వాల్తేరు డివిజన్‌లో 1,600 మందికి పైగా మహిళా ఉద్యోగులు 24 గంటలూ పనిచేస్తున్నారని, వివిధ రంగాలలో గణనీయమైన కృషి చేస్తున్నారని, వారి సమాజాన్ని రూపొందించడంలో అసాధారణ పాత్రలు పోషిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. పని ప్రదేశాలలో మహిళా సిబ్బంది అందరికీ ప్రాథమిక సౌకర్యాలు కల్పించడానికి అన్ని ప్రయత్నాలు చేస్తామని ఆయన పేర్కొన్నారు. మహిళా సాధికారతకు వాల్తేరు డివిజన్‌ను రోల్ మోడల్‌గా మార్చడానికి మహిళా సిబ్బంది లేదా అధికారుల పని వాతావరణాన్ని మెరుగుపరచడానికి ఏవైనా సూచనలను ఆయన స్వాగతించారు. విశాఖపట్నం నుండి రాయగడకు వెళ్లే రైలు నంబర్ 17243 గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్‌లోని మొత్తం సిబ్బందిలో మహిళా సిబ్బంది ఎక్కువగా ఉన్నారని, ముఖ్యంగా, విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లోని అన్ని ఆపరేషనల్ సిబ్బంది ఈ ప్రత్యేక సందర్భంగా మహిళలే ఉన్నారని ఆయన గర్వంగా తెలియజేశారు. ఏ డి ఆర్ ఎం.శాంతారాం (మౌలిక సదుపాయాలు),ఏ డి అర్ ఎం.రామారావు (ఆపరేషన్స్) శ్ర రామారావు, సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ జుసుఫ్ కబీర్ అన్సారీ, బ్రాంచ్ ఆఫీసర్లు, మహిళా సిబ్బంది, క్రీడాకారులు, ఆర్ పి ఎఫ్ సిబ్బంది, పౌర రక్షణ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**- అల్ ఉమెన్ క్రూ రైల్ ను ప్రారంభించిన డి.ఆర్.ఎం.**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారం రోజుల వేడుకల ముగింపు రోజున, గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్‌ను విశాఖపట్నం నుండి రాయగడ వరకు పూర్తిగా మహిళా సిబ్బంది నడిపారు.ఈ రైలును విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా జెండా ఊపి ప్రారంభించారు. ఈస్ట్ కోస్ట్ రైల్వేలోని వాల్టెయిర్ డివిజన్ నిరంతరం మహిళా సాధికారతను ప్రోత్సహించడంలో ముందంజలో ఉందని ఆయన పేర్కొన్నారు. ట్రాక్ నిర్వహణ, రైలు కార్యకలాపాలు, ఇతర కీలక రంగాలలో మహిళలను చురుకుగా నిమగ్నం చేస్తుందన్నారు. రూట్ రిలే ఇంటర్‌లాకింగ్ ఆపరేషన్లు, రైలు నిర్వహణ, లోకో ఆపరేషన్లు, టికెట్ తనిఖీ, కార్యాలయ పరిపాలనలో మహిళా ఉద్యోగులు కీలక పాత్రలు పోషిస్తున్నారని వెల్లడించారు. లోకోమోటివ్‌ల యొక్క కీలకమైన భాగాలను నిర్వహించడానికి బాధ్యత వహించే లోకో షెడ్‌ల వద్ద డివిజన్ పూర్తిగా మహిళా బృందాలను కూడా ఏర్పాటు చేసిందన్నారు.

# చీకట్లో కుట్ర కు అధికారులు ప్రోత్సాహం..!!

**- కబ్జా భూమిలో గీతం వర్సిటీ పనులు తక్షణమే ఆపండి - విశాఖ జిల్లా కలెక్టర్‌కు వైయస్సార్ సీపీ నేతల ఫిర్యాదు - కలెక్టరేట్ వద్ద ఆందోళన - పనులు అప్పకపోతే తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తాం**

**విశాఖపట్నం, మార్చి 9, మేజర్‌న్యూస్:** రాష్ట్ర మంత్రి నారా లోకేష్ తోడల్లుడు, విశాఖ ఎంపీ భరత్‌కు చెందిన గీతమ్ యూనివర్సిటీ, అక్రమంగా ఆక్రమించిన భూమిని చదును చేస్తూ, నిర్మాణ పనులు మొదలు పెడురతోందని వైయస్సార్‌సీపీ విశాఖ జిల్లా నేతలు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.వెంటనే జోక్యం చేసుకుని, ఆ పనులన్నీ ఆపేయించాలని వారు డిమాండ్ చేశారు. గీతమ్ యూనివర్సిటీ 54 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా చేయగా, దాన్ని జీవీఎంసీ (గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్) సమావేశంలో ఏకగ్రీవ తీర్మానంతో క్రమబద్ధీకరించారు. ఆరోజు విపక్ష వైయస్సార్‌సీపీ సభ్యులను ఆ సమావేశానికి రానివ్వలేదు. దీంతో గీతమ్ యూనివర్సిటీ భూకబ్జా వ్యవహారం ఇప్పుడు కోర్టు విచారణ పరిధిలో ఉండగా, ఆ భూమిలో అధికారులు హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. అయితే అధికార దుర్వినియోగంతో, ఆ బోర్డులు తొలగించిన గీతం వర్సిటీ యాజమాన్యం, ఆ భూమిని చదును చేస్తూ, నిర్మాణ పనులు మొదలుపెట్టింది. దీంతో వైయస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కెకె రాజు నేతృత్వంలో వందలాది మంది గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదుకు బయలు దేరడంతో, వారిని కలెక్టరేట్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఎట్టకేలకు కేవలం 200 మందిని మాత్రమే అనుమతించి, లోపలికి పంపారు. అయితే అంత మంది నుంచి ఫిర్యాదు స్వీకరించలేమని, గ్రీవెన్స్ సెల్‌లో కలెక్టర్ చెప్పడంతో, వైయస్సార్‌సీపీ నాయకులు గట్టిగా నిలదీశారు. అయినా పరిమిత సంఖ్యలోనే జిల్లా అధికారులు వారి నుంచి ఫిర్యాదు స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన కెకె రాజు.. గీతమ్ వర్సిటీ భూముల ఆక్రమణను అడ్డుకోవాలని ఈరోజు కలెక్టర్ వద్దకు వస్తే, సాంకేతిక కారణాలు చూపి, కలెక్టరేట్లో వినతిపత్రాలు తీసుకోలేదని వెల్లడించారు. వందలాది మంది తరలివస్తే, పోలీసులు అడ్డుకున్నారని, ఇంకా బెదిరించారని చెప్పారు. ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ, ్యఅధికారులు తమ బాధ్యత నిర్వర్తించడం లేదని, వారు ఇప్పటికైనా న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా వ్యవహరించాలని కోరారు. అధికారులు వెంటనే ఆ భూమిలో గీతం వర్సిటీ పనులన్నీ ఆపేయించాలని డిమాండ్ చేశారు. దాదాపు రూ.5 వేల కోట్ల విలువైన భూమిని కాపాడడం కోసం ప్రజా సంఘాలను కలుపుకుని పోరాడుతామని కెకె రాజు వెల్లడించారు.ఈ సందర్భంగా విశాఖ సౌత్ నియోజకవర్గం వైయస్సార్‌సీపీ ఇంఛార్జ్ వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ.. అధికారులు ఇకనైనా జోక్యం చేసుకుని, గీతం వర్సిటీ కబ్జా భూమిలో చేస్తున్న పనులను ఆపేయించాలని కోరారు. తాము అధికారంలోకి రాగానే, ఆ భూములన్నీ తిరిగి స్వాధీనం చేసుకుంటామని, అక్రమ నిర్మాణాలను కూల్చేస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్తలు,నాయకులు, కార్యకర్తలు పాల్గున్నారు.

# 46వ వార్డులో నూతన సామాజిక భవనాల ప్రారంభం



**అక్కయ్యపాలెం, మార్చి 9, మేజర్‌న్యూస్:** విశాఖపట్నం ఉత్తర నియోజకవర్గం 46వ వార్డులో సుమారు రూ.1.36 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన సామాజిక భవనాలను ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే, బీజేపీ ఫ్లోర్ లీడర్ శ్రీ పి. విష్ణుకుమార్ రాజు సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ విశాఖపట్నం నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ, ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అన్ని సౌకర్యాలతో ఈ సామాజిక భవనాలను నిర్మించామని తెలిపారు. ప్రజలు వివాహాలు, సమావేశాలు మరియు సామాజిక కార్యక్రమాల కోసం వీటిని విస్తృతంగా ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా మరిన్ని కళ్యాణమండపాలు, సామాజిక భవనాలను నిర్మించి అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్ మాట్లాడుతూ, ఈ భవనాలకు సంబంధించి మిగిలిన చిన్న చిన్న పనులను త్వరలో పూర్తి చేసి ప్రజలకు పూర్తిగా అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ.ఈ. పద్మావతి , ఏ.ఈ. పవన్, డి ఈ ఉమామహేశ్వర రావు,సేనాపతి అప్పారావు, పైడికొండ దానేష్ , కొండ ప్రసాద్ , వున వేణుగోపాల్ రావు,శ్రీను , జాను , సునీల్ , గ్రామ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు మరియు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# జీవీఎంసీకి 128 వినతులు

**విశాఖపట్నం, మార్చి 9, మేజర్‌న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో జీవీఎంసీ లో అన్ని విభాగాలకు కలిపి 128 వినతులు స్వీకరించడం జరిగినది నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయం పాత సమావేశ మందిరం లో జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ తో కలసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న"ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి జివిఎంసికి సంబంధించి 128 అర్జీలు / ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. అందులో ముఖ్యంగా భీమిలి జోనుకు 03, మధురవాడ జోన్ కు 21, ఈస్ట్ జోన్ కు 25, వెస్ట్ జోన్ కు 07, నార్ట్ జోనుకు 15, సౌత్ జోన్ కు 14, పెందుర్తి జోన్ కు 09, అగనంపూడి జోన్ కు 04, గాజువాక జోన్ కు 07, జివిఎంసి ప్రధాన కార్యాలయానికి 23 ఫిర్యాదులు అందాయని తెలిపారు. అలాగే జివిఎంసి అడ్మినిస్ట్రేషన్ ఽ అకౌంట్సు విభాగమునకు 10, రెవెన్యూ విభాగమునకు 19, ప్రజారోగ్య విభాగమునకు 06, పట్టణ ప్రణాళిక విభాగమునకు 58, ఇంజినీరింగు విభాగమునకు 30, మొక్కల విభాగమునకు 03, యు.సి.డి. విభాగమునకు 02 కలిపి మొత్తంగా 128 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. అనంతరం కమిషనరు కేతన్ గార్గ్ మాట్లాడుతూ ఫిర్యాదులకు సంబంధించిన విభాగాధిపతులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను/ఫిర్యాదులను అదే రోజు వెంటనే పరిశీలిస్తూ, సంబంధిత ఫిర్యాదుదారులతో సంప్రదించి నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించాలని, వచ్చిన అర్జీలపై అధికారులు వెంటనే స్పందించి కార్యాచరణ అదే రోజు చేపట్టాలని, ప్రతివారం అదే ఫిర్యాదులు తిరిగి ప్రజలు సమర్పించకుండా ఆయా సమస్యలను నిర్ణీత సమయం లో పరిష్కరించాలని, పిజిఆర్ఎస్ కార్యక్రమం పూర్తయిన అనంతరం వచ్చిన ఫిర్యాదులపై అన్ని విభాగాల అధికారులు ఆయా వినతులపై ఫిర్యాదుదారులను సంప్రదించి వెంటనే సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని జివిఎంసి అధికారులను, జోనల్ కమీషనర్లను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్లు డి.వి.రమణమూర్తి, ఎస్.ఎస్.వర్మ, పి.నల్లనయ్య, జాయింట్ డైరెక్టర్ (అమృత్) విజయ భారతి, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ ఎన్ వి నరేష్ కుమార్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి.వాసుదేవ రెడ్డి, కార్యదర్శి బి.వి.రమణ, పర్యవేక్షక ఇంజనీర్లు, ఇంచార్జి డిడిహెచ్ వాసుకి, స్పోర్ట్స్ డైరెక్టర్ ఇ.ఎ.రాజు, సివిఒ డాక్టర్ ఎల్.రవి కుమార్, కార్యనిర్వాహక ఇంజినీర్లు, బయాలజిస్ట్, ఆర్ఎఫ్ఓ కృపావరం, యుసిడి పి.ఓ. ప్రసన్న వాణి, డిపిఒ శాంతి కుమారి తదితరులు పాల్గొన్నారు.




## అక్రమ ఆయుధాలపై ఉక్కుపాదం మోపుతాం

**అక్రమ ఆయుధాల వలన అమాయకుల ప్రాణాలకు ముప్పు పొంచి ఉంది - జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా హెచ్చరిక**



**అనకాపల్లి, మార్చి 09, మేజర్‌న్యూస్:** జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించడమే పోలీస్ శాఖ ప్రధాన ధ్యేయమని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పేర్కొన్నారు. జిల్లాలో ఎవరైనా అక్రమంగా ఆయుధాలను కలిగి ఉన్నా, రవాణా చేసినా లేదా తయారు చేసినా వారిపై ఉక్కుపాదం మోపుతామని ఆయన హెచ్చరించారు. ఆయుధాల చట్టం ప్రకారం, ప్రభుత్వ నిబంధనలకు లోబడి తగిన విచారణ తర్వాత మాత్రమే తుపాకులకు లైసెన్స్ జారీ చేయడం జరుగుతుందన్నారు. లైసెన్స్ లేకుండా ఆయుధాలను కలిగి ఉండటం తీవ్రమైన నేరమని, కొంతమంది వేటగాళ్లు జీవనోపాధి పేరుతో నాటు తుపాకులను వాడుతుంటారని, అనుమతి లేని ఏ ఆయుధమైనా చట్టరీత్యా నేరమే అని పేర్కొన్నారు. “జీవనోపాధి” అనే సాకుతో అక్రమ ఆయుధాలను కలిగి ఉంటే చట్టపరమైన చర్యల నుండి మినహాయింపు ఉండదని ఎస్పీ స్పష్టం చేశారు. లైసెన్స్ పొందిన ఆయుధాల పట్ల కూడా యజమానులు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, లైసెన్స్ ఉన్న ఆయుధాలను ఇతరులకు ఇవ్వడం, గాలిలో కాల్పులు జరపడం లేదా భద్రతలో నిర్లక్ష్యం వహించడం వంటివి చేస్తే సదరు వ్యక్తుల లైసెన్స్‌లను రద్దు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ఎక్కడైనా అక్రమంగా నాటు తుపాకుల తయారీ లేదా రవాణా జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ”అక్రమ ఆయుధాల వల్ల అమాయకుల ప్రాణాలకు ముప్పు పొంచి ఉంది. ప్రజల భద్రత విషయంలో ఎటువంటి రాజీ పడబోమని, చట్టవిరుద్ధంగా ఆయుధాలను కలిగి ఉన్న వారు వెంటనే వాటిని సమీప పోలీస్ స్టేషన్‌లో అప్పగించాలని, లేనిపక్షంలో కఠినమైన చర్యలు తప్పదని హెచ్చరించారు. అక్రమ ఆయుధాల గురించి సమాచారం ఉన్నవారు డైల్ 100/112 లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించవచ్చు. సమాచారం అందించిన వారి పేర్లు, వివరాలు అత్యంత రహస్యంగా ఉంచబడతాయి. యువత ఇటువంటి అక్రమ ఆయుధాల సంస్కృతికి దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లల కదలికలపై నిఘా ఉంచాలని కోరడమైనది.

## రావికమతం మండలంలో రేషన్ డిపోలను తనిఖీ చేస్తున్న వీఆర్ఏలు?

**అనకాపల్లి ప్రతినిధి, మార్చి 9, మేజర్‌న్యూస్:** జిల్లాలో గల రావికమతం మండలంలో వీఆర్ఏలు రేషన్ షాపులు కూడా తనిఖీలు చేస్తామని అంటూ వారి ఉద్యోగ విధులను నిర్వహిస్తున్నారు. దీంతో రేషన్ షాప్ డీలర్లు తమ షాపులు తనిఖీ చేసే అధికారం తాసిల్దార్ కు డిప్యూటీ తాసిల్దార్ లు, తాసిల్దార్ నియమించిన వ్యక్తులకు మాత్రమే ఉందని అంటున్నారు. మండలంలో వివిధ రేషన్ డిపోలు కు వీఆర్ఏలు వెళ్లి స్టాక్ పొజిషన్ తనిఖీ చేయడం పట్ల రేషన్ షాప్ డీలర్లలో వ్యతిరేకత వ్యక్తం అవుతుంది. బయోమెట్రిక్ మిషన్ లో రేషన్ సరుకులు అమ్మకాలు వివరాలు డిపోలో ఉన్న స్టాకులు తనిఖీ చేస్తున్నారు. ఇప్పటికే సి ఎస్ డి టి డిపోలను తనిఖీ చేస్తుండగా కొత్తగా వీఆర్ఏలు తనిఖీ చేయడమేమిటని డీలర్లు గగ్గోలు పెడుతున్నారు. గతంలో ఏనాడు వీఆర్ఏలు డిపోలు తనిఖీ చేసే సాంప్రదాయం లేదని కొత్తగా వచ్చిన నిబంధన ఎక్కడ నుండి వచ్చిందని ప్రభుత్వం నుంచి వచ్చిందా సొంతంగా వీఆర్ఏ లే తాసిల్దార్ అవతారం ఎత్తుతున్నారా అవతరిస్తున్నారా తెలుసుకొనుటకు డీలర్లు పరుగులు తీస్తున్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు అంకిత భావంతో పనిచేయాలి

**- అర్జీలు పునరావృతం కాని విధంగా అధికారులు పరిష్కరించాలి - అర్జీలు పునరావృతం అయితే అధికారులదే బాధ్యత**
**- భూసంబంధిత సమస్యలను రెవిన్యూ క్లినిక్ ద్వారా సత్వరమే పరిష్కరించాలి - ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో 131, రెవెన్యూ క్లినిక్ లో 159 అర్జీలు మొత్తం 290 అర్జీలు : జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్**



**అనకాపల్లి ప్రతినిధి, మార్చి 9, మేజర్‌న్యూస్:** ప్రజా సమస్యల పరిష్కార వేదిక “పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్” లో వచ్చిన అర్జీలను పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, పునరావృతం కాని విధంగా సంతృప్తి కరమైన, నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి విజయ క్రిష్ణన్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో “ప్రజా సమస్యల పరిష్కార వేదిక” కార్యక్రమం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన అర్జీదారుల సమస్యలను వింటూ, అర్జీలను స్వీకరిస్తూ, సంబంధిత అధికారులకు ఎండార్స్ చేసి శాశ్వత పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. లి ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్, జిల్లా రెవెన్యూ అధికారి వై. సత్యనారాయణ రావు వినతుల స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తుందని, కావున పి జి ఆర్ ఎస్ కు విచ్చేసిన అర్జీదారుడు పూర్తి స్థాయిలో సంతృప్తి చెందేలా సత్వర, శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లాస్థాయి అధికారులు తప్పకుండా అర్జీదారులతో మాట్లాడి, సమస్య పూర్వాపరాలు తెలుసుకొని సరైన పరిష్కారం చూపాలని, అందువల్ల అర్జీలు పునరావృతం కాకుండా ఉంటాయని కలెక్టర్ తెలిపారు. అర్జీ పునరావృతం అయ్యిందంటే జిల్లా అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ప్రజల నుంచి వివిధ సమస్యలపై 131 అర్జీలు అందగా, రెవెన్యూ క్లినిక్ కు 159 వినతులు అందాయి. మొత్తంగా 290 అర్జీలు అందాయి. వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ లలో పాల్గొన్నారు

## జీడీ పంటను ప్రభుత్వ గుర్తించాలి మద్దతు ధర ప్రకటించాలి



**వి మాడుగుల, మార్చి 9, మేజర్‌న్యూస్:** జీడీ పంటకు కు మద్దతు ధర ప్రకటించాలి జీడికి కార్పొరేషన్ ఎర్పాటు చేయాలని కేజీ జీడీ పిక్కలకు రెండు వందలు రూపాయలు ఇవ్వాలని ఇతర దేశాల నుండి దిగు మతి అవుతున్న జీపిక్కలను తక్షణమే నిలుపుదల చేయాలని మన జీడి పిక్కలకు అసెంబ్లీలో చర్చించి మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేస్తు సోమవారు శంకరం పంచాయతీ లో గిరిజనులు పెద్ద ఎత్తున ఆందోళన చెప్పాట్టారు అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రదాన కార్యదర్శి డి వెంకన్న గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఇరట నరసింహమూర్తి తదితరులు పల్గోని మాట్లాడారు జీడి పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్ట పోతు న్నారని తెలిపారు ప్రభుత్వం వరి,చెరకు, పత్తి పామ్ ఆయిల్ మొదలగు పంటలకు మద్దతు ధర ప్రకటి స్తుందని కాని జీడి పంటకు మాత్రం ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించక పోవడం అన్యాయ మన్నారు అసెంబ్లీ సమావేశాల్లో జీడీ మద్దతు ధర మార్కెట్ సౌకర్యం కోసం చర్చించాలని కోరారు. జీడీ పంటకు నిలకడగా ధర ఉండక పోవడంతో జీడి పిక్కల పంట సమయంలో వ్యాపారులు రైతులకు ధర తగ్గించి రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారని అగ్రహం వ్యక్తం చేసారు వ్యాపారుల చేతికి జీడి పిక్కలు చేరిన తరువాత ఆమాంతంగా జీడి పప్పు ధర పెరుగు పోతుందని అన్నాడు. రైతులకు పెట్టుబడి ఖర్చులు కూడా రాక నష్ట పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు జీడి పిక్కల ధర ప్రభుత్వం శాస్త్రీయంగ నిర్ణయించి అమలు చేయక పోవడంతో వ్యాపారులు ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం 80 కేజీల జీడి పిక్కల బస్తాకు వ్యాపారులు రూ. 8,000/-మాత్రమే చెల్లిస్తున్నారు. దీంతో జీడి రైతులు వ్యాపారుల చేతిలో దోపిడీకి గురి అవుతున్నారని తెలిపారు. జీడి పప్పు బస్తా (80 కేజీలు) పిక్కలకు 22 కేజీలు పప్పు వస్తుంది. మరో 3 కేజీలు ముక్కలు, తొక్కలు ఒక బస్తాకు 50 కేజీలు వస్తాయని. దీని ప్రకారం ప్రస్తుత మార్కెట్లో ధరల ప్రకారం సుమారు బస్తాకు రూ. 19,400/- లు ఆదాయం వ్యాపారులకు వస్తుందని తెలిపారు మార్కెట్ ధరలను పరిగణనలోకి తీసుకొని జీడి రైతులకు న్యాయ మైన ధర చెల్లించి, రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేసారు మన దేశంలో జీడి సాగులో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉందని. అనకాపల్లి జిల్లాలో 90 వేల ఎకరాల్లో జీడి సాగు చేస్తున్నారనీ వేలాది మంది రైతులు గిరిజనులు ధళితులు ఈ పంటపై ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. 25 వేల మెట్రిక్ టన్నులు జీడి పిక్కలు ఉత్పత్తి జరుగుతుందని తెలిపారు. నాన్ షేడ్యూల్డ్ గిరిజన, తీర ప్రాంతంలో నీటి వనరులు లేని మెట్ట ప్రాంతంలో జీడి పంట ప్రధాన మైన వాణిజ్య సాగుగా రైతులు పండిస్తున్నారని తెలిపారు జీడి పంట విస్తరణ, అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఇతర దేశాలు నుండి దిగుమతి అవుతున్న జీడీ పిక్కలను వెంటనే నిలుపుదల చేయాలని ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న తరుణంలో. జీడిరైతుల కోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసి మద్దతు ధర ఇచ్చి కోనుగోలు చేయాలని డిమాండ్ ఈ కార్యక్రమంలో వ్వవసాయ కార్మికసంఘం జిల్లా ఉపాధ్యాక్షులు కె భవానీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షు బి టి దొర గిట్టూరి అప్పారావు సోలం చంద్ర శేఖర్ సాగరిఈశ్వరావు సోమేల నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు,

# సూర్య విజయనగరం

## హమాలీల సమస్యలు పరిష్కారం కోరుతూ వినతి



**నెల్లిమర్ల, మార్చి 9, మేజర్ న్యూస్ :** నెల్లిమర్ల విద్యుత్ జిల్లా స్టోర్స్ హమాలీల సమస్యలు పరిష్కారం కోరుతూ ఎపి ఎలక్ట్రిసిటి డిస్ట్రిక్ట్ స్టోర్స్ హమాలీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఎపిఈపిడిసిఎల్ మేనేజింగ్ డైరెక్టర్ కి సోమవారం వినతి పత్రం అందజేశారు. విద్యుత్ జిల్లా స్టోర్స్ హమాలీ యూనియన్ నాయకులు కెల్ల గోవిందరావు,ఎ. భాషా హమాలీల సమస్యల పై విశాఖపట్నంలో ఈపి డి సిఎల్ఎండికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీసు రేటు విధానం రద్దుపర్చి కార్మికులను సంస్థలో వీలీనం చేసి నెలవారి జీతం ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో కోరారు. అలాగే ఎపి ట్రాన్స్ కో సిఎస్ఎస్ఆర్ రేట్లు ప్రకారం 2022-23 వరకు పనిచేస్తున్నామని గత నాలుగు సంవత్సరాల నుండి రేట్లు పెంచలేదని తెలిపారు. అంతే కాకుండా ఎ.పి.యస్.పి.డి.సి.యల్, ఎ.పి.సి.పి.డి.సి.యల్ లో యస్.యస్.ఆర్. రేట్లు పెంచారు గాని తమకు పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లాలలో కూడా స్టోర్స్, యస్.పి.యమ్. సెంటర్ నందు పని చేయుటకు ఇప్పుడున్న జట్టు కార్మికులకు పని చేయుటకు పర్మిషన్లు ఇప్పించాలని ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కాగా ఎ.పి.ఇ.పి.డి.సి.యల్. కంపెనీ పరిధిలోని అయిదు జిల్లాల జట్టు కార్మికుల లోడింగ్, అన్ లోడింగ్ బిల్లులను త్వరితగతిన ఇవ్వాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. కాబట్టి మేము ఎ.పి.ఇ.పి.డి.సి. యల్. అయిదు జిల్లాల పరిధిలోని స్టోర్సు మరియు యస్.ఏ.యమ్. సెంటర్ నందు సుమారు 230 మంది గత 25 నుండి 30 సంవత్సరాలుగా వివిధ రకాల మెటీరీయల్స్ ఎగుమతులు, దిగుమతులు పనులు విభాగంలో పని చేస్నర్తీ చాలీ చాలని జీతాలతో జీవనం గడుపుతున్నామని తెలిపారు.

## పెంచిన గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలి

**- సిపిఎం మండల కార్యదర్శి బలస శ్రీను**



**రామభద్రపురం మేజర్ న్యూస్ :** పెంచిన గ్యాస్ ధరలు కేంద్ర ప్రభుత్వం వెంటనే తగ్గించాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రాంభద్రపురం మండలం గొల్లలపేటలో నిరసన కార్యక్రమాలు జరిగాయి. సిపిఎం పార్టీ రాంభద్ర పురం మండల కార్యదర్శి బలస .శ్రీను మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం అమెరికా, ఇజ్రాయిల్, ఇరాన్ యుద్ధాన్ని సాకు చూపించి దేశంలో గ్యాస్ ధరలు పెంచడం దారుణమని అన్నారు. గల్ఫ్ దేశాలు అంతటా జరుగుతున్న యుద్ధంలో మన దేశంలో గ్యాస్ నిలువులు ఆయిల్ నిలువలు భద్రంగా ఉన్నాయని ప్రకటించిన కేంద్రంలో బిజెపి ప్రభుత్వం గ్యాస్ ధరలు పెంచాల్సిన అవసరం ఏమొచ్చిందని అన్నారు. త్వరలోనే పెట్రోల్ డీజిల్ ధరలు పెంచడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతుందని ఇది మన దేశానికి, దేశ ప్రజానీకానికి తీవ్రమైన ఆర్థికభారంగా మారబోతుందని అన్నారు. మన దేశ సార్వభౌమాధికారం అమెరికావాడి కాళ్ల దగ్గర పడేశారన్నారు. దేశంలో అన్ని ధరలు పెరగడానికి ప్రధాన కారణం మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విదేశాంగ విధానం వలనే ధరలు పెరుగుతున్నాయన్నారు. వీటిపైన ప్రజలు పెద్ద ఎత్తున పోరాటాలలోకి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈశ్వరరావు, ఎర్రం నాయుడు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

# జేఎన్టీయూ జీవీలో ఎసెంట్రా-2కె26 సాంకేతిక ఉత్సవం

## ఘనంగా ప్రారంభించిన వీసీ ప్రొ.వి.వి.సుబ్బారావు




**విజయనగరం టౌన్, మార్చి 9 (మేజర్ న్యూస్) :** ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్, కృత్రిమ మేధస్సు వంటి ఆధునిక సాంకేతిక రంగాలలో నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా భవిష్యత్తులో మంచి అవకాశాలు పొందవచ్చని జేఎన్టీయూ జీవీ వైస్ ఛాన్సలర్ ప్రొ.వీవీ సుబ్బారావు అన్నారు. అలాగే ఇలాంటి సాంకేతిక ఉత్సవాలు విద్యార్థులలో సృజనాత్మకత, పరిశోధనాత్మక దృక్పథం మరియు ఆవిష్కరణా సామర్థ్యాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ- గురజాడ విజయనగరం కు అనుబంధంగా ఉన్న ఇంజినీరింగ్ కళాశాలలోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసెంట్రా -2ఖ26 సాంకేతిక ఉత్సవం నిర్వహించారు. ూాదీ-×× ఆడిటోరియంలో సోమవారం ఉదయం 10.00 గంటలకు ఈ కార్యక్రమాన్ని వైస్ ఛాన్సలర్ ప్రొ.వీవీ సుబ్బారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలల నుండి విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**సాంకేతిక పోటీలు నిర్వహణ :**

రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవంలో టెక్నికల్ పేపర్ ప్రజెంటేషన్స్, పోస్టర్ ప్రజెంటేషన్స్, ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్స్ మరియు వివిధ సాంకేతిక పోటీలు నిర్వహించబడుతున్నాయి. జనరల్ నాలెడ్జ్, ఆప్టిట్యూడ్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, క్విజ్ ఈ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. రెండు రౌండ్లలో ఈ పోటీలు నిర్వహించారు. విజేతలకు అవార్డుతోపాటు జేఎన్టీయూజీవీ సర్టిఫికెట్ సైతం అందజేనున్నారు.

**ఎసెంట్రా-2కె26 చైర్మన్‌గా టీఎస్ఎన్ మూర్తి :**

ఎసెంట్రా -2ఖ26 సాంకేతిక ఉత్సవంకు ప్రత్యేక అతిథిగా శాస్త్రవేత్త బీ వెంకట రమణ హాజరయ్యారు. గౌరవ అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ కేసీబీ రావు హాజరై విద్యార్థులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమానికి చైర్మన్‌గా టీఎస్ఎన్ మూర్తి వ్యవహరించగా.... కన్వీనర్‌గా కే బాబులు వ్యవహరించారు.అలాగే ఫ్యాకల్టీ కోఆర్డినేటర్‌గా ఈసీఈ విభాగం అసోషియేటివ్ ప్రొఫెసర్ డాక్టర్.బీ నళిని వ్యవహరించారు.అలాగే విద్యార్థి సమన్వయకర్తగా బీటెక్ ఫోర్త్ ఇయర్ స్టూడెంట్ ఎస్. జాహ్నవి వ్యవహారించారు.



# పద్మశాలి సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా రామారావు





**పూసపాటిరేగ, మార్చి 9, మేజర్ న్యూస్ :** పద్మశాలి సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా సంగం నాయకులు, పెద్దలు ఏకగ్రీవం గా ఎంపిక చేయడం వలన తనలో మరింత బరువు బాధ్యతలను పెంచిందని నూతనంగా సంఘవ రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా కప్పల రామారావు విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా మాకినేని బసవ పున్నయ్య కళాక్షేత్రంలో రాష్ట్ర పద్మశాలి సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశం కు పూసపాటిరేగ గ్రామానికి చెందిన పలువురు పద్మశాలి సంఘం తరఫున కప్పల రామారావుతోపాటు పలువురు కుల పెద్దలు హాజరయ్యారు. ఈ సమావేశం కు అఖిలభారత పద్మశాలి సంఘం పెద్దలతో పాటు రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షుడు నాగేశ్వరరావు తో పాటు పలు రాష్ట్రాలకు చెందిన పద్మశాలి సంఘాల నాయకులు, పెద్దలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పద్మశాలి కుటుంబాలు అనాధగా వస్తున్న చేనేత నేత కార్మికులుగా ఎదుర్కొంటున్న సమస్యలను ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు చర్చించారు. చేనేత వ్యవస్థను ప్రక్షాళన చేయడంతో పాటు కార్మిక కుటుంబాలకు రాయితీలతో కూడిన మరమగ్గాలను అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సంఘ ప్రతినిధులు పేర్కొన్నారు. చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వాలకు తీసుకువెళ్లి చేనేత వ్యవస్థను ప్రక్షాళన చేసే విధంగా చర్యలు చేపట్టవలసిన అవసరం ఎంతైనా ఉందని ఈ సందర్భంగా సమావేశంలో చర్చించారు. అనంతరం చేనేత రాష్ట్రస్థాయి సంఘం ఎన్నికలు నిర్వహించగా, రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా పూసపాటిరేగకు చెందిన కప్పల రామారావు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ తనను రాష్ట్ర నాయకత్వం కు ఎంపిక చేసి రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎంపిక చేయడం తనకు మరింత బాధ్యతను పెంచినట్లు అయిందన్నారు. సంగం పురోభివృద్ధికి, చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లే విధంగా కృషి చేయనున్నట్లు ఈ సందర్భంగా రామారావు స్పష్టం చేశారు.

# ఇది ముమ్మాటికీ హత్యా ప్రయత్నమే..?

**- ప్రేమ వ్యవహారంలో యువకుడి పై దాడి - ఆనందపురం ఈ కేసులో పెద్ద మిస్టరీ - దాడి చేసి కేజీహెచ్ లో జాయిన్ చేసిన నిందితులు..? - అక్కడ నుంచి మెడికవర్ హాస్పిటల్ కు బందువులు తరలింపు - ఆందోళనకరంగా యువకుడి ఆరోగ్య పరిస్థితి - ఇదివరకే తమ కుమారుడిపై దాడి జరిగే అవకాశం ఉందని ఫిర్యాదు చేసిన బాధితులు..! - పట్టించుకోని ఆనందపురం సీఐ..! - నిందితులకు అనుకూలంగా వ్యవహరిస్తున్న పోలీసులు ? - ఆనందపురం పోలీసులపై బాధితుల ఆగ్రహం - దీనిపై వార్తా కథనాలు రాసిన మీడియాకు అధికారి బెదిరింపులు..!! - అనందపురంలో శాంతిభద్రతలపై ప్రజల ఆందోళన - దీనిపై సీపీ, డీసీపీ మణికంఠ పూర్తిస్థాయిలో విచారణ చేయాలని ప్రజలు విజ్ఞప్తి**

**(క్రైం బ్యూరో : మేజర్ న్యూస్)**

ప్రేమ వ్యవహారం ఓ యువకుడి ప్రాణం మీదికి తీసుకొచ్చింది. ప్రియురాలు తనని కలవాలని మెసేజ్ చేయడంతో వెంటనే ఆమెను కలవడానికి వెళ్లి తీవ్ర గాయాలతో హాస్పటల్ పాలయ్యాడు. అతని చెవులు, ముక్కు ద్వారా రక్తం కారుతూ అపస్మారక స్థితిలో ఉన్న తనని అత్యవసర చికిత్స కోసం కేజీహెచ్ లో జాయిన్ చేశారు. అనంతరం అతన్ని మెడికవర్ హాస్పిటల్ కి తరలించి వైద్యం అందిస్తున్నారు. అతని పరిస్థితి ప్రస్తుతం చాలా దారుణంగా ఉంది. పథకం ప్రకారం అతన్ని రప్పించి హత్య చేసేందుకు కుట్రపన్నారని ఆ యువకుడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. బాధితుల ఆరోపణలకు సదరు ప్రియురాలి కుటుంబ సభ్యులు స్పందించకుండా తమకేమీ తెలియనట్లుగా చూస్తున్నారు. ఈ ఘటనపై స్పష్టమైన వివరాలు ఉన్నప్పటికీ కూడా స్థానిక పోలీసులు తాత్సారం చేస్తూ కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారు.చివరికి కొట్లాట కేసుతో సరిపెట్టేశారు.. ఆ యువకుడు పై దాడి చేసిన వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో ఆగ్రహం చెందిన బాధ్యత కుటుంబ సభ్యులు పోలీసులు తీరుపై మండిపడుతూ స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. తమకు న్యాయం కావాలంటూ డిమాండ్ చేశారు. బాధితులకు స్థానికులు కూడా మద్దతు తెలియజేస్తూ సిఐ వ్యవహారి శైలిపై మండిపడుతున్నారు. ఆ యువకుడి తల కపాలం పూర్తిగా డామేజ్ అయ్యేలా దాడి చేసిన వారిపై చిన్న కేసు పెట్టి వారిని ఆ కేసు నుంచి తప్పించే ప్రయత్నం చేస్తున్నారంటూ సీఐపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### - మృత్యుడికి చేర్చిన మెసేజ్..

ఆనందపురం మండలం చందక పంచాయతీ పరిధిలో కుటుంబంతో నివసిస్తున్న తాడ్డి సాయి, సమీప పాలవలస గ్రామం లో ఉంటున్న ఓ యువతితో సన్నిహితంగా ఉంటున్నాడు. ఇది తెలుసుకున్న ఆమె కుటుంబ సభ్యులు సాయిని పలుమార్లు హెచ్చరించారు. మరోసారి తమ అమ్మాయితో మాట్లాడటానికి ప్రయత్నించిన, ఎక్కడైనా కలిసినట్లు తెలిసిన ప్రాణాలు తీస్తామంటూ బెదిరించారు. విషయం తెలుసుకున్న సాయి కుటుంబ సభ్యులు ఆనందపురం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు పెద్దగా పట్టించుకోలేదు. సాయి కుటుంబ సభ్యులకే హెచ్చరించి తిరిగి పంపించారు. అయితే ఇదిలా ఉండగా శనివారం రాత్రి 11 గంటల సమయంలో ఆ యువతి నుంచి ఒక మెసేజ్ వచ్చింది. తనను కలవాలని ఆ మెసేజ్ లో ఉండటంతో సాయి వెంటనే ఇంటి నుంచి ద్విచక్ర వాహనంతో ఆమెను కలవడానికి వెళ్ళాడు. ఆ తర్వాత శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఆదివారం తెల్లవారుజాము మూడు గంటల సమయంలో ఆ యువతికి సంబంధించిన వారి నుంచి సాయి కుటుంబ సభ్యులకు ఫోన్ వచ్చింది. సాయి మేడ మీద నుంచి కింద పడిపోయాడని అతని పరిస్థితి ఆందోళనకరంగా ఉందని కేజీహెచ్ కు తీసుకెళ్తున్నట్లు చెప్పారు.అతని కుటుంబ సభ్యులు కూడా వెంటనే కేజీహెచ్ కి వెళ్లారు.అతని పరిస్థితి బాగా విషమించడంతో అక్కడి నుంచి మెడికవర్ హాస్పిటల్ కి తరలించారు. పలు పరీక్షలు, ఎక్సరే ల అనంతరం అతని పరిస్థితి విషమంగానే ఉన్నట్లు బాధ్యుల స్పష్టం చేశారు. సాయి తల కపాలం తీవ్రంగా డామేజ్ అయినట్లు స్పష్టంగా కనిపిస్తుందని తెలిపారు. ప్రస్తుతం సాయి ఆ హాస్పటల్లో కోమాలో ఉన్నాడు. అయితే కుటుంబ సభ్యులకు అనుమానం రావడంతో అసలు విషయం తెలుసుకొని ఆ యువతి కుటుంబ సభ్యులు తమ కుమారుడిపై దాడి చేసి ఇది ఒక ప్రమాద ఘటనగా చూపించేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. సాయి ద్విచక్ర వాహనం ఆ యువతి ఇంటి ముందు ఉండటం కూడా పలు అనుమానాలకు తావిస్తుందని సందేహాలు వ్యక్తం చేశారు. అయితే ఆ యువతి కుటుంబ సభ్యులు మాత్రం ఒక్కసారి ప్రమాదం జరిగిందని, మరొకసారి మేడ నుంచి కింద పడ్డాడని, ఇంకోసారి చుట్టూ పైనుంచి కింద పడిపోయాడని పలు రకాలుగా చూపుతూ ఉండడంతో ఇది కచ్చితంగా తమ కుమారుడిని హత్య ప్రయత్నించారని ఈ క్రమంలోనే అతను తీవ్రంగా గాయపడ్డాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు బాధితులు.

### - ముమ్మాటికి హత్యా ప్రయత్నమే..!!

చెట్టు మీద నుంచి లేదా మేడ మీద నుంచి కింద పడితే కాలో, చేయో విరగాలి కానీ తల కపాలం బాగా డామేజ్ కావడం ఏంటని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఆ యువతి తో తమ కుమారుడు మాట్లాడుతూ ఉండటం సహించలేని ఆమె కుటుంబ సభ్యులు ఆమె ఫోన్ ద్వారా మెసేజ్ చేసి వారి ఇంటికి పిలిపించుకొని, విచక్షణ రహితంగా దాడి చేసి, తిరిగి వాళ్లే కేజీహెచ్ లో జాయిన్ చేసి తమకు ఏమీ తెలియనట్లుగా అమాయకంగా మాట్లాడుతూ ఉండటం పలు అనుమానాలకు తావిస్తుందని సాయి కుటుంబ సభ్యులు మండిపడుతున్నారు. ఇది ముమ్మాటికీ అతనిని హత్య చేసేందుకే కుట్రపన్నారని ఆరోపించారు. ఇదివరకే వారిపై ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న పట్టించుకోలేదన్నారు. తమ ఫిర్యాదు పై పోలీసులు సీరియస్ యాక్షన్ తీసుకుంటే, నేడు అతని పరిస్థితి ఇలా ఉండేది కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### - సిఐ తీరుపై బంధువుల ఆగ్రహం..

ఆనందపురం సిఐ తీరుపై బాధిత కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ కుమారుడు చావు బతుకుల మధ్య ఉండేలా చేసిన వారిపై పోలీసులు సీరియస్ యాక్షన్ తీసుకోకుండా చిన్న కేసు పెట్టి వారిని తప్పించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. నిందితులకు స్థానికంగా రాజకీయ నాయకులతో పలుబడి ఉండడంతో బాధితులమైన తమకు న్యాయం చేయకుండా, తమ కుమారుడిని తీవ్రంగా దాడి చేసిన వారిపై సీఐ అనుకూలంగా వ్యవహరిస్తున్నారు అంటూ మండిపడుతున్నారు. ఆనందపురం పోలీసులపై తమకు నమ్మకం లేదని సీపీ లేదా డీసిపి,ఏసిపి స్థాయి అధికారులు దీనిపై దృష్టి విచారణ చేయాలని, తమ కుమారుడు ప్రస్తుతం హాస్పిటల్లో చావు బతుకుల మధ్య ఉన్నాడని దీనికి కారణమైన నిందితులపై అలాగే వారికి సహకరించిన ఆనందపురం సిఐ పై చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

### - మీడియాపై తప్పుడు ప్రచారాలు..?

నిజాలు నిర్భయంగా రాసే పత్రికల పై మొదటి నుండి ఆ పత్రిక రిపోర్టులు పై భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. మీడియా సంస్థలను వ్రాసే జర్నలిస్ట్ లను ఆయన టార్గెట్ చేశారని తెలుస్తుంది. ఇది కాకుండా తాను పొలిటికల్ అండతో ఈ స్టేషన్వకు సిఐగా రావడం జరిగిందని, తనను సిపి కూడా ఏమి చేయలేరు అంటూ ఆ సీఐ బాహటంగా అందరితో చెబుతున్నట్లు భోగట్టా. చివరకు ఉన్నతాధికారులు ఆదేశాలు ఖాతరు చేయకుండా ఎవరు ఆదేశాలను పట్టించుకోకుండా, ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటూ, ప్రజలకు న్యాయం చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తూ, పోలీసు శాఖకు చెడ్డ పేరు తెచ్చే విధంగా ప్రవర్తిస్తున్న సదరు సిఐ పై చర్యలు తీసుకోవాలంటూ పలువురు కోరుతున్నారు. ఇక ఇదే పోలీస్ స్టేషన్ పరిధిలో గోమాంసం అక్రమ నిల్వ కేసుకు సంబంధించి, సదరు సిఐ కు ముందస్తు సమాచారం ఉన్న, ఎటువంటి చర్యలు తీసుకోకుండా, ఆరు నెలల పాటు గోమాంస నిలవ నిర్వహకులపై ప్రదర్శించడం జరిగిందని చాలా ఆరోపణలు ఉన్నాయి. సదరు సి ఐ పై ఎన్ని ఆరోపణలు వచ్చినా అతనిపై పోలీస్ శాఖ చర్యలు తీసుకోవడానికి వెనుకంజ వేస్తూ ఉంది.స్థానిక రాజకీయ నాయకులు పుష్కలంగా వుండడం తో పోలీసు నియమ నిబంధనలకు పాతర వేస్తున్నట్లు స్థానికంగా చర్చ మొదలైంది. ఇప్పుడు ఈ ప్రేమ వ్యవహారంలో కూడా చావు బతుకుల మధ్య ఉన్న యువకుడి ప్రాణాలను ఖాతరు చేయకుండా, అతనిపై దాడి చేసిన వారికి అనుకూలంగా వ్యవహరిస్తూ ఉండటం పట్ల బాధిత కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తు ఆందోళన దిగారు అంటే ఇక్కడ పరిస్థితి ఎలా ఉందో సీపీ దృష్టి సారించాలి.ఇప్పటికైనా సమగ్రమైన దర్యాప్తు చేసి ఇక్కడ కేసుల విషయంలో జాప్యం పై దృష్టి సారించాలని ప్రజలు సీపీ ను ముక్తకంఠంతో కోరుతున్నారు.

# అదృశ్యమైన ముగ్గురు చిన్నారులు సురక్షితం

**– 112 ఫిర్యాదుపై వెంటనే స్పందించిన ఫోర్త్ టౌన్ బ్లూ కోల్ట్స్ సిబ్బంది – పోలీసులకు తల్లిదండ్రుల కృతజ్ఞతలు**



**గురుద్వార్, మార్చి 9, మేజర్న్యూస్:** నగరంలోని ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో కనిపించకుండా పోయిన ముగ్గురు చిన్నారులను ఫోర్త్ టౌన్ పోలీసులు వేగంగా స్పందించి సురక్షితంగా గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో చిన్నారుల తల్లిదండ్రులు విశాఖ పోలీసులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం తెల్లవారు జామున ఒక వ్యక్తి 112 అత్యవసర సేవకు ఫోన్ చేసి తన ఐదేళ్ల కుమారుడు సహా మరో ఇద్దరు పిల్లలు కనిపించకుండా పోయినట్లు ఫిర్యాదు చేశాడు. ఈ సమాచారం అందుకున్న వెంటనే కంట్రోల్ రూమ్ పోలీసులు ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బ్లూ కోల్ట్స్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పిల్లల ఫోటోలు,వివరాలు సేకరించి పరిసర ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. కొద్దిసేపటికే ఫోటోల ఆధారంగా పిల్లలను గుర్తించి సురక్షితంగా వారి తల్లిదండ్రులకు అప్పగించారు. పిల్లలను సురక్షితంగా తిరిగి పొందడంతో ఆనందించిన తల్లిదండ్రులు ఫోర్త్ టౌన్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి ఫోర్త్ టౌన్ పోలీసుల వేగవంతమైన చర్యలను అభినందించారు.

# వీఎంఆర్డీఏ లో ముగ్గులపోటిలు



**విశాఖపట్నం, మార్చి 9, మేజర్న్యూస్:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వీఎంఆర్డీఏ లో నిర్వహించిన ముగ్గులపోటిలలో గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రధానం చేసిన చైర్మన్ ఎంవి ప్రణవ్ గోపాల్, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం కుటుంబ బాధ్యతలతో, విధులు నిర్వహణలో నిమగ్నమైన మహిళా ఉద్యోగులకు ఆటవిడుపు కోసం ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తే వారు రెట్టించిన ఉత్సాహంతో విధి నిర్వహణ పట్ల మరింత అంకిత భావంతో పనిచేసే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ పరిపాలనాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# వైసీపీ అబద్ధాలకు ఎమ్మెల్యే శంకర్ ఘాటైన సమాధానం

- సిక్కోలు అభివృద్ధే రామ్మోహన్ నాయుడు లక్ష్యం
- సిక్కోలు సింగంపై విమర్శలు తగవు
- ప్రజాభిమానంతో ముందుకెళ్తున్న రామ్మోహన్ నాయుడు




**శ్రీకాకుళం మార్చి 9 మేజర్ న్యూస్** :శ్రీకాకుళం జిల్లాపై, కేంద్ర మంత్రి నాయకత్వంపై కొంతమంది వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలు పూర్తిగా నిరాధారమని తెలుగుదేశం పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. తమ చేతకానితనాన్ని దాచుకోవడానికి కేంద్ర మంత్రిపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని వారు విమర్శించారు.ప్రపంచంలోనే ప్రతిష్టాత్మక సంస్థ అయిన అందించే యంగ్ గ్లోబల్ లీడర్ అవార్డుతో సత్కరించబడిన నాయకుడు రామ్మోహన్ నాయుడు అని గుర్తు చేశారు. ఒక సిక్కోలు బిడ్డగా తన ప్రాంత అభివృద్ధికి కట్టుబడి పని చేస్తూ జాతీయ, అంతర్జాతీయ వేదికలపై కీర్తి సాధిస్తున్న నాయకుడిపై అనవసర ఆరోపణలు చేయడం రాజకీయ వైఫల్యాన్ని మాత్రమే చూపిస్తుందని అన్నారు.రామ్మోహన్ నాయుడు ప్రజలతో మమేకమై పనిచేసే యువ నాయకుడని, పదవి ఉన్నప్పుడే ప్రజల మధ్య ఉండే నాయకుడు కాదని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తూ, ముఖ్యంగా ఒడిశాతో ఉన్న నీటి పారుదల సమస్యలు, నేరెడి బ్యారేజి అంశంపై పార్లమెంట్ సహా అనేక వేదికల్లో పోరాటం చేస్తున్నారని చెప్పారు.ఇక జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులో కూడా తేడా స్పష్టంగా కనిపిస్తోందన్నారు. 2014--19 మధ్య నాయకత్వంలోని తెలుగుదేశం ప్రభుత్వం వంశధార ప్రాజెక్ట్, హిరమండలం రిజర్వాయర్, మహేంద్రతనయ వంటి ప్రాజెక్టులకు భారీగా నిధులు కేటాయించగా, 2019--24 మధ్య వైసీపీ ప్రభుత్వం తక్కువ మొత్తమే విడుదల చేసిందని వివరించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మళ్లీ ఈ ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసే దిశగా నిధులు కేటాయిస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు.జిల్లా అభివృద్ధిలో కూడా రామ్మోహన్ నాయుడు గారి పాత్ర ఎంతో కీలకమని చెప్పారు. జాతీయ రహదారుల విస్తరణ, రైల్వే స్టేషన్ల అభివృద్ధి, అమృత్ భారత్ పథకంలో స్టేషన్ల అభివృద్ధి, పలాసలో కేంద్రీయ విద్యాలయ ఏర్పాటు, వికలాంగుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు, పరికరాల పంపిణీ వంటి అనేక కార్యక్రమాలు ఆయన ఆధ్వర్యంలో అమలవుతున్నాయని పేర్కొన్నారు.అదే విధంగా విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేయడం, ఉత్తరాంధ్ర అభివృద్ధికి కీలకమైన ప్రాజెక్టుల కోసం కేంద్ర స్థాయిలో కృషి చేయడం వంటి అంశాలు ఆయన కట్టుబాటుకు నిదర్శనమని తెలిపారు. విమానయాన రంగంలో కూడా దేశాన్ని ప్రపంచంలో మూడవ అతిపెద్ద దేశీయ విమానయాన వ్యవస్థగా నిలబెట్టడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు.శ్రీకాకుళం జిల్లాలో మత్స్యకారులు, రైతులు, యువతకు ఉపయోగపడే అనేక ప్రాజెక్టులు కేంద్ర బడ్జెట్ ద్వారా లభిస్తున్నాయని తెలిపారు. ఉద్దానం ప్రాంతంలో కొబ్బరి, జీడి రైతులకు మద్దతు, పలాస జీడి పరిశ్రమ అభివృద్ధి, పర్యాటక అభివృద్ధి, శాలిహుండం వంటి చారిత్రక ప్రదేశాలకు గుర్తింపు వంటి అంశాలు జిల్లాకు పెద్ద ఊపునిస్తున్నాయని చెప్పారు.మాజీ కేంద్ర మంత్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ శ్రీకాకుళాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్న నాయకుడు రామ్మోహన్ నాయుడు అని అన్నారు. ఆయన ఇచ్చిన హామీ ప్రకారం నేరెడి బ్యారేజి సమస్యను కూడా త్వరలో పరిష్కరించి జిల్లాకు సాగునీటి భరోసా కల్పిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి నాయకత్వంలో, అలాగే వికసిత్ భారత్ లక్ష్యాలతో సమన్వయం చేసుకుంటూ ఉత్తరాంధ్ర అభివృద్ధిని మరింత వేగవంతం చేస్తామని తెలిపారు. విమర్శలు ఎంత వచ్చినా అభివృద్ధి పథంలోనే ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు మొదలవలస రమేష్, వంశధార ప్రాజెక్టు చైర్మన్ అరవల రవీంద్ర,టౌన్ పార్టీ అధ్యక్షుడు పాండ్రంకి శంకర్, స్టేట్ ఎం ఎస్ ఎం ఈ డైరెక్టర్ ప్రధాన విజయరామ్, స్టేట్ ఏపీ డబ్ల్యూ ఐడి సి డైరెక్టర్ పిఎంజే బాబు, మాదరాపు వెంకటేష్, పి ఎ సి యస్ చైర్మన్ గొండు వెంకటరమణ మూర్తి, రూరల్ మండల అధ్యక్షులు మూకాళ్ళ శ్రీనివాస్, గార మండల అధ్యకులు లోపింటి రాధ కృష్ణ రెడ్డి, చిట్టి మోహన్, టౌన్ మహిళా అధ్యక్షురాలు పీరియ మాధవి, క్లస్టర్ ఇంచార్జీ అందవరపు సంతోష్, ఉంగటి రమణ, అందవరపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వ వైఫల్యాలు



**పాతపట్నం ,మార్చి 9,మేజర్ న్యూస్:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులైనా, మహిళలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా కాలయాపన చేస్తోందని వైఎస్సార్సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేవలం ప్రగల్భాలు పలకడమే తప్ప, క్షేత్రస్థాయిలో మహిళలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు.చంద్రబాబు తన ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారన్నారు. ప్రతి మహిళకు నెలకు రూ. 1,500 చొప్పున ఏడాదికి రూ. 18,000 ఇస్తామన్న హామీ ఏమైంది? ఆ సొమ్ము ఎప్పుడు ఇస్తారో సమాధానం చెప్పాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని చెప్పి, ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. పొదుపు మహిళలకు అందాల్సిన సున్నా వడ్డీ పథకాన్ని అటకెక్కించారు. గతంలో బాబు గారు బాకీ పడ్డ రూ. 15,000 కోట్లను ఇప్పటికీ చెల్లించకుండా మహిళలను వంచిస్తున్నారు.వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎంతో ఎదిగారని, ఆ రోజులను మహిళలు నేడు గుర్తు చేసుకుంటున్నారని అన్నారు. వైఎస్సార్ ఆసరా, చేయూత, కాపునేస్తం, ఈబీసీ నేస్తం, అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాలతో నేరుగా మహిళల ఖాతాల్లోకే నగదు చేరిందన్నారు. 31 లక్షల ఇళ్ల పట్టాలను మహిళల పేరు మీద ఇచ్చి, వారిని ఇంటి యజమానులను చేసిన ఘనత జగనన్నది. నామినేటెడ్ పోస్టులు మరియు పనుల్లో చట్టం చేసి మరీ 50 శాతం రిజర్వేషన్లు కల్పించి మహిళలకు రాజకీయ గుర్తింపునిచ్చారు. 'దిశ' చట్టం మరియు యాప్ ద్వారా ప్రతి అక్కచెల్లెమ్మకు భరోసా కల్పించారు.మహిళలను కేవలం ఓటు బ్యాంకుగా చూసే చంద్రబాబు నాయుడు, వారి సంక్షేమాన్ని విస్మరిస్తే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రగల్భాలు ఆపి, ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జగనన్న ఒక అన్నలా తోడుండి నడిపించిన తీరును రాష్ట్ర మహిళా లోకం ఎప్పటికీ మర్చిపోదని స్పష్టం చేశారు.

# పలువురిని పరామర్శించిన కృష్ణ చైతన్య



**నరసన్నపేట మార్చి 9 మేజర్ న్యూస్** : నరసన్నపేట మండలం యారబాడు గ్రామంలో ఇటీవల స్వర్గస్తులైన రాకోటి అప్పారావు కుటుంబ సభ్యులను, కొబగాం గ్రామంలో ఇటీవల స్వర్గస్తులైన మాజీ సర్పంచ్ వద్ర ఆశిరయ్య, నేతల సింహాచలం కుటుంబ సభ్యులను, తద్రవానిపేట



గ్రామంలో ఇటీవల స్వర్గస్తులైన గుడ్ల రామ్ సాయి కుటుంబ సభ్యులను, బాడాం గ్రామంలో ఇటీవల స్వర్గస్తులైన డోల ప్రకాష్ రావు కుటుంబ సభ్యులను సోమవారం యువ నాయకులు డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య పరామర్శించారు. ఈ పరామర్శలలో ఎంపీపీ ఆరంగి మురళిధర్, రాష్ట్ర రైతు కార్యదర్శి కనపల శేఖర్ రావు, జిల్లా అంగన్వాడి విభాగం అధ్యక్షులు పుట్ట ఆదిలక్ష్మి,మండల పంచాయతీ రాజ్ అధ్యక్షులు యాబాజీ రమేష్, మండల బూత్ కమిటీ అధ్యక్షులు బబ్బోది ఈశ్వరరావు , మండల యూత్ అధ్యక్షులు బుద్దల రాజశేఖర్, జిల్లా ఎస్సీ సెల్ ఉప అధ్యక్షులు సతివాడ రామినాయుడు,జిల్లా బూత్ కమిటీ కార్యదర్శి బగ్గు సింహాచలం,ఉప అధ్యక్షులు నేతింటి రాజేశ్వరరావు , సర్పంచ్లు అల్లు అసిరినాయుడు , డోల గోవింద , రాష్ట్ర సోషల్ మీడియా కార్యదర్శి కనపల అరవింద్, మండల యూత్ ఉప అధ్యక్షులు తోట భార్గవ్, బైరి రాజులు , సీతారాం తదితరులు పాల్గొన్నారు.

# బొత్స ను పరామర్శించిన ధర్మాన కృష్ణదాస్



**నరసన్నపేట మార్చి 9 మేజర్ న్యూస్** : శాసన మండలి ప్రతిపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ పరామర్శించారు. ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై కోలుకుంటున్న బొత్సను సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కృష్ణదాస్ కలిశారు. బొత్స ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఆయన, త్వరగా పూర్తిస్థాయిలో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో దశాబ్దాలుగా ఉన్న సాన్నిహిత్యాన్ని ఈ సందర్భంగా వారు గుర్తు చేసుకున్నారు. పరామర్శలో కృష్ణదాస్ తో పాటు మాజీ మంత్రి వర్యులు కారుమూరి నాగేశ్వరరావు,సీదిరి అప్పలరాజు,మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్,మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్,టెక్కలి సమన్వయకర్త పేరాడ తిలక్, ఆమదాలవలస సమన్వయకర్త చింతాడ రవికుమార్ పాల్గొన్నారు .




## రోడ్డు భద్రతలు పాటించండి : ఎస్ఐ అమ్మన్న రావు



**సీతంపేట మార్చి 9మేజర్ న్యూస్ :** రోడ్డు భద్రతలు పాటించి ప్రయాణాలు చేయాలని స్థానిక ఎస్ ఐ అమ్మన్న రావు హితవు పలికారు. సోమవారం స్థానిక సంత మార్కెట్ వద్ద వాహనాలు నడుపున్న వారికి ప్రత్యేక సూచనలు చేశారు. హెల్మెట్ ధరించాలని, మత్తు పదార్థాలు సేవించి వాహనాలు నడపరాదని, ఘాట్ రోడ్లో ఇంజన్ ఆపి వాహనం నడరాదని ఎస్ ఐ అమ్మానారావు తెలిపారు. స్థానిక పోలీస్ సిబ్బంది సదస్సులో పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారమే లక్ష్యం

## – జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి – పిజిఆర్ఎస్ కు 95 అర్జీలు





**పార్వతీపురం, మార్చి 08 (మేజర్ న్యూస్) :** పిజిఆర్ఎస్ కు వచ్చిన అర్జీదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు పని చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకరరెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ సి యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా రెవిన్యూ అధికారి కె. హేమలతతో కలిసి కలెక్టర్ అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రతి ఫిర్యాదును వ్యక్తిగత బాధ్యతగా తీసుకుని తక్షణమే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమస్య అంటూ మన దగ్గరకు వచ్చిన వారికి సరైన పరిష్కారం చూపించడమే ప్రధాన ద్యేయంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమయపాలన, ప్రజాస్పందన, పారదర్శకత మీదే పరిపాలన ఆధారపడి ఉంటుందన్నారు. ప్రతి అధికారి చిన్న చిన్న ఫిర్యాదులకు కూడా సత్వరం స్పందించి అర్జీదారులకు పరిష్కారం చూపించగలిగితే అర్జీదారుల్లో విశ్వాసం పెరుగుతుందన్నారు.

**దరఖాస్తు వివరాలు :** ఐటిడిఎ ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్స్లో టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగం అవకాశం కల్పించాలని మక్కువ మండలం బురదగెడ్డవలస గ్రామానికి చెందిన డి. లక్ష్మి కోరారు.మజ్జి గౌరీ కాలనీలో అపార్ట్మెంట్ సంబంధించిన ట్రాన్స్ఫార్మర్ ను రోడ్డు మధ్యలో పెట్టి ఉన్నారని ఆ ట్రాన్స్ఫార్మర్ ని అపార్ట్మెంట్ లోపలికి మార్చాలని పార్వతీపురం పట్టణానికి చెందిన కె. బి. కె. ప్రసాద్ అర్జీ సమర్పించారు.వీరఘట్టం మండలం నడిమికెల్ల గ్రామానికి చెందిన వి.సరస్వతి తన యొక్క కుమారుడు 10వ తరగతి మార్క్స్ లిస్టులో ఇంటిపేరు తప్పుగా నమోదు చేశారని ఇంటి పేరును సరి చేయాలని అర్జీ అందజేశారు. పార్వతీపురం పట్టణానికి చెందిన జి.వరలక్ష్మి రైతు భరోసా డబ్బులు జమ కాలేదని వినతిపత్రం సమర్పించారు.

**రెవెన్యూ దరఖాస్తు :** బలిజిపేట మండలం అజ్జాడ గ్రామానికి చెందిన బి.పోలినాయుడు సర్వేనెంబర్ 0.44 సెంట్లు ఎండోమెంట్ భూమి గా నమోదయిందని జురాయితీ భూమిగా మార్చాలని వినతి పత్రం సమర్పించారు. పార్వతీపురం మండలం కల్లికోట గ్రామానికి చెందిన ఎ. అప్పల నాయుడు డ్రైనేజీ కాలువ నీటిని తన పంట పొలాలలోకి పంపించి భూములను నాశనం చేస్తున్న వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. సీతానగరం మండలం లచ్చయ్యపేట గ్రామానికి చెందిన ఎస్.కృష్ణ సర్వే నంబర్ 158-2 లో 2.5 సెంట్లు భూమిని వేరే వారు ఆక్రమణ చేశారని తెలిపారు.ఈ వినతుల స్వీకరణ కార్యక్రమంలో జిల్లాలో అన్ని శాఖల అధికారులు ఉన్నారు.

## పార్వతీపురం మన్యం జిల్లాలో హెచ్పీవీ టీకా కార్యక్రమం ప్రారంభం

– 10 వేల మంది బాలికలే లక్ష్యం – జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకరరెడ్డి



**పార్వతీపురం, మార్చి 9 (మేజర్ న్యూస్) :** మహిళల్లో వచ్చే భయంకరమైన గర్భాశయ క్యాన్సర్ను నివారించే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన హెచ్పీవీ టీకా పంపిణీ కార్యక్రమం పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని జిల్లా ఆసుపత్రిలో అధికారికంగా ప్రారంభమైంది. మహిళా ఆరోగ్య రక్షణే ధ్యేయంగా జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకరరెడ్డి ఈ బృహత్తర కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టారు. జిల్లావ్యాప్తంగా 14 ఏళ్లు నిండిన సుమారు 10,000 మంది బాలికలు, యువతులను ఈ టీకా కోసం గుర్తించారు. బహిరంగ మార్కెట్లో ఒక్కో డోస్ ధర ?4,000 పైనే ఉన్నప్పటికీ, ప్రజారోగ్యం దృష్ట్యా ప్రభుత్వం ఈ టీకాలను పూర్తిగా ఉచితంగా అందిస్తోంది. గర్భాశయ క్యాన్సర్ వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యల నుండి మహిళలకు దీర్ఘకాలిక రక్షణ కల్పించేందుకు ఈ టీకా ఎంతో దోహదపడుతుంది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన బాలికలందరూ తమ తల్లిదండ్రులను వెంటబెట్టుకుని వచ్చి, వారి అంగీకారంతో టీకా వేయించుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ?రాష్ట్ర మరియు దేశవ్యాప్తంగా విజయవంతంగా అమలువుతున్న ఈ కార్యక్రమాన్ని జిల్లాలో కూడా పకడ్బందీగా నిర్వహించాలని అధికారులు ఆదేశించారు. రాబోయే మూడు నెలల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయాలి. తగిన ప్రణాళికలతో ఏ ఒక్క అర్హులైన అమ్మాయి కూడా మిస్ కాకుండా, ఇన్ టైమ్లో లక్ష్యాన్ని చేరుకోవాలని వైద్య సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ నాగభూషణరావు, డిఎంఅండ్ హెచ్ ఓ భాస్కర్ రావు, డాక్టర్ జగన్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామాలయంలో మంత్రి సంధ్యారాణి ప్రత్యేక పూజలు





**పాచిపెంట, మార్చి 9 (మేజర్ న్యూస్) :** పాచిపెంట మండలం గడి వలస గ్రామంలో నూతనంగా నిర్మాణం చేసిన శ్రీ రామాలయంలో గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం సాయంత్రం మంత్రి సంధ్యారాణి తమ టిడిపి పార్టీ నాయకులు, సహచరులతో కలసి వచ్చి రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 4, 5,6 వ తేదీల్లో గడి వలస గ్రామంలో నూతనంగా రామాలయం నిర్మాణం జరిపి గ్రామస్తులు ప్రతిష్ట కార్యక్రమంను నిర్వహించారు.

అప్పట్లో మంత్రి సంధ్యారాణి అందుబాటులో లేకపోవడంతో ప్రతిష్ట కార్యక్రమానికి రాలేక పోయారు. ఆమె ఇటీవల తన సొంత నియోజకవర్గం వచ్చి న వెంటనే గడి వలస రామాలయానికి వచ్చి శ్రీరాముని దర్శించుకున్నారు. నియోజకవర్గం ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని దేవుణ్ణి కోరుకున్నారు. ఆమెతో పాటు మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గూడెపు యుగంధర్, సాలూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముఖి సూర్యనారాయణ, పలువురు మండల నాయకులు కార్యకర్తలు అభిమానులు దేవుణ్ణి దర్శించుకున్నారు.

## కేంద్ర ప్రభుత్వ మ్యాగజైన్లో జిల్లా పథకాలు ప్రచురణ



**సీతంపేట మార్చి 9మేజర్ న్యూస్ :** విశాఖపట్నంలో సోమవారం జరిగిన ప్రాంతీయ ఉత్తమ పద్ధతుల సెమినార్ కార్యక్రమానికి సీతంపేట ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి స్వప్నిల్ పవార్ హాజరయ్యారు. ఈ సెమినార్ సందర్భంగా ఎడిపి&ఏబిపి మిషన్ డైరెక్టర్ రోహిత్ కుమార్ కేంద్ర ప్రభుత్వం ప్రచురించిన ఉత్తమ పద్ధతుల పుస్తకాన్ని అధికారికంగా విడుదల చేశారు. ఈ పుస్తకంలో పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన అనేక వినూత్న కార్యక్రమాలు ప్రచురితమయ్యాయి. జిల్లాలో అమలవుతున్న ఉత్తమ కార్యక్రమాలైన ముస్తాబు, మా ఊరికి మలేరియా వచ్చింది మరియు ఆనంద లహరి -- మన్యం డ్యాన్స్ కార్యక్రమాలు గుర్తింపు పొందుతూ ఈ పుస్తకాల్లో ప్రచురించబడ్డాయి. ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి నమోదు చేసిన అన్ని ఉత్తమ కార్యక్రమాల్లో అత్యధికంగా పార్వతీపురం మన్యం జిల్లా నుంచే ఉండటం విశేషం. జిల్లా కలెక్టర్ గారి సమర్ధవంతమైన నాయకత్వం మరియు మార్గదర్శకత్వంలో సాధించిన ఈ విజయము జిల్లా కోసం గర్వకారణమై, వినూత్న పరిపాలన మరియు సమాజ అభివృద్ధి పట్ల జిల్లాకు ఉన్న నిబద్ధతను ప్రతిబింబిస్తుందని ఐటిడిఎ పీవో స్వప్నిల్ పవార్ తెలిపారు.

## మహిళా సాధికారతక, స్వేచ్ఛ సమానత్వంకై ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలి : ఐద్వా జిల్లా కార్యదర్శి బి.లక్ష్మి పిలుపు



**గరుగుబిల్లి, మార్చి 9 (మేజర్ న్యూస్) :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఐద్వా, సిఐటియు, యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ సంఘాలు నిర్వహిస్తున్న వారోత్సవాలలో భాగంగా సోమవారం మండల పరిధిలోని ఉల్లిభద్ర గ్రామంలో అంగన్వాడి యూనియన్ నాయకులు చింతాడ గౌరమ్మ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా అఖిల భారత ప్రజా తంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కార్యదర్శి బి లక్ష్మి మాట్లా డుతూ దేశ వ్యాప్తంగా మహిళలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఈసమస్యలు పరిష్కారానికి ఐక్య ఉద్యమాలకు మహిళలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మహిళలను ఉద్ధరిస్తామన్న పాలకులు రోజు రోజుకు మహిళలపై భారాలు మోపుతున్నారని ఇటీవల వంట గ్యాస్ ధరలు పెంచటం దీనికి ఉదాహరణ అని తెలిపారు. ప్రభు త్వాలు ప్రచారాలు మాని మహిళలు అక్షరాస్యత పెంపుదలకు,మహిళ లకు ఉపాధి కల్పించేందుకు, పని ప్రదేశాలలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి ప్రత్యేకమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# ప్రస్తుత సమాజంలో ఆందోళన కలిగించేవిధంగా వైద్య విద్యార్థుల ఆత్మహత్యలు



**నెల్లిమర్ల, మార్చి 9, మేజర్ న్యూస్ :** వైద్య విద్యార్థుల ఆత్మహత్యలు ప్రస్తుతం సమాజంలో ఆందోళన కలిగిస్తున్నాయని సైకియాట్రిస్ట్ విభాగం హెచ్ఓడి హేమంత్ మాధవ్ వెల్లడించారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో మిమ్స్ వైద్య కళాశాలలో వైద్య విద్యార్థుల ఆత్మహత్యలను అరికట్టడానికి సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ విద్యార్థుల ఆత్మహత్యలను నివారించడానికి వైద్యకళాశాలలో మానసిక నిపుణులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో మానసిక వైద్య నిపుణులు ప్రొఫెసర్ నెల్సన్ మాట్లాడుతూ వైద్య విద్యార్థుల ఆత్మహత్యలు సర్వసాధారణంగా మారాయని చెప్పారు. వైద్య విద్యార్థులు ఎదుర్కొనే ఒత్తిడి మిగిలిన వారితో పోలిస్తే భిన్నంగా ఉంటుందన్నారు. సిలబస్ చాలా ఎక్కువగా ఉండటం, నిరంతర పరీక్షలు, ఎప్పుడూ మొదటి స్థానంలో ఉండాలనే తపన విద్యార్థులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయని చెప్పారు. ఆసుపత్రుల్లో ఎక్కువ గంటల పాటు నిరంతర డ్యూటీలు చేయడం వల్ల మెదడు తీవ్రమైన అలసటకు గురవుతుందన్నారు. సీనియర్ల వేధింపులు, ప్రొఫెసర్ల కఠిన వైఖరి విద్యార్థుల్లో ఆత్మన్యూనతా భావాన్ని కలిగిస్తాయని వెల్లడించారు. డాక్టర్లు ఎప్పుడూ ధైర్యంగా ఉండాలనే సామాజిక అంచనాల వల్ల, విద్యార్థులు తమ బాధను బయటపెట్టలేక లోలోపలే కుమిలిపోతున్నారని చెప్పారు. మానసిక సమస్యలు ఎదురైనప్పుడు అది బలహీనత కాదు, అనారోగ్యం అని గుర్తించాలని తెలిపారు. వెంటనే సైకియాట్రిస్ట్ లేదా కౌన్సిలర్‌ను సంప్రదించాలని సూచించారు. చదువుతో పాటు సంగీతం, క్రీడలు లేదా మెడిటేషన్ వంటి వాటికి కొంత సమయం కేటాయించడం వల్ల ఒత్తిడి తగ్గుతుందని చెప్పారు. ఒంటరిగా ఉండటం, తక్కువగా మాట్లాడటం, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే అప్రమత్తం కావాలని సూచించారు. సమస్య ఏదైనా సరే, ప్రాణం కంటే పెద్దది కాదని, మాట్లాడటం వల్ల సగం ఒత్తిడి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సంగీత పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనుల్లో ఫేస్ రికగ్నైజ్ హాజరు అమలు : ఎంపీడీవో ఎస్ రామకృష్ణ



**బాడంగి, మార్చి 9 (మేజర్ న్యూస్) :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కార్మికులందరికీ పారదర్శకంగా పని కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా మార్చి 1వ తేదీ నుండి ఫేస్ రికగ్నిషన్ ఆధారిత హాజరు విధానాన్ని అమలు చేస్తున్నట్లు ఎంపీడీవో ఎస్. రామకృష్ణ తెలిపారు.సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బాడంగి మండలంలోని 25 పంచాయతీల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫేస్ రికగ్నిషన్ విధానంతోనే కార్మికుల హాజరు నమోదు చేస్తున్నామని చెప్పారు. ఈ విధానం వల్ల ఫీల్డ్ స్థాయిలో ఎటువంటి అక్రమాలు జరగకుండా నియంత్రణ సాధ్యమవుతుందని, ఒకరి స్థానంలో మరొకరు పనికి హాజరయ్యే అవకాశం లేకుండా పూర్తిగా పారదర్శకత నెలకొంటుందని ఆయన వివరించారు. ఉపాధి హామీ పనుల్లో పాల్గొనే ప్రతి వేతన శ్రామికుడు తప్పనిసరిగా ఈ-కేవైసీ పూర్తి చేయించుకోవాలని ఆయన సూచించారు. అలాగే ఎండల తీవ్రత దృష్ట్యా కార్మికులు ఉదయం 6.30 గంటలకు పనిస్థలానికి హాజరుకావాలని తెలిపారు. పనిస్థలాల్లో కార్మికులకు అవసరమైన నీడ పందిరులు, తాగునీరు వంటి సౌకర్యాలు తప్పనిసరిగా కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు ఆదేశాలు జారీ చేసినట్లు ఎంపీడీవో రామకృష్ణ పేర్కొన్నారు.

# 200 రోజులు పని కల్పించి రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలి



**బాడంగి, మార్చి 9, మేజర్ న్యూస్ :** ఉపాధి హామీ పథకం కార్మికులకు సంవత్సరానికి 200 రోజులు పని కల్పించి, రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని కోరుతూ ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సోమవారం బాడంగి ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవో ఎస్. రామకృష్ణకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.గోపాలం, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పి. శంకర్రావు, కొల్లి తిరుపతి నాయుడు, బాడంగి కమిటీ నాయకులు వై. మురళి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకానికి సంబంధించి అమల్లో ఉన్న పాత చట్టాన్ని రద్దు చేసి, కొత్తగా "వి.బి.జి. రామ్ జీ" పేరుతో పనులు ప్రారంభిస్తున్నారని తెలిపారు. ఇందులో ముఖ గుర్తింపు (ఫేస్ రికగ్నిషన్) ద్వారా హాజరు నమోదు చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ విధానంలో సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయని, కార్మికులకు ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొన్నారు. అందువల్ల ఈ విధానాన్ని రద్దు చేసి కార్మికులకు సౌకర్యవంతమైన విధంగా హాజరు వ్యవస్థను కొనసాగించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

# విద్యార్థులు సమతుల్య ఆహారం తీసుకోవాలి



**నెల్లిమర్ల, మార్చి 9 (మేజర్ న్యూస్) :** విద్యార్థులు సమతుల్య ఆహారం తీసుకోవాలని మిమ్స్ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సంషీర్ బేగం చెప్పారు. మిమ్స్ నర్సింగ్ కళాశాల ఆధ్వర్యంలో విజయనగరం పట్టణం లంకవీధిలోని ఎంజేపి కార్పొరేషన్ పాఠశాల విద్యార్థులకు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత, నులిపురుగులు, మలేరియా నివారణ, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ల మధ్య వ్యత్యాసం గురించి వివరించారు. అలాగే పర్యావరణ పరిశుభ్రత, సమతుల్య ఆహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై నర్సింగ్ విద్యార్థులు, పిల్లలకు అవగాహన కల్పించారు. విద్యార్థులందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు టి దేవిలత, ప్రశాంతి, పవన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.గోవిందరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కాశీ విశ్వేశ్వరస్వామిని దర్శించుకున్నప్రదీప్ నాయుడు, సిరమ్మ

**విజయనగరం టౌన్ మార్చి 9 మేజర్ న్యూస్ :** ఉత్తరప్రదేశ్ లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాశీ విశ్వేశ్వరుని ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు మరియు భీమిలి నియోజవర్గం సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు(చిన్న శ్రీను) సతీమణి మజ్జి పుష్పాంజలి, అల్లుడు నెల్లిమర్ల నియోజకవర్గం వైస్సార్ సీపియువజన విభాగం అధ్యక్షులుప్రదీప్ నాయుడు, కుమార్తె చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మ ఆదివారం నాడు కాశీ విశ్వేశ్వరుని దర్శించి పూజలు చేశారు. అనంతరం వేద పండితుల ఆశీర్వాదం పొందారు.



## పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

**లక్క వరపు కోట మార్చి 9 (మేజర్ న్యూస్) :** ఉత్తరాంధ్ర జిల్లాల విద్యార్థులకు గత కొన్నేళ్లుగా అనేక రకాలుగా విద్యా సేవలందిస్తున్న శ్రీరామా చారిటబుల్ ట్రస్ట్ 10వ తరగతి పరీక్షలు రాయునున్న విద్యార్థులకు పరీక్ష సామాగ్రి కిట్లను పంపిణీ చేసింది. సోమవారం విజయనగరం జిల్లా లక్కవరపుకోట మండలం లోని కల్లేపల్లి రేగ, గంగుబూడి, చందులూరు సహా వివిధ ప్రాంతాల్లోని హై స్కూల్లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు రెండు సెట్ల పరీక్ష సామాగ్రిని ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి వేదుల మధురవాణి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గ్రామ పెద్దల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థు లతో మాట్లాడిన శ్రీరామా చారిటబుల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి వేదుల మధురవాణి పరీక్షలకు సిద్ధపడిన విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి విజయం సాధించాలని ఉద్బోధించారు. ప్రతి వ్యక్తి ఉజ్వల భవిష్యత్తుకు 10వ తరగతి మొదటి మెట్టు అని, అక్కడ బలంగా పునాది వేసుకోవాలని సూచించారు. చిన్నారుల సంక్షేమం విద్యా వైద్యం లక్ష్యంగా శ్రీరామా చారిటబుల్ ట్రస్ట్ సేవలందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 19 నుంచి ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీరాంపురంలో శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరోవైపు 10వ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు శ్రీరామ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్. తెన్నేటి సుబ్బారావు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు వేదుల సోమేశ్వరరావు, సంస్థ ప్రతినిధులు భోజంకి చిన్నంనాయుడు, గురు ముత్యాల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి ఎస్సీ సెల్ విస్తృత స్థాయిస మావేశాన్ని జయప్రదం చేయాలి



**నెల్లిమర్ల, మార్చి 9 (మేజర్ న్యూస్) :** వైసిపి ఎస్సీసెల్ విస్తృత స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని ఎస్సీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాస రావు కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 11న కాకినాడ సూర్య కళామందిర్ లో వైసిపి ఎస్సీ సెల్ రాష్ట విస్తృతస్థాయి సమావేశం జరుగుతుందని తెలిపారు. అలాగే మాజీ ఎమ్మెల్యే టి.జె. ఆర్. సుధాకర్ బాబు, రాష్ట్ర వర్కింగ్ కమిటీ చైర్మన్ కొమ్మూరు కనకారావు ఆధ్వర్యంలో కాకినాడ పట్టణం సూర్య కళామందిర్‌లో నిర్వహించనున్న సమావేశానికి రాష్ట్రస్థాయి కార్యవర్గం, అన్ని జిల్లాల అధ్యక్షులు, నియోజకవర్గ అధ్యక్షులు పట్టణ అధ్యక్షులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

## అంతర్జాతీయ సైన్స్ అండ్ మ్యాథ్స్ ఇంటర్నేషనల్ పరీక్ష ప్రతిభలో పతకాల పంట



**గుర్ల, మార్చ్9 (మేజర్ న్యూస్) :** అంతర్జాతీయ సైన్స్ అండ్ మ్యాచ్ ఇంటర్నేషనల్ పరీక్ష ప్రతిభలో గుజ్జంగివలస గ్లోబల్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలకు చెందిన విద్యార్థుల పతకాల పంట పండించారు. సోమవారం మండల విద్యాశాఖ అధికారి భాను ప్రకాష్ అభినందన సభ లోపాల్గొని పథకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పట్టుదల,కార్యదీక్ష విద్యార్థులను ముందుకు తీసుకెళ్లడానికి ఎంతో దోహదపడుతుందన్నారు. గతంలో కూడా ఈ పాఠశాల విద్యార్థుల ప్రతిభ కనబరిచినందుకు పథకాలు సాధించిన ఘనత ఉందన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులకు ఇలాంటి ప్రతిభా పరీక్షలు అవసరమన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిలో మ్యాథ్స్‌లో స్టేట్ టాపర్స్‌గా రెండు రజిత పతకాలు స్కూల్ టాపర్స్‌గా 8 బంగారు పతకాలు, 6 రజిత పతకాలు, 5 కాంస్య పతకాలు సాధించారనీ అలాగే సైన్స్ స్టేట్ టాపర్స్‌గా 6 బంగారు పతకాలు,1 రజిత పతకం, స్కూల్ టాపర్స్ గా3 బంగారు పతకాలు5 రజిత పతకాలు, 5 కాంస్య పతకాలుసాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రెడ్డి మురళీధర్ రావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## హెచ్‌పివి వ్యాక్సిన్‌ని ప్రారంభించిన ఎంపీపీ నీలంశెట్టి గోపమ్మ



**కొత్తవలస మార్చి 10 (మేజర్ న్యూస్) :** సర్వైకల్ క్యాన్సర్ నివారణకు హెచ్‌పివి వ్యాక్సిన్ ఎంతో ఉపయోగకరమని వైద్యాధికారి డాక్టర్ గోపాలకృష్ణ తెలిపారు. గార్డాసిల్-4 రకం క్వాడ్రీ వాలెంట్ హెచ్‌పివి రకాలు 6,11,16,18. ఒకే మోతాదు 0.5.ఎంఎల్ ఎడమపై భుజం కండరాలు లోనికి టీకా వేస్తారని వైద్యాధికారి డా" గోపాలకృష్ణ తెలిపారు. పి.హెచ్.సి. పరిధిలో 14 సంవత్సరాల నిండినఅర్హులైన బాలికలు 277 మంది ఉన్నట్లు తెలిపారు. హెచ్‌పివి వ్యాక్సిన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి, ట్రెయిన్డ్ స్టాఫ్ నర్సు సమక్షంలో వేస్తారని తెలిపారు. ఈ రోజు నలుగురుకి హెచ్‌పివి వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. 90 రోజుల్లో హెచ్‌పివి 277 మందికి వెయ్యాలని ప్రభుత్వం నిర్దేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వియ్యంపేట సర్పంచ్ పులిబంటి రాము, ఈ.ఓ.నరసింహారావు, పి. హెచ్. ఎన్. జగదాంబ, హెచ్.వి.పద్మావతి, ఎమ్.ఎల్.హెచ్.పి.లు, ఏ.ఎన్.ఏమ్స్, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

## చిరస్మరణీయులు పొట్టి శ్రీరాములు



**విజయనగరం టౌన్, మార్చి 9, మేజర్ న్యూస్ :** అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు స్మారక సేవా సమితి ఆధ్వర్యంలో జొన్నగుడ్డి నగర పాలక ప్రాథమిక పాఠశాల వద్ద సోమవారం పొట్టి శ్రీరాములు విగ్రహం ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంనకు ఆవిష్కర్త గా విచ్చేసిన డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం కోసం 58 రోజులు ఆమరణ నిరాహారదీక్ష చేసి అశువులు బాసిన చిరస్మరణీయులు పొట్టి శ్రీరాములు అని అన్నారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం పోరాడి తన ప్రాణాలను వదిలిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని శ్రావణి అన్నారు. సేవా సమితి ప్రోగ్రాం చైర్మన్ బండారు చంద్రశేఖర్ మాట్లాడుతూ జిల్లాలో 58 విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సమితి అధ్యక్షులు చెరుకూరి నాగరాజు మాట్లాడుతూ నేటితరానికి పొట్టి శ్రీరాములు గారి త్యాగనిరతి తెలియాలనే ఉద్దేశ్యంతో 58 చోట్ల విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విగ్రహ దాత గుడూరు నరసింగరావు,ప్రధాన కార్యదర్శి బత్తుల కామేష్,ఉపాధ్యక్షులు డిమ్స్ రాజు, కో చైర్మన్ సముద్రాల నాగరాజు, కోశాధికారి ఆరిశెట్టి సందీప్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉప్పల శ్రీనివాసరావు పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సముద్రాల గిరిజా ప్రసన్నకు ఉత్తమ మహిళా పురస్కారం



**విజయనగరం టౌన్ మార్చి 9 మేజర్ న్యూస్ :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లో బిర్లా సైన్స్ సెంటర్ లో జరిగిన వేడుకల్లో ఉపాధ్యాయ రంగంలో గడిచిన 23 సంవత్సరాలుగా అందిస్తున్న సేవలను గుర్తించి విజయనగరం జిల్లా కేంద్రానికి చెందినది వైజాగ్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆంగ్ల ఉపాధ్యాయురాలు సముద్రాల గిరిజా ప్రసన్నకు ఉత్తమ మహిళా పురస్కారాన్ని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రదానం చేశారు .ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ చిలుముల బాల్ రెడ్డి అధ్యక్షతన పాన్ ఇండియన్ సోషియో కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యం లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాల నుంచి ఎంపిక చేసిన 20 మంది మహిళలకు పురస్కారాలు అందజేశారు. ఈ వేడుకల్లో అసోసియేషన్ అధ్యక్షులు అద్దంకి రాజా, కాంతిరేఖ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రామ దర్బార్ ఆలయ తృతీయ వార్షికోత్సవానికి హాజరైన "జెడ్పీ చైర్మన్"





**గుర్ల, మార్చి9 (మేజర్ న్యూస్) :** గుజ్జింగవలస గ్రామంలో ఉన్న శ్రీ సంపత్ గణపతి ,శ్రీ సుబ్రహ్మణ్య సహిత శ్రీ రామ దర్బార్ ఆలయ తృతీయ వార్షికోత్సవ మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున జాము నుండి అత్యంత భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అంతేకాకుండా శ్రీరామ నామ సంకీర్తనలతో భజన కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం రెండు వేల మందికి భోజన వితరణ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం ఆధ్యాత్మిక కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త శ్రీ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త అట్టాడ చిన్నమనాయుడు దంపతులు సాధర స్వాగతం పలికారు.ఆలయ పూజారి మోహన్ రావు శర్మ ఆయనకు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ప్రజలందరికీ శుభం చేకూరుతుందని, భక్తి భావం వల్ల సమాజంలో శాంతి నెలకొంటుందని ఆకాంక్షించారు. అలాగే మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ఆలయ ధర్మకర్త ప్రత్యేక ఆహ్వానం మేరకు పాల్గొన్న ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.సాయంత్రం ఉత్సవమూర్తులను అత్యంత వైభవశీగా గ్రామ తిరు వీధిలో ఊరేగింపు నిర్వహించారు.ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సవముతో ఏర్పాటు చేయడంతో గ్రామ ప్రజలు తిలకించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ముఖ్య నాయకులు రెడ్డి అప్పల నరసయ్య, రెడ్డి మురళీధర్ రావు,అట్టాడ అప్పలరాజు, అట్టడ లక్ష్మా నాయుడు, (ఏకాసి) వెంపటాపు సూర్యనారాయణ,తదితర గ్రామ పెద్దలు, నెల్లిమర్ల వైస్ ఎంపీపీ,భక్తులు పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు శ్రీరామా చారిటబుల్ ట్రస్ట్ పరీక్ష సామగ్రి పంపిణీ



**లక్క వరపు కోట మార్చి 9 (మేజర్ న్యూస్) :** ఉత్తరాంధ్ర జిల్లాల విద్యార్థులకు గత కొన్నేళ్లుగా అనేక రకాలుగా విద్యా సేవలందిస్తున్న శ్రీరామా చారిటబుల్ ట్రస్ట్ 10వ తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు పరీక్ష సామాగ్రి కిట్లను పంపిణీ చేసింది. సోమవారం విజయనగరం జిల్లా లక్కవరపుకోట మండలంలోని కల్లేపల్లి రేగ, గంగుబూడి, చందులూరు సహా వివిధ ప్రాంతాల్లోని హై స్కూల్లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు రెండు సెట్ల పరీక్ష సామాగ్రిని ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి వేదుల మధురవాణి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గ్రామ పెద్దల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన శ్రీరామా చారిటబుల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి వేదుల మధురవాణి పరీక్షలకు సిద్ధపడిన విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి విజయం సాధించాలని ఉద్బోధించారు. ప్రతి వ్యక్తి ఉజ్వల భవిష్యత్తుకు 10వ తరగతి మొదటి మెట్టు అని, అక్కడ బలంగా పునాది వేసుకోవాలని సూచించారు. చిన్నారుల సంక్షేమం విద్యా వైద్యం లక్ష్యంగా శ్రీరామా చారిటబుల్ ట్రస్ట్ సేవలందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 19 నుంచి ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీరాంపురంలో శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరోవైపు 10వ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు శ్రీరామ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్. తెన్నేటి సుబ్బారావు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు వేదుల సోమేశ్వరరావు, సంస్థ ప్రతినిధులు భోజంకి చిన్నంనాయుడు, గురు ముత్యాల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## డిఎంహెచ్ఓ పేరుతో వస్తున్న నకిలీ ఉద్యోగ ప్రకటనలు నమ్మవద్దు

### జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.జీవన రాణి



**విజయనగరం, మార్చి 09 (మేజర్ న్యూస్) :** సామాజిక మాధ్యమాల్లో జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖలో ఉద్యోగాల భర్తీ జరుగుతున్నట్లు వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్. జీవనరాణి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రస్తుతం జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ నుండి ఎటువంటి ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయలేదని తెలిపారు. సోషల్ మీడియా లేదా ఇతర మార్గాల ద్వారా వస్తున్న నకిలీ కాల్స్, మెసేజ్లు నమ్మి ఎవరూ మోసపోవద్దని సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు అడిగితే అస్సలు నమ్మవద్దని హెచ్చరించారు. ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించిన అధికారిక సమాచారం ప్రభుత్వం నిబంధనల ప్రకారం మాత్రమే ప్రముఖ దినపత్రికలు మరియు అధికారిక వెబ్‌సైట్ల ద్వారా ప్రకటించబడుతుందని తెలిపారు. మోసపూరితమైన ఫోన్ కాల్స్, మెసేజ్లు లేదా నకిలీ నియామక పత్రాలను నమ్మి ఎవరూ డబ్బులు చెల్లించవద్దని, ఇటువంటి పుకార్ల పట్ల అభ్యర్థులు మరియు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్. జీవనరాణి కోరారు.

## మహిళా కానిస్టేబుల్స్‌కు చీరలు పంపిణీ చేసిన సిఐ నారాయణరావు



**బొబ్బిలి, మార్చి 09 (మేజర్ న్యూస్) :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలలో భాగంగా మహిళా కానిస్టేబుల్స్‌కు చీరలు పంపిణీ చేశారు. ఈ మేరకు సోమవారం బొబ్బిలి పోలీసు స్టేషన్‌లో పట్టణ సిఐ కె.నారాయణరావు ఆద్వర్యంలో చీరలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మహిళా కానిస్టేబుల్స్ తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## ఏఎంసీ సముదాయంలో పౌర సరఫరాల గోడౌన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే బేబీనాయన



**బొబ్బిలి, మార్చి 09 (మేజర్ న్యూస్) :** బొబ్బిలి ఏఎంసీ సముదాయంలో ఉన్న గోడౌన్ ను పౌరసరఫరాల శాఖ వారికి లీజుకి ఇవ్వగా, సోమవారం శాసన సభ్యులు ఆర్.వీ.ఎస్.కె.కె.రంగారావు (బేబీ నాయన) ఆ గోడౌన్ ను ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శ్రీ నర్సుపల్లి వెంకటనాయుడు, బొబ్బిలి మండల టీడీపీ అధ్యక్షులు శ్రీ వాసిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి కార్యకర్తను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు



**పార్వతీపురం, మార్చి 8 (మేజర్ న్యూస్) :** పార్వతీపురం పురపాలక సంఘం కొత్తవలస ప్రాంతం ఎనిమిదవ వార్డు పరిధిలో గల వైసిపి వైసిపి కుటుంబీకులైన నకిరెడ్డి చిన్నమ్మలు ఇటీవల అగ్ని ప్రమాదానికి గురై గాయపడిన విషయాన్ని స్థానిక నాయకులు ద్వారా తెలుసుకొన్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు సోమవారం వారిని వాసానికి వెళ్లి బాధ్యతలని పరామర్శించి జరిగిన ఘటనను అడిగి తెలుసుకుని వారికి ధైర్యం చెప్పడం జరిగినది. ఈ పరామర్శలు ఆయనతో పాటు పార్టీ పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, స్థానిక నాయకులు గోపి గాయత్రి, పాత గౌరీ శంకర్, ఎడ్ల శ్రీనాథ, నేరేడుబిల్లి సదానందం, బంకపల్లి వాసుదేవరావు, కొల్లి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### మహిళా సాధికారతకు, స్వేచ్ఛ సమానత్వంకై

## ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలి

**- ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి పిలుపు**



**సీతానగరం మార్చి 9 (మేజర్ న్యూస్) :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఐద్వా, సిఐటియు, సంఘాలు నిర్వహిస్తున్న వారోత్సవాలలో భాగంగా సోమవారం సీతానగరం మండలం,డంపింగ్ యార్డు లో మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు వెన్నెల రామలక్ష్మి అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీదేవి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా మహిళలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఈ సమస్యలు పరిష్కారానికి ఐక్య ఉద్యమాలకు మహిళలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇటీవల మహిళల పట్ల తీవ్రమైన దాడులు, అత్యాచారాలు జరుగుతున్నాయని, బాలికలపై అత్యాచారానికి పాల్పడుతున్నారని దీనికి మద్యం ,డ్రగ్స్ విచ్చలవిడిగా సరఫరా కావడమే ప్రధానమైన కారణమని, మద్యం డ్రగ్స్ నియంత్రణకు ప్రభుత్వం ప్రత్యేకమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మహిళలను ఉద్ధరిస్తామన్న పాలకులు రోజురోజుకు మహిళలపై భారాలు మోపుతున్నారని, ఇటీవల వంట గ్యాస్ ధరలు పెంచటం దీనికి ఉదాహరణ అని తెలిపారు, ప్రభుత్వాలు ఆర్బాట ప్రచారాలు మాని మహిళలు అక్షరాస్యత పెంపుదలకు, మహిళలకు ఉపాధి కల్పించేందుకు, పని ప్రదేశాలలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి ప్రత్యేకమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు,పాశ్చాత్య సంస్కృతి వలన బాల, బాలికలు, మహిళల పట్ల తీవ్రమైన దాడులు జరుగుతున్నాయని విమర్శించారు. స్త్రీలకు ఆర్థిక స్వేచ్ఛ కల్పించినప్పుడే స్వతంత్రంగా అభివృద్ధి కాగలరని ఆ దిశగా ప్రయత్నాలు పాలకులు చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో మహిళా హక్కుల సాధనకు, సమస్యల పరిష్కారానికై ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి గవర వెంకటరమణ, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు వెన్నెల రామలక్ష్మి, అంగన్వాడీ యూనియన్ నాయుకులు మరిచర్ల సునీత, వ్యవసాయకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి ఈశ్వరావు, ప్రజా సంఘాల నాయకులు ఇల్లా పార్వతి, ఆదిలక్ష్మి, దాలమ్మ, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించిన జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి

### ప్రజలు పోలీసు విభాగంతో నేరుగా మాట్లాడేందుకు, తమ సమస్యలను నేరుగా చెప్పుకునేందుకు ఈ వేదిక అవకాశం



**పార్వతీపురం, మార్చి 8, మేజర్ న్యూస్ :** పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి,సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ""ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలు మూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, తల్లిదండ్రులు వేధింపులు, భర్త/అత్తారింటి వేధింపులు,భూ-ఆస్థి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్లైన్ మోసం,ప్రేమ పేరుతో మోసం,ఇతర సమస్యలపై ఫిర్యాదుదారులు స్వేచ్ఛగా విన్నవించుకోగా, వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడి ఫిర్యాదు అంశాలను పరిశీలించి, వాటి పూర్వా పరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవాలైనట్లయితే చట్ట పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని,తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంప వలెనని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 04 ఫిర్యాదులు అందాయి. ప్రతీ సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 01.00 గం., వరకు జరిగే "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలు వారి సమస్యలు స్వేచ్ఛగా విన్నవించుకోవచ్చునని, వాటిపై చట్టపరిధిలో విచారణ జరిపి నిర్ణిత గడువులోపు పరిష్కరిస్తామని, జిల్లా కేంద్రానికి రానివారు దగ్గరలో గల సబ్ డివిజన్ ఆఫీస్, పోలీస్ స్టేషన్లో కూడా పిర్యాదు చేయవచ్చు, వాటిని కూడా 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' పిర్యాదుగా పరిగణిస్తామని జిల్లా ఎస్పీ తెలిపినారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటుగా డిసిఆర్బీ సిఐ ఆదాం, ఎస్సై రమేష్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

## వేసవికాలంలో గర్భిణీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలి

**- వైద్యాధికారి డాక్టర్ ఎన్ఎంకె తిరుమలప్రసాద్ - గర్భిణీలు ప్రోటీన్ అధికంగా ఉండే సమతుల్య ఆహారం తీసుకోవాలి**





**గరుగుబిల్లి, మార్చి 9, మేజర్ న్యూస్ :** ప్రస్తుత వేసవి కాలంలో గర్భిణీలు తగు జాగ్రత్తలు తీసు కోవాల్సి ఉందని...అదే విధంగా పోలిక్ యాసిడ్, ఐరన్, కాల్షియం మరియు ప్రోటీన్ అధికంగా ఉండే సమతుల్య ఆహారం తీసుకోవాలని గరుగుబిల్లి ప్రాథ మిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎన్ ఎం కె తిరుమలప్రసాద్ ఆశ వర్కర్లకు సూచించారు.మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమ వారం ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన కార్యక్ర మంలో భాగంగా గర్భిణీలకు తనిఖీలు నిర్వహించడంతోపాటు వైద్య పరీక్షలు నిర్వహించారు.అనంతరం డాక్టర్ ఎన్ఎంకె తిరుమలప్రసాద్ మాట్లాడుతూ గర్భిణీల ఆరోగ్య శ్రేయస్సుకై వైద్య సిబ్బంది అంకిత భావంతో వైద్యసేవలు అందించాలని పేర్కొన్నారు.

అదే విధంగా గర్భిణీ ల్లో రక్తహీనత,హైరిస్క్ సమస్యలు తలెత్తకుండా ఉండేలా వైద్య సిబ్బంది కృషి చేయాలని వైద్యాధికారి డాక్టర్ ఎన్ఎంకె తిరుమలప్రసాద్ సిబ్బందికి దిశ నిర్దేశం చేశారు. మాతా శిశు సంరక్షణ కార్డుల్లో ఆరోగ్య తనిఖీలు, వైద్య పరీక్షల వివరాలు పరిశీలించి నివేదికలు హెచ్చు, తగ్గులు గుర్తించి గర్భిణీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.గర్భిణీల్లో జ్వర లక్షణాలు గుర్తిస్తే హైరిస్క్గా పరిగణించి సత్వరమే సమాచారం ఇవ్వాలన్నారు. డీహైడ్రేషన్కు గురికాకుండా ఎక్కువగా నీరు, ద్రవరూప ఆహారాన్ని తీసుకో వాలని గర్భిణీలకు సూచించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాధా రణ ప్రసవాలు జరిగేలా వైద్య సిబ్బంది చర్యలు చేపట్టాలని డాక్టర్ ఎన్ఎంకె తిరుమలప్రసాద్ పేర్కొన్నారు.గర్భిణీలు రక్తహీనత, హైరిస్క్ సమస్యలకు గురికాకుండా వైద్య సిబ్బంది కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో సిహెచ్ఓ ఎన్ జగదీశ్వరి, హెల్త్ విజిటర్ చింతాడ ఉదయకుమారి, ల్యాబ్ టెక్నీషియన్ పొన్నగంటి శ్రీనువాసరావు తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీషిరిడిసాయిబాబా ఆలయంలో గర్భిణీలకు అన్నప్రసాద వితరణ



**గరుగుబిల్లి, మార్చి 9 (మేజర్ న్యూస్) :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు ప్రతినెల తనిఖీలు నిమిత్తం ఆయా గ్రామాల నుంచి వచ్చే గర్భిణీలకు బురదవెంకటాపురం (బివిపురం) గ్రామానికి చెందిన బొత్స శ్రీహరిరావు, ఇంద్రాణి దంపతులు సహకారంతో సోమవారం అన్న ప్రసాదమును ఏర్పాటు చేశారు. పిఎంఎస్ఎంఎ పథకం కింద ప్రతినెల మండల కేంద్రంలోని ప్రాథ మిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన గర్భిణీ స్త్రీలకు తనిఖీలు నిర్వహిస్తున్నారు.అయితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని దాదాపు అన్ని గ్రామాల నుంచి తనిఖీలు నిమిత్తం ఆశ వర్కర్లు, గర్భిణీలను తీసుకు వస్తుంటా రు.తనిఖీలు నిమిత్తం వచ్చిన గర్భిణీలు తిరిగి ఇంటికి వెళ్ళేందుకు సుమారు మధ్యాహ్నం మూడు గంటలు అవుతోంది.ఈ విషయం తెలుసుకున్న మండల పరిధిలోని బురదవెంకటాపురం గ్రామానికి చెందిన బొత్స శివున్నాయుడు, గౌరమ్మ మరియు బొత్స శ్రీహరి రావు,ఇంద్రాణి దంపతులు ఆయా గ్రామాలనుంచి తనిఖీలు నిమిత్తం వచ్చే గర్భిణీలకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమంను నిర్వహిం చేందుకు ముందుకు వచ్చారు. ఈమేరకు మండల కేంద్రం లోని శ్రీషిరిడి సాయి దేవసంస్థానశీ ఆధ్వ ర్యంలో అన్నప్రసాద వితరణ కార్య క్రమం నిర్వహించారు.ప్రతి నెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు తనిఖీలు నిమిత్తం పలు గ్రామాల నుంచి వస్తున్న గర్భిణీలకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించేందుకు దాత బొత్స శ్రీహరిరావు,ఇంద్రాణి దంప తులు ముందుకు రావడం అభినంద నీయమని వైద్య సిబ్బంది పేర్కొ న్నారు.అదే విధంగా దాత బొత్స శ్రీహరిరావు,ఇంద్రాణి దంపతుల సహకారంతో శ్రీషిరిడి సాయిదేవ సంస్థానశీ ఆధ్వర్యంలో ఈకార్య క్రమం నిర్వహించడం పట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎన్ ఎం కె తిరుమలప్రసాద్ అభినందించారు.

## ఐటిడిఏ గ్రీవెన్స్‌కు 25 వినతులు

**సీతంపేట మార్చి 9 (మేజర్ న్యూస్) :** సీతంపేట ఐటిడిఏ ఏపీవో జి.చిన్నబాబు ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా 25మంది మంది గిరిజనులు తమ వినతులు అందించారు. సీతంపేట మండలం పులిగుమ్మి గ్రామానికి చెందిన సవర సావిత్రి మినీ ట్రాక్టర్ మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు. నందిగాం మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన సవర లక్ష్మమ్మ పవర్ టిల్లర్ మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు. సారవకోట మండలం కన్నయ్యగూడ గ్రామానికి చెందిన సవర దుర్గారావు తమ గ్రామానికి రహదారి మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు. పాతపట్నం మండలం కోనంగి గ్రామానికి చెందిన రింపి వీరయ్య మినీ ట్రాక్టర్ మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు. సీతంపేట మండలం సోమగండి గ్రామానికి చెందిన నిమ్మక రామారావు పసుపు విత్తనాలు మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు. మెలియాపుట్టి మండలం సంతోషపురం గ్రామానికి చెందిన సవర కాంచన బిఎస్సి నర్సింగ్ చదువుటకు ఆర్థిక సహాయం చేయాలని వినతిపత్రం సమర్పించారు. భరణికోట కాలనీలో త్రాగునీరు మంజూరు చేయాలని సవర రంగారావు వినతిపత్రం సమర్పించారు. వీరఘట్టం మండలం సవర గోపాలపురం గ్రామానికి చెందిన బిడ్డిక రాంబాబు సీసీ రోడ్డు మరియు కాలువ మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు.

# పంచాయతీల్లో ఇంటి పన్ను బకాయిలు వసూలు చేయాలి

## – మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి.పైడితల్లి – రావు పల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ బొంతాడ మహేష్



**గరుగుబిల్లి, మార్చి 9 (మేజర్ న్యూస్) :** గ్రామ పంచాయతీల పరిధిలో ఇంటి పన్ను బకాయిలు వసూళ్లకు సంబం ధించి గ్రామ పంచాయతీ కార్యదర్శులు నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాల్సి ఉందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి పైడితల్లి అన్నారు.మండల పరిధిలోని రావుపల్లి,కొత్తపల్లి గ్రామ పంచా యతీల్లో సోమవారం ఇంటి పన్ను బకాయి వసూళ్లను ఎంపీడీవో జి పైడితల్లి పరిశీలించారు. ఈ సందర్భంగా రావుపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు (మహేష్) ఎంపీడీవో జి పైడితల్లి ఇంటి పన్ను బకాయి వసూళ్లకు సంబంధించి గ్రామంలో పర్యటించి త్వరితగతిన ఇంటి పన్ను బకాయిలు చెల్లించాలని తెలియజేశారు. అదేవిధంగా ఇంటి పన్ను బకాయిలు వసూళ్లకు సంబంధించి గ్రామ పంచాయతీ కార్యదర్శులకు తగు సూచ నలు,సలహాలను అందజేశారు.అనంతరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి పైడితల్లి మాట్లాడుతూ ఇంటి పన్ను చెల్లిం పులకు సంబంధించి ప్రభుత్వం స్వర్ణ పంచాయతీ పోర్టల్ ను ప్రారంభించడం జరిగిందని తెలిపారు.గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్ను బకా యిల వసూళ్లను పారదర్శకంగా అదే విధంగా సులభంగా చేయడానికి ప్రభుత్వం స్వర్ణ పంచాయతీ వెబ్ సైట్ ను అందుబాటులోకి తీసుకు వచ్చిన నేపథ్యంలో మొబైల్ ద్వారా ఆన్ లైన్ లో పన్ను చెల్లించవచ్చని ఎంపిడిఓ పైడితల్లి వెల్లడించారు. స్వర్ణ పంచాయితీ పోర్టల్ ద్వారా ఇంటి పన్నును డిజిటల్ పద్ధతిలో చెల్లించే వెసులుబాటును ప్రభుత్వం తీసుకు రావడం జరిగిందన్నారు. గ్రామ పంచాయతీల పరిధిలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఇంటి పన్ను బకా యిలు వసూళ్లకు సంబం ధించి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్య మును అధిగమించాల్సి ఉందని తెలిపారు.ఇంటి పన్ను బకాయి వసూళ్ల లక్ష్యమును అధిగమించని సంబంధిత గ్రామ పంచాయతీ కార్య దర్శులపై తగు చర్యలు తప్పవని ఎంపీడీవో పైడితల్లి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రావుపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు (మహేష్), పంచాయతీ కార్యదర్శి రాంజీ తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీల్లో ఇంటి పన్ను బకాయిలు వసూలుపై ప్రత్యేక దృష్టి సారించాలి

## – డిప్యూటీ ఎంపీడీవోలు కేకే వర్మ, శివకుమార్



**సీతానగరం, మార్చి 9 (మేజర్ న్యూస్) :** గ్రామ పంచాయతీల పరిధిలో ఇంటి పన్ను బకాయిలు వసూళ్లకు సంబం ధించి గ్రామ పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని డిప్యూటీ ఎంపీడీవో కేకే వర్మ సూచించారు. ఈ మేరకు మండల పరిధిలోని నిడగల్లు, లక్ష్మీపురం, పెదభోగిలి, రంగంపేట, లచ్చయ్యపేట సచివాలయాలు సందర్శించి ఇంటి పన్ను బకాయి వసూళ్లకు సంబంధించి గ్రామంలో పర్యటించి త్వరితగతిన ఇంటి పన్ను బకాయిలు చెల్లించాలని అదే విధంగా ఇంటి పన్ను బకాయిలు వసూళ్లకు సంబంధించి గ్రామ పంచాయతీ కార్యదర్శులకు తగు సూచనలు, సలహాలను అందజేశారు. గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్ను బకాయిల వసూళ్లను పారదర్శకంగా అదేవిధంగా సులభంగా చేయడానికి ప్రభుత్వం స్వర్ణ పంచాయతీ వెబ్ సైట్ ను అందుబాటులోకి తీసుకు వచ్చిన నేపథ్యంలో మొబైల్ ద్వారా ఆన్ లైన్ లో పన్ను చెల్లించవచ్చుని . పన్నును డిజిటల్ పద్ధతిలో చెల్లించే వెసులుబాటును ప్రభుత్వం తీసుకురావడం జరిగిందన్నారు. గ్రామ పంచాయతీల పరిధిలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఇంటి పన్ను బకాయిలు వసూళ్లకు సంబం ధించి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్య మును అధిగమించాల్సి ఉందని .ఇంటి పన్ను బకాయి వసూళ్ల లక్ష్యమును అధిగమించని సంబంధిత గ్రామ పంచాయతీ కార్య దర్శులపై తగు చర్యలు తప్పవని ఈ కార్యక్రమంలో ఆయా సచివాలయ సిబ్బంది తో పాటు తదితరులు పాల్గొన్నారు.




# పెరటి కోళ్ల పెంపకంతో గిరిజన మహిళలకు ఉపాధి అవకాశాలు



**పాచిపెంట, మార్చి 9, మేజర్ న్యూస్ :** పెరటి కోళ్ల పెంపకంతో గిరిజన మహిళలకు మంచి ఉపాధి అవకాశాలు కలుగుతాయని ఎంపీడీవో బివిజ పాత్రో అన్నారు. మండలంలోని మంత్రాల వలస గిరిజన గ్రామంలో సోమవారం హీఫర్ ఇంటర్నేషనల్, ట్రైకార్, ఐటిడిఏ, మరియు పశు సంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో భాగస్వామి సహకారంతో సమగ్ర పెరటి కోళ్ల యూనిట్ నిర్మాణంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ స్వయం ఉపాధి అవకాశాలను కల్పించే లక్ష్యంతో ఈ పెరటి కోళ్ల యూనిట్లను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ శిక్షణలో భాగంగా పెరటి కోళ్ల గుళ్ళు నిర్మాణ పద్ధతులు, కోడి పిల్లల మధ్య సరైన దూరం, స్థానిక పదార్థాలతో కోళ్ల మ్యాత తయారీ సూత్రాలు, వాసవి వేడి మరియు చల్లని గాలుల నుంచి రక్షణ చర్యలు, ఒత్తిడి తగ్గించే విధానం, అలాగే గుడ్లు పెట్టడం, సేకరణ మరియు కోళ్లు కు టీకాలు వాటి ఉపయోగాలు అంటే అంశాలపై నిపుణుల ప్రయోగిక మార్గ దర్శకాలు అందించడం జరిగింది. పశు సంహార్దిక శాఖ అధికారులు శిక్షణలో పాల్గొని లబ్ధిదారులకు పెరటి కోళ్ల పెంపకం పై అవగాహన కల్పించారు. గ్రామీణ గిరిజన రైతులు మహిళలు పేరటి కోళ్ల పెంపకంలో శాస్త్రీయ పద్ధతులు అవగాహన చేసుకుని స్థిరమైన ఆదాయ వనరులను సృష్టించుకునే దిశగా ముందు అడుగు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశు సామాజిక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ గంగాధర్, డాక్టర్ గణేష్, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రవళిక మరియు గిరిజన రైతులు మహిళలు పాల్గొన్నారు.



### ఎల్.కోటలో త్వరలో శ్రీ భద్ర మహంకాళీ అమ్మ వారి

# 42వ వార్షికోత్సవ వేడుకలు

**లక్క వరపు, మార్చి 9 (మేజర్ న్యూస్) :** మండలం లోని ఎల్ కోట మేజర్ పంచాయతీలోని బిసి కాలనీ సమీపంలో గల గ్రామ దేవత శ్రీ భద్ర మహంకాళీ అమ్మ వారి 42వ వార్సికోత్సవము సందర్భంగా మార్చి 11 12 వ తేది లలో తీర్థం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శ్రీ గౌరి సేవా సంగం అధ్యక్ష కార్యదర్సులు తెలిపారు ఈ తీర్థం సందర్భంగా మండల స్థాయి క్రికెట్ పోటీలు ఏర్పాటు చేస్తున్నామని ఈ పోటీలు 11 12 వ తేదిలలో జరుగుతాయి అని ఈ పోటీలలో పాల్గొన దలచిన వారు 10 వ తేది లోపు గౌరి యూత్ సభ్యులకు 250 రూపాయలు నామినేషన్ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి అని అన్నారు ఈ తీర్థం సందర్భంగా పలు సంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

# ఎల్.కోట పిహెచ్‌సిలో హెచ్‌పివి టీకా పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కోళ్ల



**లక్కవరపు కోట, మార్చి 9 (మేజర్ న్యూస్) :** ఎల్.కోట మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లోఎచ్ పి వి టీకా పంపిణి కార్యక్రమం సోమవారం ప్రారంభించారు ఈ కార్యక్రమం లో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి పాల్గొన్నారు. ఈ సందర్బంగా విద్యార్థినిలకి ఎమ్మెల్యే చేతులు మీదగా టీకాలు ఇచ్చే కార్యక్రమం ప్రారంభించారు ఈ సందర్బంగా పిహెచ్‌సి డాక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ ఈ టీకా 14 ఇయర్స్ నిండిన ఆడబిడ్డలకు మరియు 15 ఇయర్స్ దాటని ఆడబిడ్డలకు ఈ మాత్రమే ప్రస్తుతానికి ఇవ్వబడును.అని 01/03/2011 నుండి 28/02/2012 మధ్యన పుట్టిన ఆడబిడ్డలకు మాత్రమే ఇవ్వడం జరుగుతుంది అన్నారు. ఈ టీకా సురక్షితమైనదని ఈ టీకా వేసుకోవడం వలన భవిష్యత్తు లో మహిళలకు హ్యూమన్ పాపిల్లో మా వైరస్ వలన సంబవించే వ్యాధులు నుంచి ఇతర రోగాలు బారిన పడ కుండా టీకా కాపాడుతుంది అన్నారు .ఈ కార్యక్రమం ఎల్.కోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు 3నెలలు జరుగుతుందన్నారు. ఈ టీకా గర్బాసయ క్యాన్సర్ రాకుండా కాపాడుతుంది.అని తెలిపారు ఈ కార్యక్రమంలో, మాజీ జడ్పీటీసీ కే.ఈశ్వరరావు, దాసరి కార్పొరేషన్ చైర్మన్ రత్నాజీ, జనసేన నాయకులు ఫిరోజ్, ఎంఈఓ శ్రీనివాస్ ఆర్ఐ సన్యాసి రావు, వైద్యాధికారులు అనిల్ కుమార్, డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ అజయ్ కుమార్, లబ్ధిదారులు, గ్రామస్తులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# సూర్య రెసిడెన్సీ రిసెప్షన్‌లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శంభంగి



**బొబ్బిలి, మార్చి 09 (మేజర్ న్యూస్) :** బొబ్బిలి సూర్య రెసిడెన్సి లో ఎంపిడిఓ పోతుల రవికుమార్ కుమారుడు సుధీర్ రిసెప్షన్ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శంభంగి వెంకట చిన అప్పలనాయుడు పాల్గొన్నారు.ఈ మేరకు శంభంగి సోమవారం వధూవరుల ను ఆశీర్వాదించారు.ఈ కార్య క్రమంలో ఆయనతో పాటు సోదరులు విజయనగరం జిల్లా వైఎస్ఆర్సిపి జనరల్ సెక్రెటరీ వేణుగోపాల్ నాయుడు, బొబ్బిలి మండల ఎంపీపీ శ్రీమతి శంబంగి లక్ష్మీ, మరియు విజయనగరం జిల్లా ప్రచార కార్యదర్శి బొద్దల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ అరసాడ శంకరరావు, కమ్మ వలస సర్పంచు పిల్లా వసుంధర, పెంట గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు బొమ్మి అప్పల నాయుడు మాస్టారు, గొర్ల సీతారాంపురం ఎంపీటీసీ తిరుపతి, కలవరాయి సర్పంచ్ నటరాజ్, నారాయణప్ప వలస సర్పంచ్ సూర్యరావు మరియు అడ్వకేట్ రూంకానప్రసాద్ వైఎస్ఆర్సిపి ముఖ్య నాయకులు మండల ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# 119 మందికి కంటి పరీక్షలు

**అరకులోయ, మార్చి 9, మేజర్‌న్యూస్:** కాశీపట్నం, లొంగుపర్తి, అనంతగిరి వెల్నెస్ సెంటర్లలో సోమవారం ఏర్పాటు చేసిన నేత్ర వైద్య శిబిరాల్లో 119 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు.జిల్లా అంధత్వ నివారణ సంస్థ, విజయనగరం పుష్పగిరి కంటి ఆసుపత్రి సంయుక్తంగా నిర్వహించిన నేత్ర వైద్య శిబిరాలకు విశేష స్పందన లభించింది.119 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి వారిలో 24 మంది కంటి రోగులకు ఉచిత కంటి అద్దాల కోసం సిఫార్సు చేశారు.ఈ శిబిరాల్లో 55 మంది అంతరకుసుమలతో(కేటరాక్టు) బాధపడుతున్నట్లు గుర్తించి శస్త్ర చికిత్సల కోసం విజయనగరం పుష్పగిరి కంటి ఆసుపత్రికి తరలించారు. ఈ కంటి రోగులకు ప్రభుత్వం ఉచిత రవాణా,భోజన సదుపాయాలు కల్పిస్తున్నట్టు జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారి, నేత్ర వైద్య శిబిరం ప్రోగ్రామ్ మేనేజరు డాక్టర్ టి.విశ్వేశ్వర నాయుడు తెలిపారు. ఈ నెల 8వ తేదీ నుంచి 14 వ తేదీ వరకు గ్లకోమా వారోత్సవాలు నిర్వహిస్తున్న సందర్భంగా 40 సంవత్సరాల వయస్సు దాటిన ప్రతి ఒక్కరూ పాడేరు జిల్లా ప్రభుత్వ సర్వజన



ఆసుపత్రి, పాడేరు,అరకులోయ, చింతపల్లి,రంపచోడవరం, చింతూరు ఏరియా ఆసుపత్రులలో కంటి వైద్యుల నిపుణులు ఆధ్వర్యంలో నిర్వహించే ప్రత్యేక కంటి శిబిరాల్లో పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు.ఈ మేరకు కంటి రోగాలతో బాధపడుతున్న ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని డాక్టర్ టి.విశ్వేశ్వర నాయుడు కోరారు.

# ఈ నెల 10న విశాఖపట్నంలో నీటి భద్రత సదస్సు

**– పట్టణాభివృద్ధి శాఖ మార్గదర్శకత్వంలో జీవీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహణ. – జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్**



**విశాఖపట్నం, మార్చి 9, మేజర్‌న్యూస్:** విశాఖపట్నం ఎకనామిక్ రీజన్ కోసం రూపొందించనున్న నీటి భద్రత ప్రణాళికపై అంతర్జాతీయ స్థాయి సదస్సు మార్చి 10న విశాఖపట్నంలోని నోవాటెల్ హోటల్‌లో నిర్వహించనున్నట్లు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ సోమవారం తెలిపారు. ఈ సదస్సు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డా " పి. నారాయణ మార్గదర్శకత్వంలో జీవీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతోందన్నారు. ఈ కార్యక్రమాన్ని ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ , సింగపూర్ వాటర్ సెంటర్ , పబ్లిక్ యుటిలిటీస్ బోర్డు, సింగపూర్, ఇన్‌స్టిట్యూట్ ఫర్ సస్టైనబుల్ ఫ్యూచర్స్ ఆస్ట్రేలియా వంటి అంతర్జాతీయ సంస్థల సహకారంతో నిర్వహిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. విశాఖపట్నం ఎకనామిక్ రీజన్ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని భవిష్యత్తులో పెరుగుతున్న నీటి అవసరాలను అంచనా వేసి, నీటి వనరుల సమర్థవంతమైన వినియోగం, స్థిరమైన సరఫరా వ్యూహాలు, సమగ్ర నిర్వహణ పద్ధతులపై చర్చించేందుకు ఈ సదస్సు వేదికగా నిలుస్తుందని తెలిపారు. విశాఖపట్నం ఎకనామిక్ రీజన్‌ను భవిష్యత్తులో ఒక ప్రధాన గ్లోబల్ ఆర్థిక కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో నివాస, వాణిజ్య, పారిశ్రామిక రంగాల్లో పెరుగుతున్న నీటి అవసరాలను తీర్చడానికి సమగ్ర నీటి భద్రత ప్రణాళికను రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు, పట్టణ స్థానిక సంస్థల ప్రతినిధులు, పరిశ్రమల ప్రతినిధులు మరియు అంతర్జాతీయ నిపుణులు పాల్గొని నీటి డిమాండ్ అంచనాలు, సరఫరా పెంపు చర్యలు, వృత్తాకార నీటి ఆర్థిక విధానాలు, నీటి రంగంలో పెట్టుబడి ప్రణాళిక తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. దేవిధంగా సింగపూర్ సహా పలు దేశాలలో అమలులో ఉన్న ప్రపంచ స్థాయి నీటి నిర్వహణ పద్ధతులను పంచుకోవడంతో పాటు, పారిశ్రామిక నీటి వినియోగదారులు మరియు ప్రభుత్వ విభాగాల మధ్య చర్చల కోసం ఇండస్ట్రీ రౌండ్ టేబుల్ కూడా నిర్వహించనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ సమావేశంలో నీటిపారుదల, పరిశ్రమలు, గ్రామీణ నీటి సరఫరా, పట్టణాభివృద్ధి, పర్యావరణం, భూగర్భజలాలు తదితర విభాగాల అధికారులు పాల్గొననున్నారని కమిషనర్ తెలిపారు.

## Motorolaedge 70 ఫ్యూజన్ ఆవిష్కారం; ఎర్లీ బర్డ్ అమ్మకం ఈరోజు మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభం




**విశాఖపట్నం, మార్చి 9, మేజర్‌న్యూస్:** మొబైల్ టెక్నాలజీ, ఆవిష్కరణలలోప్రపంచ అగ్రగామి,భారత దేశంలో ప్రముఖది AI స్మార్ట్‌ఫోన్ బ్రాండ్‌అయిన మోటరోలా, ఈరోజు motorola edge 70 ౞బంఅశీఅ ను ఆవిష్కరించింది. ఇది మిడ్-ప్రీమి యం స్మార్ట్‌ఫోన్విభాగానికి అద్భుతమైన కెమెరా ఆవిష్కరణ, లీనమయ్యే విజువల్స్, తదుపరి తరం ఆన్-డివైస్ ౘా×ని తీసుకువచ్చింది.ఈ పరికరం ప్రపంచంలోనే మొట్టమొదటి 50వీూ సోనీ-ౘ 710 కెమెరాను motoAIతో కలిగి ఉంది, ఇది అత్యుత్తమ తక్కువ-కాంతిస్పష్టత, బ్లర్-ఫ్రీ షాట్‌లు, 100% ట్రూ కలర్స్, పాంటోన్ౕ ద్వారా ధృవీకరించబడిన స్కిన్ టోన్స్,అన్ని లెన్స్‌లలో 4ఖ వీడియో రికార్డింగ్‌ను అందిస్తుంది. ఇది భారతదేశ ఏకైక 144ఎ౞ 1.5ఖ ట్రూ కలర్‌గీ క్వాడ్-కర్వ్ పాంటోన్ౕ వాలిడేటెడ్ డిస్‌ప్లేతో జత చేయబడినపాంటోన్ౕ

## ఘనంగా శ్రీ బంగారమ్మతల్లి 3వ వార్షికోత్సవం



**ఆనందపురం, మార్చి 9, మేజర్‌న్యూస్:** మండలంలోని చందక పంచాయతీ జగన్నాథపురం గ్రామంలో శ్రీ బంగారమ్మ తల్లి తల్లి 3వ వార్షికోత్సవం సందర్భంగా భక్తిశ్రద్ధలతో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, హారతులు నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దర్శించుకున్నారు. గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అదేవిధంగా గ్రామంలో ఉన్న కోలాట బృందం వారిచే గుడి వద్ద కోలాటం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 2వేల మంది భక్తులకు అన్నసంతర్పణ చేశారు. అన్నదానం కార్యక్రమాన్ని శ్రీరామ యూత్ కమిటీ సభ్యులు సమన్వయంతో నిర్వహించగా, గ్రామ ప్రజలు సైతం స్వచ్ఛందంగా సహకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ వార్షికోత్సవం గ్రామ ఐక్యతను ప్రతిబింబించేలా ఘనంగా జరిగింది.

## పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని ఆందోళన



**డంబ్రిగుడ, మార్చి 9, మేజర్‌న్యూస్:** కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ కితలంగి పంచాయతీ బిల్లాపుటులో సి పి ఎం ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సి పి ఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్ బి పోతురాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిత్యవసర ధరలు విపరీతంగా పెంచుతుందనీ, సామాన్య ప్రజలు నిత్యవసర వస్తువులు కొనుక్కోలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచినటువంటి గ్యాస్, నిత్యవసర ధరలను వెంటనే తగ్గించాలని పెట్టుబడిదారులకు లక్షల కోట్ల రాయితీలు ఇస్తున్న ప్రభుత్వం పేదలపై భారం మోపడం సరికాదని, ప్రభుత్వం పెంచిన ధరలను వెంటనే తగ్గించాలన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ సభ్యులు టీ సూర్యనారాయణ,జి మహేశ్వరరావు, జి నర్సింగ్ రావు, మోహన్ రాజు జీ నీలన్న తదితరులు పాల్గొన్నారు.

## సంగీత ప్రజలను ఆకట్టుకున్న రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్

**– బాద్షా, నిఖిత గాంధీ, శ్రీరామ చంద్ర, డీ జే సాహిల్ గులాటి మరియు పాయల్ ధారేల ప్రదర్శన**



**విశాఖపట్నం, మార్చి 9, మేజర్‌న్యూస్:** ' లివింగ్ ఇట్ లార్జ్ ' యొక్క సిద్ధాంతాన్ని సంబరం చేస్తూ, సీగ్రామ్ రాయల్ స్టాగ్ ఎంతో ఊహించిన రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్ నాలుగవ ఎడిషన్ ను వైజాగ్ లోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంకు తెచ్చింది. ఇంతకు ముందు ఎడిషన్స్ యొక్క ఘన విజయంతో, ఈ ఏడాది రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్ ఉత్తమమైన సంగీతం మరియు గేమింగ్ ఎంటర్టైన్మెంట్ రెండిటి మిశ్రమాన్ని ఒకే లీనమయ్యే అనుభవంలోకి స్థాయిని పెంచింది. ఈ ఆకట్టుకున్న సాయంత్రం కార్యక్రమానికి భారతదేశంలో అత్యంత సెలబ్రిటీ కళాకారులు చేసిన ప్రదర్శనలకు వేలాది మంది అభిమానులు హాజరయ్యారు. అత్యంత ఉత్సాహవంతమైన సెట్స్ నుండి మర్చిపోలేని స్టేజీపై క్షణాల వరకు, ఈ కార్యక్రమం ఈ తరం జనరేషన్ లార్జ్ యొక్క వినసొంపైన సంగీతం, దృశ్యాలు మరియు స్పష్టమైన స్ఫూర్తి యొక్క శక్తివంతమైన ప్రదర్శనను అందించింది. ఆకట్టుకునే ఇన్ స్టలేషన్స్, లీనమయ్యే ఆర్ట్ డిస్ ప్లేలు, ఎంపిక చేసిన ఆహార అనుభవాలు మరియు ఇంటరాక్టివ్ జోన్స్ లతో కేవలం సంగీతానికి మాత్రమే పరిమితం కాలేదు. గేమింగ్ సంచలనం పాయల్ ధరే ఒ కార్యక్రమంలో గేమింగ్ దశలతో పోరాడిన అభిమాని మధ్య ఆకర్షణీయమైన ముఖాముఖీతో ఈ సాయంత్రం ప్రారంభమైంది. అభిమాని గెలుపొంది, ఆమెతో పాటు ఆడే అవకాశం సంపాదించుకున్నారు. తదుపరి డీ జే సాహిల్ గులాటి ప్రారంభించిన ఉత్సాహవంతమైన బీట్స్ అందర్నీ అలరించింది.

## నేటితో ముగుస్తున్న మాస్టర్ ప్లాన్ పునః పరిశీలన గడువు

**విశాఖపట్నం, మార్చి 9, మేజర్‌న్యూస్:** వీఎంఆర్డీఏ రూపొందించిన బృహత్ ప్రణాళిక --2041 పునః పరిశీలనకు సంబంధించి ప్రజల నుంచి అభిప్రాయాలు,సలహాలు సూచనల స్వీకరణకు ఇప్పటికే ఇచ్చిన నోటిఫికేషన్ గడువు ఈరోజుతో ముగుస్తుండటంతో, ప్రజలు తమయొక్క అభిప్రాయాలు, సలహాలు,సూచనలను వీఎంఆర్డీఏ ఆఫీస్ 8వ ఫ్లోర్ నందు స్వయంగా గాని లేదా ద్వారా గాని సాయంత్రం 5.00 గం.ల లోపు సమర్పించవచ్చునని, ఈ చివరి అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని, చైర్మన్ ఎంవి ప్రణవ్ గోపాల్ మరియు మెట్రోపాలిటన్ కమిషనర్ తేజ్ భరత్, లు ఒక ప్రకటనలో తెలియజేశారు.

# ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని నిరసన



**శృంగవరపుకోట, మార్చి 9, మేజర్‌న్యూస్:** ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎంప్లాయిస్ యూనియన్ డిపో అధ్యక్షుడు కె.జీ నాయుడు ఆధ్వర్యంలో సోమవారం డిపో గేటు వద్ద నిరసన తెలియజేశామని డిపో కార్యదర్శి కె. కోటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఎస్. కోట - వైజాగ్ రూట్ సర్వే చేసి టైమింగ్ పెంచాలని, మహిళ కండక్టర్లను వేధింపులకు గురిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, ధర్మవరం - విజయనగరం రూటు సర్వే చేసి టైమింగ్స్ పెంచి ట్రిప్పులు తగ్గించాలని, బస్సు కండిషన్ పెంచాలని మహిళా కండక్టర్లకు నెలసరి లీవులు ఇవ్వాలని డిపో మేనేజర్ కి మెమొరాండం ఇవ్వడం జరిగిందని తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కేకే రావు, డిపో గ్యారేజీ కార్యదర్శి ఎస్ ఏ నాయుడు మరియు ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన కోటమ్మ తల్లి పండగ

**- తోలేళ్ళు పండగ సందర్భంగా గద్దె గుడిలో అమ్మవారికి పూజలు - నేడు పాలధార.. రేపు సిరి మాను సంబరం**



**శృంగవరపుకోట, మార్చి 9, మేజర్‌న్యూస్:** మండలంలోని ఉత్తరాంధ్ర ఇలవేల్పు కొట్టం కోటమ్మ తల్లి సంబరం ప్రారంభం అయింది. ఇందులో భాగంగా సోమవారం తొలెళ్ళు పండగను ఈవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు యువత ప్రారంభించారు. ఈ సందర్భంగా గద్దె గుడిలో ఉన్న అమ్మవారికి భక్తులు పసుపు కుంకాలు సమర్పించారు. తోలేల ఉత్సవంలో భాగంగా గ్రామ పెద్దలు ఆలయ సిబ్బంది భక్తులు వెంట రాగా చెక్కతో తయారుచేసిన ఎలి ఏనుగు బొమ్మను అమ్మవారి పూజారులను గ్రామంలో ఊరేగించారు. మూడు రోజులపాటు జరగనున్న ఈ సంబరంలో భాగంగా నేడు పాలధారవత్సవం రేపు సిరీ మాను ఉత్సవం జరగనుంది. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు గద్దె గుడిలో కొలువుదీరిన కోటమ్మ వారిని దర్శించుకొని పసుపు కుంకములు సమర్పించి ముక్కులు చెల్లించుకుంటున్నారు ఇప్పటికే దేవాదాయ శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.. బుధవారం జరిగే సిరి మాను సంబరం కు లక్షకు పైగా భక్తులు హాజరవుతారని అంచనా. పండగ సందర్భంగా ఏర్పాట్లు అన్ని శాఖల సమన్వయంతో పూర్తి చేశామని ఈవో తెలిపారు.

## 11 వ వార్డు లో జీవీఎంసీ అధికారులు పరిశీలన



**ఆరిలోవ, మార్చి 9, మేజర్‌న్యూస్:** విశాఖ తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు ఆదేశాల మేరకు జీవీఎంసీ ఏ డి సి పి.నలనయ్య 11వ వార్డు డ్రైవర్స్ కాలనీ ప్రియదర్శని కాలనీ బాలాజీ నగర్ వరకు పెద్ద కాలువలను పరిశీలించి తక్షణమే ర్యాంపులు వెయ్యాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ పరిశీలనలో ఏపీ ఎం ఎస్ ఎం ఈ డైరెక్టర్ ముగడ రాజారావు , ఏ ఎమ్ హెచ్ ఓ ప్రసాద్ , శానిటరీ ఇన్స్పెక్టర్ ఎన్. బంగారాజు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీసు పీజీఆర్ఎస్ కు 120 ఫిర్యాదులు

**- ప్రతి ఫిర్యాదు క్షుణ్ణంగా పరిశీలించిన సీపీ - బాధితుల సమస్యల లపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు - ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు : సీపీ శంఖబ్రతబాగ్చి**





**విశాఖ క్రైం, మార్చి 09, మేజర్‌న్యూస్:** నగరంలో ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా విని, వేగవంతంగా పరిష్కరించడమే లక్ష్యంగా నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక నగర వాసుల్లో విశేష స్పందన వస్తుంది.సోమవారం పీజీఆర్ఎస్ వేదికలో నగర పోలీస్ కమిషనర్ డా.శంఖబ్రత బాగ్చి మొత్తం 120 ఫిర్యాదులను సోమవారం స్వీకరించారు. పోలీస్ కమిషనరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను వినిపించారు. భూ వివాదాలు,కుటుంబ తగాదాలు,మోసాలు, ఆన్‌లైన్ మోసాలు, బెదిరింపులు,ట్రాఫిక్ సమస్యలు,పాత కేసుల పురోగతిపై ఫిర్యాదులు వంటి అనేక అంశాలపై ప్రజలు తమ సమస్య ను వ్యక్తం చేశారు.ప్రతి ఫిర్యాదును సీపీ డా. శంఖబ్రతబాగ్చి వ్యక్తిగతంగా పరిశీలించి, ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడారు.సమస్యల స్వభావాన్ని తెలుసుకుని, సంబంధిత అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేస్తూ,చట్టపరంగా వేగంగా పరిష్కారం చూపాలని సూచించారు.నిర్లక్ష్యం వహించినట్లయితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రజల సమస్యలే పోలీస్ శాఖకు ప్రథమ ప్రాధాన్యం. పోలీస్ స్టేషన్ చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, నేరుగా కమిషనర్ కార్యాలయంలోనే సమస్యలకు పరిష్కారం చూపడమే ఈ వేదిక లక్ష్యం అని తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అనేక పాత కేసులు మళ్లీ పరిశీలనకు వచ్చాయని,నిజమైన బాధితులకు న్యాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రజలు--పోలీసుల మధ్య నమ్మకాన్ని మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. కార్యక్రమంలో డీసీపీ,ఏడీసీపీ లు,ఏసీపీలు, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొని, ఫిర్యాదుల పరిష్కారంపై వెంటనే చర్యలు చేపట్టడానికి సంబత స్టేషన్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

## జైన్ మేనేజిమెంట్ పై సర్టిఫికెట్ కోర్స్



**విశాఖఎడ్యుకేషన్, మార్చ్ 9, మేజర్‌న్యూస్:** ఇంటిగ్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్ మేనేజ్‌మెంట్ ఐ ఐ ఏ ఎం లో డా. ఆదర్శ ముని జైన్ స్టడీస్ సెంటర్ మరియు జైన్ ప్రిన్సిపుల్స్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్‌పై ఆన్‌లైన్ సర్టిఫికేట్ కోర్సును సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రముఖ దాత విశాల్ షా మాట్లాడుతూ జైన తత్వం భారతదేశంలో నైతిక వ్యాపార సంప్రదాయాల నిర్మాణంలో కీలక పాత్ర పోషించిందన్నారు. ఐ ఐ ఏ ఎం డీన్ సెక్రటరీ డా. ఎస్.పీ. రవీంద్ర మాట్లాడుతూ ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ఆధునిక విద్యతో అనుసంధానం చేయాలనే సంస్థ సంకల్పానికి ఇది ప్రతీక అన్నారు. డా. ముని ఆదర్శ ఆచార్య జీ మాట్లాడుతూ జైన తత్వం స్వీయ నియంత్రణ, కరుణ మరియు సమస్త జీవుల పట్ల గౌరవాన్ని బోధిస్తుందని పేర్కొన్నారు. ఐ ఐ ఏ ఎం డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ వి. కృష్ణమోహన్ మాట్లాడుతూ జైన వ్యాపార సమాజం ఆర్థిక విజయాన్ని సామాజిక బాధ్యతతో ఎలా సమన్వయం చేయవచ్చో చరిత్రలో చూపిందన్నారు. ఐ ఐ ఏ ఎం ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్ ప్రొఫెసర్ చల్లా కృష్ణవీర్ అభిషేక్ మాట్లాడుతూ ప్రస్తుత క్లిష్టమైన వ్యాపార ప్రపంచంలో జైన నైతిక విలువలు ఎంతో ప్రాసంగికమని చెప్పారు. ఈ ఆన్‌లైన్ కోర్సు ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్నవారు జైన మేనేజ్‌మెంట్ సూత్రాలను డిజిటల్ వేదికల ద్వారా నేర్చుకునే అవకాశముందని అన్నారు. నియంత్ ఎడ్యువర్సిటీ డైరెక్టర్ శ్రీ జినేష్ షా మాట్లాడుతూ ఈ సహకారం జైన తత్వ జ్ఞానాన్ని సృజనాత్మక విద్యా కార్యక్రమాల ద్వారా విస్తరించాలనే ఉద్దేశంతో ఏర్పడిందన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి



**గోపాలపట్నం, మార్చ్ 9, మేజర్‌న్యూస్:** కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధి జ్ఞానాపురం ఏరియా లో గుర్తు తెలియని వ్యక్తి (45)మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. ఈ మేరకు కంచరపాలెం పోలీసు లు తెలిపిన వివరాల ప్రకారం..గుర్తు తెలియని వ్యక్తి, జ్ఞానాపురం ప్రాంతాలలో తిరుగుతూ స్థానికులు ఇచ్చిన ఆహారం తింటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల అనారోగ్యానికి గురై ఆదివారం మృతి చెందాడు. స్థానికులు డయల్ 112 కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. కంచరపాలెం పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి మృతుడి వివరాలపై ఆరా తీశారు. కుటుంబ సభ్యులు బంధువులు స్నేహితులు ఎవరూ లేకపోవడంతో అనాధ మృత దేహం గా నిర్ధారించి కేజీహెచ్ కు తరలించారు. అతనిని స్థానికులు నర్సింగ్ అని పిలుస్తారని సమాచారం. కుటుంబ సభ్యులు బంధువులు ఎవరైనా ఉంటే కంచరపాలెం పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలని సిఐ రవికుమార్ కోరారు.

## నూకాలమ్మ ఉత్సవాలు కు మాజీ మంత్రి కి ఆహ్వానం పలికిన కమిటీ సభ్యులు



**భీమిలి, మార్చి 09, మేజర్‌న్యూస్:** భీమిలి లో ప్రతీ ఏటా అంగరంగ వైభవంగా నిర్వహించే నూకాలమ్మ ఉత్సవాలు కు హాజరు కావాలని నిత్య ఆధ్యాత్మిక దైవా ఆరాదికులు అయిన (మాజీ మంత్రి) ముత్తంశెట్టి శ్రీనివాసరావు కు సోమ వారం నూకాలమ్మ ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానం పలకడం జరిగింది. ఈ కార్యక్రమంలో అక్కరమాని రామానాయుడు,శిల్లా కరుణాకర్ రెడ్డి,గంటా నూకరాజు,కరుభుక్త ప్రభాకర్ నాయుడు,కంచర్ల కామేష్,అప్పికొండ బాలకృష్ణ,భాగం స్వాతి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఉపయుక్తంగా అగ్రి డివైజ్ రూపకల్పన చేసిన ఏయూ అంబేద్కర్ చైర్

**– పంటలకు ఆశించే కీటకాల ఉధృతిని గుర్తించే సాంకేతికత పరికరం – సాంకేతికతను సామాజిక అవసరాలను వినియోగించే దిశగా కృషి – అభినందించిన అంబేద్కర్ ఫౌండేషన్ డైరెక్టర్ మనోజ్ తివారి**




**విశాఖ ఎడ్యుకేషన్, మార్చి 9, మేజర్‌న్యూస్:** విశాఖపట్నం ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చైర్ రైతులకు ఉపయుక్తంగా నిలచే విధంగా అభివృద్ధి చేసిన “అగ్రి ఏ ఐ డివైజ్ -- అడాప్టివ్ ఐ ఒ టీ – ఏ ఐ పెస్ట్ కంట్రోల్ సిస్టమ్ విత్ ఎల్ ఎల్ ఏం ఇంటిగ్రేషన్” వినూత్న పరికరాన్ని విశాఖ జిల్లా పెందుర్తి మండలం, పినగాడి గ్రామంలోని వ్యవసాయ క్షేత్రాల్లో లాంఛనంగా ప్రారంభించారు. భారత ప్రభుత్వ సామాజిక న్యాయం సాధికారత మంత్రిత్వ శాఖ ఆర్థిక సహాయంతో రూపొందించిన ఈ పరికరాన్ని, ఐపీఎస్ అధికారి, డాక్టర్ అంబేద్కర్ ఫౌండేషన్ డి ఏ ఎఫ్ డైరెక్టర్ మనోజ్ తివారీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మనోజ్ తివారీ, ఐ పి ఎస్ మాట్లాడుతూ డిజిటల్ ఇండియా మానవ అభివృద్ధి, అంతర్–విజ్ఞాన పరిశోధనల ద్వారా అణగారిన వర్గాల సాధికారత కోసం అంబేద్కర్ చైర్ చేస్తున్న కృషిని కొనియాడారు. సాంకేతికతను సామాజిక లక్ష్యాలతో జోడించడం ద్వారా అంబేద్కరిజంను సమకాలీన రూపంలో అమలు చేస్తున్నారని అభినందించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలకు సిద్ధమవుతున్న తరుణంలో, సామాజిక ప్రయోజనం ఉన్న ఇటువంటి సాంకేతికతను అభివృద్ధి చేసినందుకు ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్, వారి పరిశోధక బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, పంచాయతీ అధ్యక్షులు, స్థానిక రైతులు, విద్యావేత్తలు పాల్గొన్నారు. ప్రారంభోత్సవం అనంతరం, ఈ పరికరం పనితీరును క్షేత్రస్థాయిలో ప్రదర్శించారు. ఇది పంటను ఆశించే పురుగులను గుర్తించడం, పంట పరిస్థితిని విశ్లేషించడం, ఆ వివరాలను ఫోటోలతో సహా నేరుగా రైతు మొబైల్ ఫోన్‌లకు సందేశాల రూపంలో పంపడాన్ని ప్రత్యక్షంగా చూపించారు. ప్రాజెక్ట్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ మరియు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్ ఎం. జేమ్స్ స్టీఫెన్ పరికరం పనితీరు, ప్రయోజనాలను రైతులకు వివరించారు. అగ్రి ఏ ఐ పరికరం ప్రత్యేకతలు: అధునాతన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏ ఐ, ఐ ఒ టీ సాంకేతికతతో పనిచేస్తుంది. పంట పొలాల్లో పురుగుల ఉధృతిని గుర్తించి, శాస్త్రీయమైన నివారణ చర్యలను సూచిస్తుంది. రైతులకు అర్థమయ్యేలా సమాచారాన్ని వారి మాతృభాష (తెలుగు) లోనే అందిస్తుంది. సరైన పరిమాణంలో పురుగుమందుల వాడకాన్ని సిఫార్సు చేయడం ద్వారా ఖర్చును తగ్గిస్తుంది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాల స్ఫూర్తితో, రైతుల ఆర్థిక సాధికారత మరియు స్థిరమైన వ్యవసాయ అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని దీనిని రూపొందించారు. వ్యవసాయాన్ని ఒక పరిశ్రమగా చూడాలన్న బాబాసాహెబ్ ఆలోచనలకు అనుగుణంగా, ముఖ్యంగా చిన్నకారు రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ ఆవిష్కరణ జరిపారు. ఈ కార్యక్రమంలో రాంపురం గ్రామ ప్రెసిడెంట్ రెడ్డి నారాయణరావు, పినగాడి గ్రామ ప్రెసిడెంట్ బి. జైరాం తదితరులు పాల్గొన్నారు. ప్రొఫెసర్ ఎం. జేమ్స్ స్టీఫెన్ వందన సమర్పణ చేస్తూ, కేంద్ర మంత్రిత్వ శాఖకు మరియు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా తన పరిశోధక విద్యార్థి ఇ. అనిరుధ్ అందించిన సాంకేతిక సహకారాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. అనంతరం, రైతులకు ఈ పరికరం వాడకంపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన శిక్షణ వర్క్‌షాప్‌ను మనోజ్ తివారీ ప్రారంభించారు. ఈ ఆవిష్కరణ చిన్నకారు రైతులు తమ పంటలను రక్షించుకోవడానికి మరియు దిగుబడిని పెంచుకోవడానికి ఒక మైలురాయిగా నిలుస్తుంది.

# దివ్యాంగుడికి అండగా ముత్యాల రాజేష్ బాబు



**అనకాపల్లి ప్రతినిధి, మార్చి 9, మేజర్‌న్యూస్:** కష్టాల్లో ఉన్నవారికి చేయూతనివ్వడంలో ముందుండే ఎంవిఆర్ కుటుంబం మరోసారి మానవత్వాన్ని చాటుకుంది. ఎంవిఆర్ తనయుడు రాజేష్ బాబు రెండు కాళ్లు లేని దివ్యాంగుడి దయనీయ పరిస్థితిని తెలుసుకుని వెంటనే స్పందించారు. యాక్సిడెంట్‌లో రెండు కాళ్లు కోల్పోయిన బాధితుడు ప్రస్తుతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకున్న రాజేష్ బాబు చలించిపోయారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని నర్సింగరావుపేటలో గల ఎం.వి.ఆర్ ప్రధాన కార్యాలయంనకు వచ్చి, తన సమస్యను వివరించిన పట్టణంలోని గవరపాలెశీ లో అద్దెకు నివాసం ఉంటున్న ఆర్. వెంకట రమణ అనే బాధితుడుకు... భవిష్యత్తులో అతనికి కృత్రిమ కాళ్లు (కృత్రిమ అవయవాలు) అమర్చు కునేందుకు ఉపయోగ పడేలా రూ.20 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. తమ కార్యాలయానికి వచ్చిన బాధితుడిని స్వయంగా పరామర్శించి ఆయనకు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా బాధితుడికి ధైర్యం చెప్పి, అవసరం ఉన్నప్పుడు తాము అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కష్టాల్లో ఉన్నవారికి చేయూత ఇవ్వడం మనందరి బాధ్యత అని రాజేష్ బాబు తెలిపారు. మాలాగ.. కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలవడం ఎంవిఆర్ కుటుంబానికి ప్రత్యేకతగా మారిందని బాధితుడు వెంకటరమణ ప్రశంసించారు.

# రాష్ట్రస్థాయి పోటీల్లో దూసుకుపోతున్న అనకాపల్లి జిల్లా రగ్బీ జుట్టు...

**అచ్చుతాపురం, మార్చి 9, మేజర్‌న్యూస్:** యు – 12 రాష్ట్రస్థాయి పోటీలు గన్నవరంలో ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్ సహకారంతో కృష్ణాజిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో 8, 9 తేదీల్లో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో అనకాపల్లి జిల్లా ఇరు జట్లు క్వార్టర్ ఫైనల్ కీ ఎంపిక అయ్యాయని జిల్లా సెక్రెటరీ కూండ్రపు నాగ వెంకటరావు తెలియజేశారు లీగ్ స్టేజ్లో బాలుల జట్టు వెస్ట్ గోదావరి 0–5, రెండో మ్యాచ్ కడప పై 0–10 ట్రేస్ పెట్టి క్వార్టర్ ఫైనల్ కి చేరుకున్న బాలుల జట్టు అదేవిధంగా బాలికలు జట్టు చిత్తూరు 0–5 రెండవ మ్యాచ్ కృష్ణ తో 0–0 టై గా మార్చుకుని పూల్ రన్నర్స్ క్వార్టర్ ఫైనల్ కు ఎంపిక కావడం పట్ల జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు కూండ్రపు వెంకు నాయుడు కోచ్ లాగా వ్యవహరించిన బొడ్డి కుసుమ, ధర్మిరెడ్డి వసంత మేనేజర్ రాజన్న బాల , గొర్లి హారిక ను అభినందించారు జిల్లాకి గొప్ప పేరు ప్రఖ్యాతలు తీసుకొస్తున్న రగ్బీ క్రీడాకారులను జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ జగదీష్, రెడ్డి చిరంజీవి , డాక్టర్ వెంకట్, డాక్టర్ సుధీర్ లు జిల్లాకి మరి ఎన్నో విజయాలు సాధించాలన ఆకాంక్షించి శుభాకాంక్షలు తెలిపారు




# మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ని కలిసిన మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజ్, వై.సి.పి రాష్ట్ర కార్యదర్శి పైల శ్రీనివాసరావు



**పరవాడ, మార్చి 9, మేజర్‌న్యూస్:** మాడుగుల నియోజకవర్గం తారువ గ్రామంలో నూతనంగా శ్రీకాకుళం , మన్యం జిల్లాల వై.సి.పి రీజనల్ కో ఆర్డినటర్ గా నియమితులైన సందర్భంగా మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు స్వగృహం నందు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి , దుశ్శాలువ తో సత్కరించి అభినందనలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజ్, వై.సి.పి రాష్ట్ర కార్యదర్శి పైల శ్రీనివాసరావులు. వీరు వెంట,సబ్బవరం ఎంపీపీ బొకం సూర్యకుమారి రాము నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు కోన రామారావు, మాజీ ఎంపీపీ ముత్యాల నాయుడు, వార్డు అధ్యక్షుడు మేంటి మహేష్, రాపర్తి మాధవ రావు, అంతకపల్లి సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, వై.సి.పి నాయకులు కోటాన రాము, కావలి వాసు, పెందుర్తి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవి సాంబ మూర్తి, మాజీ వైస్ చైర్మన్ పైల అప్పల నాయుడు, వేపద శ్రీను, సురేష్ రాజ్, జతిన్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండీకి 46 వినతులు

**– ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ఐఏఎస్**



**విశాఖపట్నం, మార్చి 9, మేజర్‌న్యూస్:** విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న ‘డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండీ’ కార్యక్రమానికి విద్యుత్ సంబంధిత సమస్యలు 46 వచ్చినట్లు ఏపీఈపీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. విశాఖపట్నంలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం ఉదయం నిర్వహించిన డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండీ కార్యక్రమంలో వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను నేరుగా సీఎండీ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఇందులో ప్రధానంగా విద్యుత్ సరఫరాకు సంబంధించి లో–వోల్టెజ్, విద్యుత్ స్తంభాల మధ్య వైర్లు వేలాడుతుండడం, విద్యుత్ లైన్ల మార్పు, విద్యుత్ బిల్లులు, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి, విద్యుత్ కనెక్షన్ మంజూరు, విద్యుత్ బిల్లులో పేరు మార్పు, రూఫ్ టాప్ సోలార్, విద్యుత్ స్తంభాలపై వాణిజ్య ప్రకటనల నంబర్లను ముద్రించడం, తదితర సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా సీఎండీ పృథ్వీతేజ్ మాట్లాడుతూ ‘డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండీ’ కార్యక్రమం ద్వారా వచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్ 1912 కు కాల్ చేయడం లేదా వాట్సాప్ నంబరు 9493681912 కు చాట్ చేయడం ద్వారా కూడా తమ విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు టి.వి.సూర్యప్రకాష్, టి.వనజ, సీజీఎంలు వి.విజయలలిత, ఎల్.దైవప్రసాద్, జీఎం లు ఎం.ఝాన్సీ, వి.వి.ఎస్.ఎన్.వి.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# శక్తి యాప్ తో బాలలకు రక్షణకు




**కోటబొమ్మాళి, మార్చి09, మేజర్‌న్యూస్:** సమాజంలో బాలల రక్షణ కోసమే పోలీస్ శాఖ శక్తి యాప్ ను అమల్లోకి తెచ్చిందని శక్తి యాప్ టీం టెక్కలి పరిధి హెడ్ కానిస్టేబుల్ ఎం. గిరిధర్, కోటబొమ్మాళి స్టేషన్ పరిధి హెడ్ కానిస్టేబుల్ కే. గణేష్ అన్నారు. సోమవారం టెక్కలి సబ్ డివిజన్ శక్తి టీం కార్యక్రమాన్ని కోటబొమ్మాళి మహాత్మ జ్యోతి రావు పూలే వెనకబడిన తరగతుల గురుకుల పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా ముఖ్యంగా విద్యార్థులు వారి యొక్క చదువుపై దృష్టి పెట్టి బాగా చదవడానికి, వారికి ఏదైనా ఇబ్బందికర పరిస్థితులు లో ఉన్నప్పుడు పోలీస్ హెల్ప్ లైన్ నెంబర్లు 181 మరియు 112, మరియు 1091, నెంబర్లు యొక్క వినియోగం గూర్చి, వేధింపులు గృహహింస, అంతేకాకుండా 1930 సైబర్ మోసానికి గురైనట్లయినా, మరియు మారకద్రవ్యాలు జరుగుతున్నట్లు తెలిసిన వాటిని నిర్మూలించాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. అలాంటి సందర్భాల్లో వినియోగం కోసం 1972 మరియు, 1098 బాల్య వివాహాలు, బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలన వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే ఇటువంటి వాటిపై అవగాహన కలిగి సమాజాన్ని సన్మార్గంలో నడిపించేందుకు మీ వంతు కృషి చేస్తూ ఇటువంటి రుగ్మతలకు ఫుల్ స్టాప్ పెట్టేందుకు యువత నడుంబిగించాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా మహిళలు జాగ్రత్త వహిస్తూ శక్తి యాప్ను సద్వినియోగం చేసుకోవాలని, పై నెంబర్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు మహిళా కానిస్టేబుల్ కే. రమణమ్మ, (సార్వకోట ఎం. జె. పి) ప్రిన్సిపాల్ ఎస్ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## చీవీమీ స్కాలర్షిపికి 9 మంది విద్యార్థులు ఎంపిక



**మెలియాపుట్టి. మార్చ్ 9. మేజర్ న్యూస్:** మెళియాపుట్టి మండలం చాపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిది మంది విద్యార్థులు టంకల రమ్య శ్రీ, ధర్మాన శృతి, సాప హేమచరణ్, గెదెల యాగప్రియా, బొచ్చు కావ్యశ్రీ, పెద్దింటి వరుణ్ నారాయణ, గెదెల అఖిల్, కురమాన ఎస్టర్ రాణి,బెజ్జి ధవన్లు చీవీమీ స్కాలర్షిపికి అర్హత సాధించారని హెచ్ఎం వ్యాస గీత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు ఉపాధ్యా యులు, గ్రామస్థులు అభినందించారు.

# మానవత్వం చాటుకున్న కర్రి సాయికృష్ణ

**మునగపాక, మార్చి 9 ,మేజర్‌న్యూస్:** మండల కేంద్రమైన మునగపాక గ్రామంలోని స్థానిక సెట్టిబలిజ కాలనీకి చెందిన గండిమని పెంటారావు ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్ కారణంగా ఆకస్మికంగా మరణించాడు. కుటుంబానికి ప్రధాన ఆధారంగా ఉన్న పెంటారావు మరణంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఇదే సమయంలో ఆయన తండ్రి కూడా అనారోగ్యంతో బాధపడుతూ ఉండటంతో కుటుంబంపై ఆర్థిక భారం మరింత పెరిగింది. కుటుంబంలో ఆదాయం లేకపోవడంతో వారి పరిస్థితి చాలా క్లిష్టంగా మారింది.ఈ విషయం తెలుసుకున్న శ్రీ ధర్మ ఫౌండేషన్ చైర్మన్ కర్రి సాయికృష్ణ, ఆ కుటుంబానికి సహాయం చేయాలని నిర్ణయించారు. మానవత్వంతో ముందుకు వచ్చి, బాధలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచారు. శ్రీ ధర్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ సభ్యులతో కలిసి స్థానిక ఇందిరమ్మ కాలనీలో అద్దెకు నివాసం ఉంటున్న వారి ఇంటికి వెళ్లి రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులనుఅందజేశారు. బియ్యం, పప్పులు, నూనె, కూరగాయలు మరియు ఇతర అవసరమైన సరుకులను అందిస్తూ కుటుంబానికి ఆర్థికంగా కొంత ఉపశమనం కలిగేలా చర్యలు చేపట్టారు.కుటుంబంలో కొడుకు మృతి చెందడంతో తీవ్ర దుఃఖంలో ఉన్నప్పటికీ, పెద్ద కొడుకులా ముందుకు వచ్చి సహాయం అందించిన కర్రి సాయికృష్ణకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు,ఈ సందర్భంగా మాట్లాడిన శ్రీ ధర్మ ఫౌండేషన్ చైర్మన్ కర్రి సాయికృష్ణ, సమాజంలో



ఆర్థికంగా వెనుకబడిన మరియు కష్టాల్లో ఉన్న కుటుంబాలకు సహాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రజా సేవను లక్ష్యంగా పెట్టుకుని మరియు ధర్మాన్ని కాపాడే ఉద్దేశంతోనే శ్రీ ధర్మ ఫౌండేషన్‌ను స్థాపించడం జరిగిందని ఆయన తెలిపారు. ముఖ్య ఉద్దేశ గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలిచి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడం ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని తెలిపారు.ఈ సేవా కార్యక్రమంలో శ్రీ ధర్మ ఫౌండేషన్ సభ్యులు రంగాల అనిల్, యశోద కృష్ణ, ప్రసాద్, కళ్యాణ్, వెంకట్రావు, పూర్ణ, గణేష్, భాస్కర్, వేణు తదితరులు పాల్గొన్నారు

## ఆర్.ఈ.సి.ఎస్ లో క్యాంపస్ ఇంటర్వ్యూలు




**కశింకోట(అనకకపల్లి), మార్చి 9, మేజర్‌న్యూస్:** స్థానిక రాజీవ్ గాంధీ ఆర్.ఈ.సి.ఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో అచ్యుతాపురంలోని యాక్షన్ టెసా అనే మాన్యుఫాక్చరింగ్ యూనిట్ కొరకు డిప్లొమా మెకానికల్, ఆటోమొబైల్, ఇన్స్ట్రుమెంటేషన్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలు ఈ నెల 11వ తేదీన అనగా బుధవారం నాడు నిర్వహించబడునని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.ఉమా శంకర్ తెలియచేశారు. కళాశాల ప్రాంగణంలో సోమవారం జరిగిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ క్యాంపస్ ఇంటర్యూల్లో ఎంపిక అయిన అభ్యర్థులకు నెలకు 15 వేల రూపాయల నెలవారీ జీతం ఉంటుందని, 2025, 2026 సంవత్సరాలలో ఉత్తీర్ణులై, డిప్లొమా విద్యార్హత కలిగిన అభ్యర్థులు వారి రెజ్యూమే, సర్టిఫికెట్ ల జెరాక్స్, ఒక పాస్పోర్ట్ సైజ్ ఫోటో తీసుకుని ఉదయం 9.30 గంటలకు కళాశాలలో జరిగే ప్రాంగణ ఎంపికలకు హాజరు అవ్వాలని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రిన్సిపల్ కె శివ, విభాగాధిపతులు, ఆఫీస్ సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

# జాతీయ అబాకస్ పోటీల్లో శ్రీభవాని విద్యార్థి ప్రతిభ




**– జాతీయ స్థాయిలో మూడో స్థానం సాధించిన చైతన్య తేజ**

**అచ్యుతాపురం, మార్చి 9, మేజర్ న్యూస్:** అచ్యుతాపురం మండలంలోని శ్రీభవాని విద్యానికేతన్ సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థి చైతన్య తేజ జాతీయ ఇలాకస్ పోటీల్లో ప్రతిభ కనబరిచి పాఠశాలకు గౌరవం తీసుకువచ్చాడు. హైదరాబాద్లో మార్చి 8న నిర్వహించిన జాతీయ స్థాయి అబాకస్ పోటీల్లో సీనియర్ లెవల్–3 విభాగంలో పాల్గొని జాతీయ స్థాయిలో మూడవ స్థానం సాధించి మెప్పించాడు. దేశంలోని తొమ్మిది రాష్ట్రాల నుంచి సుమారు 300 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. వీరిలో చైతన్య తేజ జాతీయ స్థాయిలో మూడవ స్థానం సాధించడం విశేషంగా నిలిచింది. చిన్న వయసులోనే అబాకస్ గణితంలో అద్భుత ప్రతిభ కనబరిచి అందరి ప్రశంసలు అందుకున్నాడు. వరంగల్కు చెందిన ప్రముఖ విద్యావేత్త డా జె.ఎస్. పరంజ్యోతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విశ్వం ఎడ్యుటెక్ సంస్థసీఈఓ ప్రసాద్ విజేతలను అభినందించి విద్యార్థును ప్రతిభను ప్రశంసించారు. పత్రాలు అందించారు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థి చైతన్య తేజను శ్రీభవాని విద్యానికేతన్ పాఠశాల వ్యవస్థాపకులు మూర్తి ప్రసాద్, కరస్పాండెంట్ సంతోష్ కుమార్, డైరెక్టర్ శ్రీలత ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థి సాధించిన ఈ విజయంపై పాఠశాల ఉపాధ్యాయులు, నిర్వాహకులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. శ్రీభవాని విద్యానికేతన్ పాఠశాల విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ విద్యా సాంస్కృతిక ప్రతి భాపర పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహిస్తూ మంచి ఫలితాలను సాధిస్తున్నదని పాఠశాల నిర్వహణ తెలిపింది.

## పారిపల్లెమ్మ అమ్మవారి పండుగ మహోత్సవం



**మునగపాక, మార్చి 9 ,మేజర్‌న్యూస్:** ఉత్తరాంధ్ర కే ప్రసిద్ధి చెందిన వాడ్రాపల్లి శ్రీ పారిపల్లెమ్మ అమ్మవారి పండుగ మహోత్సవం పదవ తేదీ మంగళవారం ఘనంగా నిర్వహించడానికి ఉత్సవ కమిటీ ఏర్పాటులు పూర్తి చేశారు, వాడ్రాపల్లి, గొల్లల పాలెం, నాగవరం, మల్లవరం, కుంచువానిపాలెం, అప్పికొండ వాని పాలెం, నారాయుడుపాలెం, తదితర గ్రామాలకు ఇలవేల్పు అయినా శ్రీ పారిపెల్లమ్మ వారి పండుగ ఘనంగా నిర్వహిస్తారు, ఎక్కడెక్కడో స్థిరపడిన ఉద్యోగులు వ్యాపారస్తులు వచ్చి అమ్మవారిని దర్శించి మొక్కులు తీరుస్తారు, గ్రామమంతా విద్యుత్ కాంతులతో, అమ్మవారి ప్రాంగణం నందు , సుందరంగా తీర్చిదిద్దారు, ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు, సాయంత్రం వేలు నేలవేసాలు, రాత్రి 8 గంటలకు డాన్స్ బేబీ డాన్స్, రేలా రేలా,వెంకటరమణ మూర్తి పాట,డాన్స్ హంగామా, వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు, ఈ ఉత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక ఎస్సై పి ప్రసాదరావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు,

# రూ.23 కోట్ల నిధులు మంజూరు



మాకవరపాలెం, మార్చి9, మేజర్ న్యూస్:నర్సీపట్నం డివిజన్ పరిధిలో గ్రామీణాభివృద్ధి పనుల కోసం పల్లె పండుగ--2 కార్యక్రమంలో భాగంగా రూ.23 కోట్ల నిధులు మంజూరయ్యాయని పంచాయతీరాజ్ శాఖ డీఈ ఈశ్వరరావు తెలిపారు. సోమవారం మాకవరపాలెం మండలంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు వంటి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మార్చి నెలాఖరు నాటికి అన్ని పనులు పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్ణయించామని తెలిపారు. పనుల నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.పల్లె పండుగ కార్యక్రమంలో మొదటి విడతలో 521 అభివృద్ధి పనులు చేపట్టగా వాటిలో 440 పనులు ఇప్పటికే పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల జేఈ సోమశేఖర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# బొడ్డేడకు శుభాకాంక్షలు

**– తెలిపిన సర్పంచులు గొర్లె సూకూరాజు రాజన నాయుడు బాబు గొర్లె శ్రీను**

**అచ్యుతాపురం:మార్చ్ 9 మేజర్ న్యూస్:** వైసిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులుగానియమితులైన బొడ్డేడ ప్రసాద్ కి వైసిపి యలమంచిలి నియోజకవర్గ అచ్యుతాపురం మండలం వైసీపీ సర్పంచులు నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు ఈ సందర్భంగా సర్పంచుల గొర్లె సూకరాజు రాజన్న నాయుడు బాబు, శ్రీను మాట్లాడుతూ వైసీపీని బలోపేతం చేసి బొడ్డేడ ప్రసాద్ సారధ్యంలో వచ్చే ఎన్నికల్లో అన్ని స్థానాల గెలుపుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు తదితరులు పాల్గొన్నారు




ఆంధ్ర విశ్వ కళాపరిషత్ రేలుగు శాఖలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు ముగిసాయి. తెలుగు విభాగం అధ్యక్షులు ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షత వహిస్తూ స్త్రీ వాదం ఒక ఉద్యమంగా రావడానికి నేపథ్యాన్ని, ఫ్రెంచ్ విప్లవ కాలం నాటి రచయితల ప్రేరణను వివరించారు ముఖ్య అతిథి గా విచ్చేసిన బోర్డు అఫ్ స్టడీస్ చైర్మన్ ఆచార్య నల్ల సత్యనారాయణ నవసాహి తి ఇంటర్నేషనల్ వ్యవస్థా పక అధ్యక్షులు ఎస్ వి సూర్య ప్రకాశరావును సత్కరించారు డాక్టర్ డి వి సూర్యారావు ప్రసంగిస్తూ అన్ని మతాలు స్త్రీ పట్ల వివక్షను ప్రదర్శించారని స్త్రీ తాను కుటుంబానికి పరిమితమై పురుషుణ్ణి నాయకుణ్ణి చేసిందని అన్నారు తెలుగు సాహిత్యానికి మహిళల దోహదాన్ని వివరించారు స్త్రీ వాదం పురుష ద్వేషం కాదని స్త్రీ పురుషులు సమాన బాధ్యత తో సమాజ ప్రగతికి కృషి చేయాలని అన్నారు ఆచార్య వెలమల సిమ్మ న్న మాట్లాడు తూ స్త్రీని తర తరాలుగా మగ వారు అ ణ గ దొక్కారని స్త్రీ విద్య మాత్రమే ఆ జాతి ప్రగతికి దోహదం చేయగలదని మొత్తం స్త్రీ జాతిని విద్యా వంతురా ళ్లను చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని చెప్పారు గురజాడ చిత్రించిన స్త్రీ పాత్రల వై శిష్ట్యాన్ని విశ్లే షించారు డా. కొచెర్ల కోట సత్యనారాయణ మూర్తి మహిళా చైతన్యం వల్లనే సమాజం శక్తి మవుతుందని అన్నారు విశిష్ట అతిథి ఎస్. వి.సూర్య ప్రకాశ రావు నవసా హితి సంస్థ నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలను వివరించారు.

# కరణం ధర్మశ్రీతో మర్యాదపూర్వక భేటీ



**అచ్యుతాపురం మార్చ్ 9 మేజర్ న్యూస్:**వైఎస్సార్సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులుగా బొడ్డేడ ప్రసాద్ నియమితులైన సందర్భంగా, మాజీ ప్రభుత్వ విప్ మరియు పి ఏ సి సభ్యులు, యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ ని మర్యాదపూర్వకంగా కలుసుకుని శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, రాబోయే కార్యక్రమాలపై స్నేహపూర్వకంగా చర్చించారు.

# విద్యాపీఠం ఇంటర్మీడియట్ పరీక్షలు



**అనకాపల్లి, మార్చి 9, మేజర్ న్యూస్:** జిల్లాలో ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఇంటర్మీడియట్ పరీక్షలు 6 పరీక్షా కేంద్రాలలో నిర్వహించబడుతున్నాయని జిల్లా పాఠశాల విద్యా శాఖ అధికారి జి.అప్పారావు నాయుడు తెలిపారు. సోమవారం అనగా 9వ తేదీన జరిగిన పరీక్షకు మొత్తం 1094 మందికి గాను, 981 మంది హాజరయ్యారని, అనకాపల్లి జిల్లా పాఠశాల విద్యా శాఖ అధికారిగా చోడవరంలో ఉన్న పరీక్షా కేంద్రాలను సందర్శించడం జరిగిందిదని, అదేవిధంగా తనిఖీ బృందాలు పరీక్ష కేంద్రాలను సందర్శించడం జరిగిందన్నారు. ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు లేకుండా పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని, అదే విధంగా జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశాలతో అన్ని కేంద్రాల్లో పోలీసు బందోబస్తు, మంచినీటి సదుపాయాలు ఏర్పాటు చేశారని తెలియజేశారు.

# పరిశ్రమల ఏర్పాటుకు 4,259 ఎకరాల భూమి గుర్తింపు



**మాకవరపాలెం ,మార్చి9, మేజర్ న్యూస్:**మాకవరపాలెం మండలంలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతోంది. మండలంలోని నాలుగు రెవెన్యూ గ్రామాల పరిధిలో మొత్తం 4,259 ఎకరాల భూమిని పరిశ్రమలకు కేటాయించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పైడిపాల, బూరుగుపాలెం, పెద్దిపాలెం, తూటిపాల రెవెన్యూ గ్రామాల పరిధిలో ఉన్న భూమిని స్థానిక రెవెన్యూ అధికారులు ఇప్పటికే గుర్తించారు. ఈ నేపథ్యంలో సోమవారం రాష్ట్ర రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా, పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శాఖ కార్యదర్శి యువరాజ్, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ కలిసి ప్రతిపాదిత ప్రాంతాన్ని పరిశీలించారు. పరిశ్రమల అభివృద్ధికి అనుకూలమైన ప్రాంతాలు, మౌలిక వసతులు, రవాణా సదుపాయాలు వంటి అంశాలను అధికారులు సమీక్షించారు. మండలంలో ఏర్పాటు చేయబోయే పారిశ్రామిక కారిడార్‌ను జాతీయ రహదారితో అనుసంధానం చేసే ప్రణాళికలను కూడా పరిశీలించారు. పరిశ్రమల అభివృద్ధికి రవాణా సౌకర్యాలు కీలకమని అధికారులు పేర్కొన్నారు. హైవేతో అనుసంధానం కల్పిస్తే పరిశ్రమల స్థాపనకు అనుకూల వాతావరణం ఏర్పడటంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. మాస్టర్ ప్లాన్‌లో ఉన్న మార్గాలు, అనుసంధాన రహదారులు, అవసరమైన భూసేకరణ వంటి అంశాలపై అధికారులు సమగ్రంగా చర్చించారు. రాబోయే రోజుల్లో ప్రణాళిక అమలుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో వివి రమణ పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్న వారికి సీఎం సహాయ నిధి అండ



**– రూ.4.65 లక్షల చెక్కుల పంపిణీ– ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ**

**అచ్యుతాపురం, మార్చి 9 ,మేజర్ న్యూస్:**ఆపదలో ఉన్న పేదకుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. అచ్యుతాపురం మండలం దుప్పితూరు గ్రామంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ముగ్గురు లబ్ధిదారులకు రూ. 4,65,800 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన అందించారు. ఈ సందర్భంగా ప్రగడ మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నారని చెప్పారు. పేదరికం కారణంగా ఎవరూ చికిత్సకు దూరం కాకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. అనారోగ్యంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ సహాయం ఎంతో ఉపశమనం కలిగిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేశంశెట్టి వెంకటరమణ, బట్టి తాతాజీ, ప్రగడ జూనియర్ నాగేశ్వరరావు, ప్రగడ రాజు, కూనిశెట్టి రమణ, దేశంశెట్టి వెంకట్, దేశంశెట్టి, నా ప్రగడ చినసాగేశ్వరరావు, దేశంశెట్టి యల్లయ్యనాయుడు, దేశంశెట్టి కాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి జన సైనికుడు సభ్యత్వం విధిగా తీసుకోవాలి



**మునగపాక ,మార్చ్ 10 ,మేజర్న్యూస్:** ప్రతి జన సైనికుడు విధిగా, బాధ్యతగా జనసేన పార్టీ సభ్యత్వం తీసుకోవాలని స్థానిక శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ ఉన్నారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ్ కుమార్ మాట్లాడుతూ జన సైనికులు కూటమి ప్రభుత్వం లో మారుమూల సందుల్లో సైతం సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు, తదితర ప్రజా ఉపకారమైన అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ఈ సంక్షేమ పథకాలను ప్రజలలోనికి విధిగా తీసుకువెళ్లి, రానున్న స్థానిక ఎన్నికలలో కూటమి అభ్యర్థులు గెలిపే ధ్యేయంగా పనిచేయాలని అన్నారు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పార్టీ సిద్ధాంతాలు, నియమ నిబంధనలకు, లోబడి సభ్యత్వాలు చేయాలని, పార్టీలో కష్టపడిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని అన్నారు, సభ్యత్వం తీసుకున్న జనసైనికుడు ప్రమాదవశాత్తు మరణిస్తే ఆ కుటుంబాన్ని జనసేన పార్టీ ఆదుకోవాలని ఉద్దేశంతో ఇన్సూరెన్స్ పథకం ప్రవేశపెట్టిన ఘనత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దేనిని అన్నారు, ఈ కార్యక్రమంలో జనసైనికులు టెక్కలి పరుశురాం, కోయిలాడ దశావతారం, కాండ్రేగుల గాంధీ, ఎల్లపు భాస్కరరావు, ఏవి సత్యనారాయణ, ఆడారి గోవిందరావు,బొడ్డేడ అప్పలనాయుడు, మొల్లేటి ఆనంద్,సూరిశెట్టి శివాజీ,ఆడారి శ్రీకాంత్, అధిక సంఖ్యలో జనసైనికులు మహిళలు పాల్గొన్నారు

## 11న వాకపల్లిలో శ్రీ అభయాంజనేయ స్వామి తీర్థ మహోత్సవం



**దేవరాపల్లి, మార్చి 9, మేజర్‌న్యూస్:** మండలంలోని వాకపల్లి గ్రామంలో ఈనెల 11న శ్రీ అభయాంజనేయ స్వామి 14వ తీర్థ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు మాజీ ఎంపీటీసీ, ఆలయ ధర్మకర్త పెనగంటి సింహాచలం నాయుడు తెలిపారు. ఆరోజు ఉదయం నుంచి స్వామివారికి దుప,దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తితో పాటు మండలంలోని కూటమి నాయకులు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాస్థాయి గుర్రం పరుగు ప్రదర్శన జరుగుతుందన్నారు. అదే రోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి భారీ అన్న సమారాధన కార్యక్రమం జరుగుతుందని పెనగంటి సింహాచలం నాయుడు తెలిపారు.

## బాబురావును పరామర్శించిన మాజీ డిప్యూటీ సీఎం బూడి



**దేవరాపల్లి, మార్చి 9, మేజర్‌న్యూస్:** రోడ్డు ప్రమాదంలో గాయపడిన వైఎస్సార్సీపీ మండల అధ్యక్షుడు, బోయిలకింతాడ సర్పంచ్ బూరె బాబురావును మాజీ డిప్యూటీ సిఎం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల వైఎస్సార్సీపీ రీజనల్ కోఆర్డినేటర్ బూడి ముత్యాలనాయుడు సోమవారం పరామర్శించారు. ఈ నెల 7న సబ్బవరం మండలం గుల్లెపల్లి సమీపంలో బాబురావు ద్విచక్ర వాహనానికి కుక్క అడ్డు రావడంతో వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాబురావు ఆసుపత్రిలో చికిత్స అనంతరం సోమవారం స్వగ్రామంబోయిలకింతాడకు చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సిఎం బూడి ముత్యాలనాయుడు వెంటనే బోయిలకింతాడలోని బాబురావు ఇంటికి చేరుకొని పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.. బాబురావును పరామర్శించిన వారిలో జెడ్పిటీసీ కర్రి సత్యం, వైఎస్సార్సీపీ మండల యువజన అధ్యక్షుడు కర్రి సూరినాయుడు, వైఎస్సార్సీపీ యువజన విభాగం అనకాపల్లి జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ బొబ్బిలి రాము తదితర నాయుకులు, గ్రామస్తులు ఉన్నారు.

## గొలుగొండలో ఎంపీడీవో కు హెల్త్ సెక్రటరీల వినతిపత్రం

**గొలుగొండ, మార్చి 9, మేజర్‌న్యూస్:** మండలంలోని గ్రామ, వార్డు హెల్త్ సెక్రటరీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. వైద్య ఆరోగ్య శాఖ పనులతో పాటు సచివాలయం ఇతర విభాగాల నుంచి కూడా పనులు అప్పగించడంతో తీవ్ర పని ఒత్తిడికి గురవుతున్నామని తెలిపారు. దీంతో మానసికంగా, శారీరకంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు.

జీవో నెం.124 ప్రకారం హెల్త్ సెక్రటరీలకు వైద్య ఆరోగ్య శాఖ పనులు మరియు అత్యవసర సేవలకు సంబంధించిన పనులనే అప్పగించాలని, ఇతర జిల్లాల్లో అమలు చేస్తున్నట్లే మన జిల్లాలో కూడా వెంటనే అమలు చేయాలని కోరారు. యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే, పి--1 సర్వే, మున్సిపల్ యాప్స్ వంటి అనేక సర్వేలు నిర్వహించాల్సి రావడంతో మహిళా ఉద్యోగులైన తమకు రాత్రి వేళల్లో కూడా పని చేయాల్సి వస్తోందని, దీంతో భద్రత సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఇంక్రిమెంట్లు వెంటనే మంజూరు చేయాలని, ఎంపీహెచ్‌ఏ (ఎఫ్) ప్రమోషన్లకు సంబంధించిన పొజిషన్ ఐడీలు తక్షణమే కల్పించాలని కోరారు. గ్రేడ్--3 సచివాలయ ఉద్యోగుల నుంచి ఎంపీహెచ్‌ఏ (ఎఫ్) ప్రమోషన్లు ఖాళీల ఆధారంగా భర్తీ చేయాలని తెలిపారు. సరెండర్ లీవ్స్ మంజూరు చేయడంతో



పాటు సెలవులు మంజూరు చేసే విధానాన్ని సరళతరం చేయాలని విజ్ఞప్తి చేశారు.పనులు సమయానికి పూర్తి కాకపోతే మెమోలు ఇస్తామని, జీతాలు ఆలస్యంగా చెల్లిస్తామని చేసే హెచ్చరికలతో ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. తమ సమస్యలపై అధికారులు సానుకూలంగా స్పందించి పరిష్కారం చూపాలని హెల్త్ సెక్రటరీలు కోరారు.

## ఘనంగా జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం

### ముఖ్య అతిథిగా రాష్ట్ర సీనియర్ నాయకులు గడసాల అప్పారావు

**అచ్చుతపురం, మార్చి 9, మేజర్‌న్యూస్:** శ్రీ కృష్ణదేవరాయ సంక్షేమ భరోసా కేంద్రాల వ్యవస్థాపకులు కర్రి వెంకటరమణ, సావిత్రిబాయి పూలే మహిళా సంక్షేమ సంక్షేమ భరోసా సంఘం అధ్యక్షురాలు వాణిశ్రీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అనకాపల్లి జిల్లా ,ఎలమంచిలి నియోజకవర్గం తెరువుపల్లి గ్రామంలో శ్రీ కృష్ణదేవరాయ భరోసా కేంద్రం వద్ద మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి .ఈ కార్యక్రమంలో మహిళా మణులకు, వివిధ రంగాలలో సేవలందిస్తున్న మహిళలకు సన్మానాలు మహిళల ఐక్యత,అభివృద్ధి, సంక్షేమం, భద్రత గురించి ముఖ్య అతిథులు ప్రసంగాలు , మహిళలకు ఆటల పోటీలు, లక్కీ డ్రా లు విజేతలకు ముఖ్య అతిథులు చేతుల మీదుగా బహుమతులు ప్రధానం తదితర కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయిఈ కార్యక్రమానికి



ముఖ్య అతిథులుగా జనసేన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గడసాల అప్పారావు, లీగల్ అడ్వైజర్ తెలగారెడ్డి పుల్లయ్య నాయుడు, సీనియర్ అడ్వకేట్ మోహన్ రావు, అడ్వకేట్ తెలగారెడ్డి హరిప్రియ, గాజువాక మహిళా మాజీ కౌన్సిలర్ లంకా లత, గొంతిన సత్యవతి ,గల్లా అమ్మాజీ, స్వప్న, స్థానిక నాయకులు భోజా జయరాం ,మాజీ సర్పంచ్ పిల్లా సత్యవతి, భరోసా కేంద్రాల సభ్యులు, తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు

## తోటకూరపాలెంలో సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



**రావికమతం, మార్చి 9, మేజర్‌న్యూస్:** మండలంలో తోటకూరపాలెంలో సోమవారం సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. గ్రామంలో ఎంపీపీ స్కూల్ నుంచి పరదేశమ్మ ఆలయం, మెయిన్ రోడ్ నుంచి పోతులూరు వెళ్లే రోడ్లు అధ్వానంగా ఉన్నాయని వర్షం వస్తే ఈ రోడ్లపై నడవడం కష్టంగా ఉందని గ్రామానికి చెందిన తెలుగు నాడు స్టూడెంట్ ఫెడరేషన్ స్పోర్ట్స్ పర్సన్ పైలా అర్జున్ చోడవరం ఎమ్మెల్యే కె ఎస్ అని రాజు దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు పల్లెపండుగా -2 భాగంగా ఎన్ ఆర్ జి ఎస్ నిధులు 34 లక్షల రూపాయలు మంజూరుకు ఎమ్మెల్యే సిఫార్స్ చేశారు. ఈ నిధులతో చేపట్టే పనులు ప్రారంభమయ్యాయి. తమ గ్రామ అభివృద్ధికి సహకారాలు అందిస్తున్న ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ రాజు కు గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు.

## సావిత్రి భాయి పూలే మహిళా సంక్షేమ భరోసా సంఘం అధ్యక్షురాలు వాణిశ్రీ కి ఘన సన్మానం



**అచ్చుతపురం, మార్చి 9, మేజర్‌న్యూస్:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గాజువాక కేఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో సావిత్రిబాయి పూలే మహిళా సంక్షేమ భరోసా సంఘం అధ్యక్షురాలు కె.వాణిశ్రీ ని గాజువాక బిజెపి నాయకులు కరణం రెడ్డి నర్సింగరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ రంగాలలో సేవలందిస్తున్న మహిళలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కేఎన్ఆర్ ఫౌండేషన్ సభ్యులు గుంటూరు శంకర్రావు, లక్ష్మి, సుజాత వివిధ రంగాల ప్రముఖులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

## ముగిసిన వృత్తి నైపుణ్య విద్య ప్రాక్టికల్ పరీక్షలు



**నక్కపల్లి, మార్చి 9, మేజర్‌న్యూస్:**మండలం లో గొడిచెర్ల గ్రామం లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు వృత్తి విద్య ప్రాక్టికల్ పరీక్షలు సోమవారం ముగిశాయి. కంప్యూటర్ విభాగంలో ప్రాక్టికల్ పరీక్షలు పాఠశాలలోనే నిర్వహించామని ప్రధాన ఉపాధ్యాయులు యస్. బి. వి సత్య కుమార్ తెలిపారు. పరీక్షలకు 69 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వృత్తి విద్యా ఉపాధ్యాయులు బి. లలిత, ఎం.సాయి చంద్, తదితరులు పాల్గొన్నారు. ప్రాక్టికల్ పరీక్షల అనంతరం విద్యార్థులను ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అభినందించారు.

# ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 700 మంది మహిళలకు సన్మానం



**శ్రీకాకుళం మార్చి 9 మేజర్ న్యూస్ :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీకాకుళంలో ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళా సత్కార సభ ఘనంగా నిర్వహించారు. శ్రీకాకుళంలోని జాబిలి ఎస్ఎస్ఆర్ క్రిస్టల్ ప్యాలెస్‌లో జరిగిన ఈ కార్యక్రమాన్ని ట్రస్ట్ అధినేత డాక్టర్ సూర శ్రీనివాసరావు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ కేంద్రమంత్రి డా. కిల్లి కృపారాణి, మాజీ అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం సతీమణి తమ్మినేని వాణి, శ్రీకాకుళం ఎమ్మెల్యే గోండు శంకర్ సతీమణి మరియు తెలుగు మహిళ అధ్యక్షురాలు గోండు స్వాతి శంకర్, ఆముదాలవలస ఎమ్మెల్యే కూన ప్రమీల హాజరై కార్యక్రమాన్ని మరింత విశిష్టంగా నిలిపారు. కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం జిల్లా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న సుమారు 700 మంది మహిళలను ఘనంగా సన్మానించారు. ఉద్యోగ, సేవ, సామాజిక రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న మహిళలకు శాలువా, జ్ఞాపికలతో సత్కారం చేసి వారి కృషిని ప్రశంసించారు.

### మహిళలుసమాజానికిఆదర్శం: డా.కిల్లి కృపారాణి

ఈ సందర్భంగా మాజీ కేంద్రమంత్రి డా.కిల్లికృపారాణి మాట్లాడుతూ మహిళలు సహనానికి ప్రతీకలని అన్నారు. కుటుంబ వ్యవస్థను నిలబెట్టే శక్తి మహిళలదేనని పేర్కొన్నారు. సమాజంలో మహిళల పాత్ర అత్యంత కీలకమని, వారు ఆర్థిక, సామాజిక, విద్యా రంగాల్లో విశేష ప్రతిభ కనబరుస్తున్నారని తెలిపారు. మహిళల సహనం, ధైర్యం సమాజానికి మార్గదర్శకమని ఆమె పేర్కొన్నారు. మహిళల శక్తిని గుర్తించి వారికి మరింత అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని సూచించారు.

### ప్రతి మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలి: తమ్మినేని వాణి

తమ్మినేని వాణి మాట్లాడుతూ మహిళలు సృష్టికి మూలం అని అన్నారు. పుడమ తల్లిలాంటి మహిళల వల్లే ఈ ప్రపంచం ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రతి సంవత్సరం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవడం ద్వారా మహిళల సాధనలను గుర్తుచేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. మహిళలు తమలోని ప్రతిభను వెలికితీసుకుని సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆమె సూచించారు.

### మహిళలు దేశానికి కీర్తి కిరీటం: గోండు స్వాతి శంకర్

తెలుగు మహిళ అధ్యక్షురాలు గోండు స్వాతి శంకర్ మాట్లాడుతూ జాతీయస్థాయిలో ఎన్నో మహిళలు దేశానికి కీర్తి కిరీటాన్ని తెచ్చిపెడుతున్నారని తెలిపారు. రాజకీయాలు, క్రీడలు, శాస్త్ర సాంకేతిక రంగాల్లో మహిళలు ప్రతిభ చూపుతూ ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. యువత మహిళలు వారిని ఆదర్శంగా తీసుకుని తమ లక్ష్యాలను సాధించాలని ఆమె ఆకాంక్షించారు. మహిళల సాధన సమాజ అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు.

### ఓర్పు, సహనానికి ప్రతీక మహిళ: కూన ప్రమీల

ఆముదాలవలస ఎమ్మెల్యే కూన ప్రమీల మాట్లాడుతూ మహిళ అంటే ఓర్పు, సహనానికి మారుపేరని అన్నారు. కుటుంబం నుండి సమాజం వరకు మహిళలు అనేక బాధ్యతలను నిర్వర్తిస్తూ గొప్ప పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. మహిళలకు గౌరవం, సమాన అవకాశాలు కల్పించడమే నిజమైన మహిళా దినోత్సవ సందేశమని పేర్కొన్నారు. ప్రతి మహిళ తనలోని శక్తిని గుర్తించి ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు.

### మహిళా సాధనకు ప్రోత్సాహం: డా. సూర శ్రీనివాసరావు

కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ సూర శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళల ప్రతిభను గౌరవించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. సమాజంలో వివిధ రంగాల్లో కృషి చేస్తున్న మహిళలను ప్రోత్సహించడం తమ సంస్థ లక్ష్యమని చెప్పారు. భవిష్యత్తులో కూడా మహిళల అభివృద్ధికి మరిన్ని కార్యక్రమాలు చేపడతామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు ఆనందం వ్యక్తం చేస్తూ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. మహిళల ప్రతిభను గౌరవిస్తూ నిర్వహించిన ఈ సత్కార సభ శ్రీకాకుళం నగరంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# మహిళా సాధికారత సాధించాలి

**- కోడూరు ఉన్నత పాఠశాలలో మహిళా దినోత్సవ వేడుకలు**



**పోలాకి, మార్చి 9, మేజర్‌న్యూస్ :**జనాభా లో సగ భాగమైన మహిళలు అవకాశాలు అందిపుచ్చుకొని అన్ని రంగాలలో పురోగమించిన నాడే మహిళా సాధికారత సాధ్య పడుతుందని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,కోడూరు ప్రధానోపాధ్యాయులు జి.శాంతి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పాఠశాల లో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయులు జి.శాంతి ,ఉపాధ్యాయినిలు జి.మోహిని,ఎమ్.శాంతి, వి.హేమలత, పి.కళావతి, మహిళా ఉద్యోగులు కె.సూర్యకుమారి, రమణమ్మ, ఎమ్.రాధ మరియు ఆయాలు నాగమ్మ, విజయమ్మ లను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో శాంతి మాట్లాడుతూ మహిళలు తమ హక్కులు పట్ల అవగాహన కలిగి ఉండాలని అన్నారు. మహిళా ఉపాధ్యాయినిలు మోహిని,శాంతి,హేమ లత, కళావతి మాట్లాడుతూ మహిళలు చదువు కోవడం ద్వారానే చైతన్యం వస్తుందని, తద్వారా తమ సమస్యల పరిష్కారానికి తామే పోరాడగలరని అన్నారు. మహిళా ఉద్యోగులు సూర్య కుమారి,రమణమ్మ,రాధ మాట్లాడుతూ సమాజంలో మహిళల పట్ల వివక్ష తొలగిపోయి గౌరవంగా,సమానంగా చూసే రోజు రావాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి.శాంతి, ఉపాధ్యాయులు చింటాడ లక్ష్మణ రావు, ఎమ్.వేణుగోపాల రావు, మోహిని, వెంకట రమణ, నారాయణ రావు, శ్రీహరి, శాంతి, హేమలత, జగన్, బాడాన రాజు, రాజేశ్వర రావు, రఫీ, కళావతి, వసంత రావు, రాంబాబు, సూర్యకుమారి, గణేష్, రమణమ్మ, చంద్రయ్య, రాధ, ధర్మేంద్ర పాల్గొన్నారు.

# టిడిపిలో చేరిక

**- ఆహ్వానించిన ఎమ్మెల్యే బగ్గు**



**పోలాకి, మార్చి 9 ,మేజర్‌న్యూస్ :** పోలాకి మండలం మబగాం ఎమ్మెల్యే స్వగృహంలో ఈదులవలస పంచాయతీ చెందిన వార్డు సభ్యులు ఎండ మల్లేశ్వరరావు, సురాన అప్పారావు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా టిడిపి కండువాలు వేసి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పార్టీలోకి ఆహ్వానించారు. వార్డు సభ్యులతో పాటు 30 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బొమ్మాళి బలరాం ,దండుపాటి కుమార్ మరియు ముఖ్య నాయకులు,కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబాటు

**- ఆపదలో ఉన్న కుటుంబాలకు భరోసా- పేదల కుటుంబానికి పెద్ద కొడుకుగా చంద్రబాబు నాయుడు**

**- 42 మందికి సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ-ఎమ్మెల్యే గొండు శంకర్**



**శ్రీకాకుళం, మార్చి 9, మేజర్‌న్యూస్:**సోమవారం ఉదయం శ్రీకాకుళం నియోజకవర్గంలో ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. శ్రీకాకుళం నియోజకవర్గ ఎమ్మెల్యే గొండు శంకర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మొత్తం 42 మంది లబ్ధిదారుల కుటుంబాలకు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేసి వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు సీఎం సహాయనిధి ఎంతో తోడ్పాటు అందిస్తోందని తెలిపారు. ముఖ్యంగా అనారోగ్య చికిత్సలు, ప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితుల్లో ఈ నిధి కుటుంబాలకు పెద్ద ఊరటగా మారుతోందన్నారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు వారికి తోడుగా నిలబడటమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకే ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అవసరమైన వారికి తక్షణ ఆర్థిక సహాయం అందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, ప్రతి కుటుంబానికి అండగా నిలిచే విధంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి కి, ఎమ్మెల్యే గొండు శంకర్ కి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం అందించిన ఈ సహాయం తమ కుటుంబాలకు ఎంతో ఉపశమనాన్ని కలిగించిందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు మరియు ప్రజలు పాల్గొన్నారు. సీఎం సహాయనిధి ద్వారా అందుతున్న ఈ సహాయం ప్రభుత్వ ప్రజాహిత పాలనకు నిదర్శనమని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం లో టౌన్ పార్టీ అధ్యక్షులు పాండ్రంగి శంకర్ ,జనరల్ సెక్రటరీ కోరాడ హరిగోపాల్,స్టేట్ కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పొట్నూరు కృష్ణమూర్తి,గార పి ఎ సి ఎస్ చైర్మన్ అంపోలు మూర్తి,టౌన్ పట్టణ మహిళా అధ్యక్షురాలు పీరియ మాధవి,టౌన్, రూరల్ మరియు గార మండల నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు ,కూటమి నాయకులు,ప్రజలు పాల్గొన్నారు.

# రహదారి ప్రమాదంలో వృద్ధుడు మృతి



**జలుమూరు, మార్చి 9 ,మేజర్ న్యూస్ :** రహదారి ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందిన ఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే మండలంలోని లింగాలవలస గ్రామం వద్ద అదే గ్రామానికి చెందిన తండ్యాల సూర్యానారాయణ (80) సోమవారం ఉదయం రోడ్డు దాటుతుండగా లగేజి వ్యాను ఢీకొని మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు మేరకు రోజూ లాగే ఉదయం సమయంలో రోడ్డుకు అవతలవైపు బహిర్భూమికి వెళ్లేందుకు సూర్యానారాయణ రోడ్డు దాటుతుండగా చల్లవానిపేట నుంచి నరసన్నపేట వైపు వెళ్తున్న వ్యాను ఢీకొంది. దీంతో సూర్యానారాయణ తలకు బలమైన గాయం తగిలి అధిక రక్త స్రావం అవ్వడంతో ఘటనాస్థలంలోనే మృతి చెందాడు. మృతుడుకు ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. అల్లుడు వాన గోవిందరావు ఇచ్చిన పిర్యాదు మేరకు జలుమూరు ఎస్.ఐ బి. అశోక్ బాబు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి పని కల్పించాలి

**సంతబొమ్మాళి, మార్చి9,మేజర్ న్యూస్ :** జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి పని కల్పించాలని మాజీ ఎంపీపీ ప్రతినిధి కర్రి విష్ణుమూర్తి అన్నారు. మండలంలో నౌపడ పంచాయతీకి సంబంధించి స్థానిక సచివాలయంలో 2024- 25 ఆర్థిక సంవత్సరం సంబంధించి జరిగిన ఉపాధి పనులు, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్ పనులపై డిఆర్పి జె .హిమగిరి, బి. పాపారావు ఆధ్వర్యంలో సోషల్ ఆడిట్ చేపట్టి సోమవారం గ్రామసభ నిర్వహించారు. పంచాయతీకి సంబంధించి 93 ఉపాధి పనులకు గాను 98 లక్షల 13 వేల 475 రూపాయలు, పంచాయతీరాజ్ సంబంధించి 8 పనులకు గాను 14,51,252 ఆర్డబ్ల్యూఎస్ కు సంబంధించి ఐదు పనులకు గాను 94,437 రూపాయలు ఖర్చులపై సోషల్ ఆడిట్ వివరాలను తెలియజేశారు. ఉపాధి నేమ్ బోర్డుకి సంబంధించి 5400 అవినీతి జరినట్లు గుర్తించారు. ఎటువంటి ఇల్లు నిర్మాణం చేయకపోయినా సీతానగరం గ్రామానికి చెందిన బచ్చుల ఢిల్లీ రావుకు 12,298 రూపాయలు, అనపాన సరోజిని కి అదనంగా 18 రోజులు పేమెంట్ ను చెల్లించారని గుర్తించారు. మరణించిన తర్వాత కూడా దారపు రాజారావుకు మూడు వేల రూపాయలు, దుక్క సుందరమ్మకు 2100 ఇల్లు బిల్లులు చెల్లించినట్లు గుర్తించారు. గిన్ని సరోజిని పేరున ఉన్న ఇల్లు బిల్లులను కర్రి పురుషోత్తం అకౌంట్ కు 3200 రూపాయలు జమ అయినట్లు సోషల్ ఆడిట్ బృందం గుర్తించారు.



పంచాయతీరాజ్ కు సంబంధించి రోడ్డు పనులకు గాను పదివేల 737 రూపాయలు బిల్లులు చెల్లించిన దానికి సంబంధించి మాస్టర్లను అందజేయలేదని తెలియజేశారు. దుర్గమ్మ చెరువు సంబంధించి కొలతల ప్రకారం కాకుండా అదనంగా వేతనదారులకు బిల్లులు చెల్లించినట్లు సోషల్ ఆడిట్ బృందం గుర్తించారు. ఇతర గ్రామాలల్లో పనులు జరుగుతున్న మా పంచాయతీలో ఇంతవరకు ఉపాధి పనులు కల్పించలేదంటూ పలువురు వేతనదారులు సోషల్ ఆడిట్ బృందం దృష్టికి తెచ్చారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉప్పాడ ఉమాపతి, ఎస్ .స్వరూప్, కె.శంకర్ రెడ్డి, ఎల్ కుమార్, తదితరులు ఉన్నారు.

# భారతదేశం గర్వించ దగ్గ నాయకుడు కింజరాపు రామ్మోహన్ నాయుడు



**మెలియాపుట్టి. మార్చి 9. మేజర్ న్యూస్:**భారతదేశం గర్వించదగ్గ నాయకుడు కింజరాపు రామ్మోహన్ నాయుడు అని ఆయనపై వైసీపీ నేతలు తప్పుడు ఆరోపణలు చేయడం తగదని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సోమవారం తన కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ...కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పై వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలను ఖండించారు. కేంద్రమంత్రి జిల్లాకు చేసిన అభివృద్ధి వైసీపీ నాయకులకు కనిపించడం లేదా అన్ని ప్రశ్నించారు.ప్రజల్లో తమ ఉనికిని నిలబెట్టుకోవడానికి కొందరు నాయకులు అనవసర ఆరోపణలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు..ప్రపంచంలోనే ప్రతిష్టాత్మకమైన సంస్థ ఔశీతీశ్రీస జుఛశీఅశీఎఱఛ ఖీశీతీబఎ నుంచి యంగ్ గ్లోబల్ లీడర్ అవార్డు అందుకున్న రామ్మోహన్ నాయుడు గ సిక్కోలు జిల్లాకు గర్వకారణం అన్నారు.యువకుడిగా దేశ, రాష్ట్ర స్థాయిలో కృషి చేస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కట్టుబడి పనిచేస్తున్నారని పేర్కొన్నారు.ఒరిస్సాతో సంబంధం ఉన్న నీటి పారుదల సమస్యలపై కూడా రామ్మోహన్ నాయుడు పూర్తి అవగాహన ఉందని, పార్లమెంట్ సమావేశాల్లో మరియు ఇతర వేదికల్లో ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ పరిష్కారం కోసం కృషి చేస్తున్నారు అన్నారు. నేరేడి బ్యారేజ్ సమస్యను కూడా పరిష్కరిస్తానని ఆయన ఇప్పటికే హామీ ఇచ్చారని తెలిపారు.సిక్కోలు జిల్లాను అభివృద్ధి బాటలో నడిపించిన మహనీయుడు కీర్తిశేషులు కింజరాపు ఎర్రంనాయుడు పై కూడా అనవసర వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని అన్నారు.జిల్లాకు జాతీయ రహదారులు, పలు అభివృద్ధి కార్యక్రమాలు తీసుకువచ్చిన నాయకుడిగా ఆయన చరిత్రలో నిలిచారని గుర్తుచేశారు.కేంద్ర బడ్జెట్ ద్వారా శ్రీకాకుళం జిల్లాకు మత్స్యకారులు, రైతులు, పరిశ్రమల అభివృద్ధికి అనేక అవకాశాలు కలిగాయని ఎమ్మెల్యే తెలిపారు. పలాస జీడీ పరిశ్రమ, టూరిజం అభివృద్ధి, సి--ప్లేన్ టూరిజం వంటి కార్యక్రమాల ద్వారా జిల్లాలో అభివృద్ధి మరింత వేగవంతం కానుందని అన్నారు.విజనరీ నాయకుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , మంత్రి నారా లోకేష్ సహకారంతో శ్రీకాకుళం జిల్లా అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని చెప్పారు.ప్రజా అభివృద్ధి కోసం కృషి చేస్తున్న నాయకులపై అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని, ప్రజలు నిజాలను బాగా తెలుసుకుంటారని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

# ప్రజల నుంచి అర్జీలను స్వీకరించిన వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు



**కోటబొమ్మాళి, మార్చి 9, మేజర్ న్యూస్:**ప్రజా సమస్యల పరిష్కారం కోసం వచ్చిన వినతులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో వివిధ వర్గాల ప్రజల నుంచి వచ్చిన పలు విజ్ఞప్తులను మంత్రి స్వయంగా స్వీకరించారు. పంచాయితీ రాజ్ అధికారుల, రహదారుల శాఖ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనాల నిర్మాణ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకు రావాలని సూచించారు. పేద ప్రజల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి తెలిపారు. తనను కలిసిన బాధితుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. న్యాయబద్ధంగా ఉన్న సమస్యల విషయంలో సంబంధిత అధికారులతో అక్కడికక్కడే ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించారు. ఎక్కువగా రెవెన్యూ సమస్యలు, ఫించన్లు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వంటి సమస్యలు ఆయన దృష్టికి రాగా, ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు.క్షేత్రస్థాయిలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పాలనను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని నాయకులకు సూచించారు.సంతబొమ్మాళి, నందిగాం మండలాల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. అధికారులు ఈడీ సూర్యప్రకాష్, అంజిత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన విద్య



**నరసన్నపేట మార్చి 9 మేజర్ న్యూస్ :** నరసన్నపేట బోర్డు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి మండల విద్యాశాఖ అధికారి ఉప్పాడ శాంతారావు అడ్మిషన్ క్యాంపెనింగ్ నిర్వహించారు. పట్టణంలోని పలు వీధులలో ఇంటింటి ప్రచారం నిర్వహించి, ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన విద్య లభిస్తుందని, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పునాది శిక్షణ పొందిన ఉపాధ్యాయుల ద్వారా అందుతుందని, ఉచిత విద్యతోపాటు, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, ఉచిత పుస్తకాలు, యూనిఫాం, తల్లికి వందనం వంటి సదుపాయాలను ప్రభుత్వం అందిస్తుందని, విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉత్తమ విద్యను అందించేందుకు ఉపాధ్యాయ బృందమంతా కృషి చేస్తుందని, ఉపాధ్యాయుల సేవలను ఉపయోగించుకోవాలని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు తల్లిదండ్రులు అందరూ సహకరించాలని ఎంఈఓ అన్నారు. తల్లిదండ్రుల వద్ద నుండి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే ప్రవేశ దరఖాస్తులను తీసుకున్నారు. పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయిని బృందం పాల్గొన్నారు.

# 14 మందు సీసాలు స్వాధీనం



**మెలియాపుట్టి. మార్చి 9. మేజర్ న్యూస్ :** మెళియాపుట్టి మండలం రాజపురం గ్రామానికి చెందిన గరికపాటి శంకర్రావు 12 బీర్ బాటిల్స్, రెండు బాటిల్స్ అక్రమంగా తరలిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డాడు. మెళియాపుట్టి ఎస్ఐ మహమ్మద్ అమీర్ అలీ సోమవారం సిబ్బందితో వాహన తనిఖీలు చేపట్టారు. అటుగా వస్తున్న శంకర్రావును ఆపి పరిశీలించగా ఈ మందు సీసాలను గుర్తించారు. అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ఆయనతో పాటు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# అల్ ఇండియా టైక్వాండో పోటీలకు జాస్వికా



**టెక్కలిమార్చి 9. మేజర్‌న్యూస్:** శ్రీకాకుళం కోడి రామ్ మూర్తి స్టేడియం లో ఈరోజు డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ మహిళా టైక్వాండో ఎంపిక జరిగింది. ఈ పోటిల్లో టెక్కలి ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం కు చెందిన పులిబంద జాస్వికా ఉత్తమ ప్రతిభ కనపర్చి అల్ ఇండియా యూనివార్సిటీ టైక్వాండో పోటీలకు 57కేజీల మహిళా విభాగం లో పాల్గొంటుంది అని శిక్షకులు నర్సిపురం శేఖర్ తెలిపారు, ఈ పోటీలు ఒడిస్సా రాష్ట్ర బాలాసార్ పట్టణం లో గల ఫకీర్ మోహన్ యూనివర్సిటీ లో ఈ నెల 16,17,18,19 ఽ 20 తేదీల్లో జరుగుతాయి, ఈ ఎంపిక పట్ల జిల్లా క్రీడా అధికారి (డి ఎస్ డి ఓ) మహేష్ బాబు అభినందనలు తెలియజేశారు.